
గోన గన్నారెడ్డి
రూ॥ 230/-
పేజీలు: 266
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ, హిమాయత్‌నగర్ (హైదరాబాద్) హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★




అక్టోబర్ 3న హైదరాబాద్, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే 'అలయ్ బలయ్' కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆహ్వానించారు.


సంపుటి 08, సంచిక: 285 | సోమవారం | 15-09-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## 'డ్రగ్స్ తయారీ' పాఠశాల 'మేధా' సీజ్

మరో స్కూల్‌కు విద్యార్థులు-ఆందోళనలో తల్లిదండ్రులు





ప్రజాపక్షం/ హైదరాబాద్

స్కూల్ మాటున డ్రగ్స్ తయారు చేస్తున్న సికింద్రాబాద్ ఓల్డ్ బోయిన్ పల్లిలోని మేధా ప్రైవేట్ పాఠశాలను పోలీసులు సీజ్ చేశారు. అందులో చదువుతున్న స్కూల్ పిల్లలకు ప్రత్యామ్నాయంగా మరో స్కూల్‌కు మార్చాలని విద్యాశాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. మరోపక్క స్కూల్‌లో డ్రగ్స్ తయారీ బయటపడడంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఈ డ్రగ్స్ తయారీపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఈ మేరకు మేధా స్కూల్ అనుమతులను విద్యాశాఖ రద్దు చేసింది. బాలానగర్ తరువాయి 2లో

## అసోంలో భూప్రకంపనలు

- రిక్టర్ స్కేలుపై 5.8గా నమోదు
- ఉదల్గురి, సోనిత్‌పూర్, తముల్‌పూర్, నల్బారి జిల్లాల్లో కంపించిన భూమి



**గువహటి :** దేశంలోని ఈశాన్య ప్రాంతంలో ఆదివారం 5.8 తీవ్రతతో భూకంపం సంభవించిందని అధికారులు తెలిపారు. ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం సంభవించినట్లు నివేదికలు రాలేదని వారు తెలిపారు. సాయంత్రం 4.41 గంటలకు భూకంపం రాగా, ఉదల్గురి జిల్లాలో 5 కి.మీ. లోతున భూకంప కేంద్రం ఉందని అధికారులు తెలిపారు. అసోం ముఖ్యమంత్రి హిమంత ఎక్స్‌లో పోస్టు చేస్తూ భూకంపం ఉదల్గురి సమీపంలో ఉందని, ఇప్పటివరకు ఎటువంటి పెద్ద నష్టం లేదా ప్రాణ నష్టం జరిగినట్లు నివేదికలు రాలేదన్నారు. తాము పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. అసోంలోని ఉదల్గురి, సోనిత్‌పూర్, తముల్‌పూర్, నల్బారి, అనేక ఇతర జిల్లాల తరువాయి 2లో

## సెప్టెంబర్ 17న తెలంగాణ విలీన దినోత్సవంగా జరపాలి

- సిఎంకు సిపిఐ విజ్ఞప్తి
- రేవంత్‌రెడ్డికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు లేఖ



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వం సెప్టెంబర్ 17ను ప్రజా పరిపాలన దినోత్సవంగా కాకుండా, తెలంగాణ విలీన దినోత్సవం పేరుతో అధికారికంగా వేడుకలను నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తిచేశారు. ఈమేరకు ఆదివారం సిఎం రేవంత్‌రెడ్డికి కూనంనేని సాంబశివరావు బహిరంగ లేఖ రాశారు. 1947 ఆగస్టు 15న భారతదేశానికి ఆంగ్లేయుల నుంచి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ (తెలంగాణ సింహభాగంగా ఉన్న) హైదరాబాద్ సంస్థానానికి రాకపోగా, అప్పటికే హైదరాబాద్ సంస్థానంలో నైజాం రాచరిక పాలన, భూస్వాములు, రజాకార్ల ఆగడాలు పరాకాష్ఠకు చేరడంతో 1947 సెప్టెంబర్ 11న ఆంధ్రమహాసభ తరఫున రావి నారాయణ రెడ్డి, ఎఐటియుసి తరఫున మఖ్దూం మొహియొద్దీన్, కమ్యూనిస్టు పార్టీ తరుపున బద్దం ఎల్లారెడ్డి ముగ్గురు కలిసి సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని లేఖలో మరోసారి గుర్తుచేశారు. ఆ పిలుపుతో ప్రజలంతా ఏకమై తిరుబాటు చేశారని, నాటి ఈమహత్తర పోరాటంలో కమ్యూనిస్టుల వీరోచిత పాత్రతో పాటు, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ కూడా భాగస్వామిగా ఉందన్నారు. ఆ పోరాటం పతాకస్థాయికి చేరుకున్న ఫలితంగా 1948 సెప్టెంబర్ 17న పోలీసు చర్య పేరుతో హైదరాబాద్‌లోకి భారత సైన్యం ప్రవేశించగానే నిజాం లొంగిపోవడం, అదే రోజు తరువాయి 2లో

## మహానగరంలో జడివాన




- సాయంత్రంవేళ భయానక వాతావరణం
- భారీ వర్షంతో చెరువులను తలపించిన రహదారులు
- కిలోమీటర్ల మేర స్తంభించిన ట్రాఫిక్
- ఇక్కట్లకు గురైన లోతట్టుప్రాంత ప్రజలు

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మహానగరంలో వర్షం బీభత్సం సృష్టించింది. మహానగరంలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షం ఒక్కసారిగా భయానక వాతావరణం నెలకొంది. వర్షానికి నగరంలో రహదారులు జలమయ్యాయి. వర్షం నీటి వరదతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పలు ప్రాంతాల్లో వరదనీటితో వాహనాల రకపోకలు స్తంభించాయి. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోని నీరు చేరడంలో ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. దీంతో జిహెచ్‌ఎంసి, హైడ్రా యంత్రాంగం రంగంలోకి దిగ సహాయక చర్యలు చేపట్టాయి. ఈదురుగా గాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయి. గచ్చిబౌలిలో కుండపోత వర్షంతో నగరంలో ఎక్కడ చూసినా రహదారులు వరదీ నీటితో వాగులు, చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిసర ప్రాంతాల్లో వర్షం దంచి కొట్టింది. భారీగా కురుస్తున్న వర్షానికి రోడ్లతో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మోండా మార్కెట్, క్లాక్ టవర్, ఎంజీ రోడ్డు, బేగంపేట్, రసూల్ పుర, బోయిన్ పల్లి, తిరుమల గిరి, మారేడు పల్లి, అడ్డగుట్ట, మెట్టు గూడ, తరువాయి 2లో

## ఎన్నికలపై ఇసి ఆత్మపరిశీలన



- ఎస్ఐఆర్ నిర్వహించిన విధానం సరిగా లేదు
- రాహుల్‌పై విమర్శలకు బదులు ఆయన వ్యాఖ్యలపై దర్యాప్తు చేయాలి
- కేంద్ర ఎన్నికల సంఘం తీరును వ్యతిరేకించిన మాజీ సిఇసి ఖురేషీ

**న్యూఢిల్లీ :** ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం తీరును మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్. వై. ఖురేషీ వ్యతిరేకించారు. ఓట్ల చోరీ ఆరోపణలు చేస్తున్న రాహుల్‌పై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడానికి బదులు.. ఇసి వాటిపై దర్యాప్తునకు ఆదేశించి ఉండాల్సిందని ఆయన ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ప్రతిపక్ష నేత స్థానంలో ఉన్న రాహుల్ లేవనెత్తిన ప్రశ్నలు, చేసిన ఆరోపణలపై తరువాయి 2లో

## బూత్‌ల వారీగా ప్రచార ప్రణాళికలు



- జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో గెలుపుకోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలి
- సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు క్షేత్రస్థాయిల్లో తీసుకెళ్లాలి
- కాంగ్రెస్ శ్రేణులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలని, ఇందుకు పోలింగ్ బూత్‌ల వారీగా ప్రచార ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. త్వరలోనే తరువాయి 2లో

## 100 ఏళ్ళు దాటిన వృద్ధులు జపాన్ రికార్డు



ఆరోగ్యంగా జీవిస్తున్న వృద్ధుల సంఖ్యలో 55 ఏళ్లుగా ప్రథమస్థానంలోనే

**టోక్యో:** నూరేళ్ళ వయసుదాటిన తర్వాత కూడా ఆరోగ్యంగా జీవిస్తున్న వృద్ధుల సంఖ్యలో రికార్డు సృష్టించిన జపాన్ దేశం వరుసగా 55వ సంవత్సరంలో కూడా ఆ రికార్డును కొనసాగించింది. ఈ సెప్టెంబరునెల నాటికి జపాన్‌లో 100 సంవత్సరాలు దాటిన తర్వాత కూడా ఆరోగ్యంగా జీవిస్తున్న వృద్ధుల సంఖ్య 1,00,000 దాటిపోయిందని ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. వీరిలో 88 శాతం మంది మహిళలే ఉన్నారని జపాన్ ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రకటించింది. 87,784 మహిళలు, 11,979 మంది పురుషులు 100 సంత్సరాకంటే ఎక్కువకాలంగా జీవితం గడుపుతున్నారని జపాన్ ఆరోగ్యమంత్రిటకమారో పుకొకా ఒక ప్రకటనలో తెలియజేస్తూ వారందరికీ అభినందనలు తెలియజేశారు. 1981లో జపాన్‌లో తరువాయి 2లో

## బెగ్గర్స్ హోమ్స్‌ను సంస్కరించండి

- యాచకుల గౌరవప్రద జీవనహక్కును కాపాడక పోవడం రాజ్యాంగ ఉల్లంఘనే
- పోషకాహారం, పరిశుభ్రత, నెలనెలా వైద్య పరీక్షలు
- మార్గదర్శకాలు జారీ చేసిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** యాచకులకోసం ప్రభుత్వాలు ఏర్పాటు చేసే సంరక్షణ కేంద్రాల (బెగ్గర్స్ హోమ్స్)నిర్వహణకు సుప్రీంకోర్టు అనేక మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ యాచక సంరక్షణ కేంద్రాలలో గౌరవప్రదమైన జీవన పరిస్థితులు ఉండాలని తెలిపింది. ఆహార నాణ్యత, పోషకాహారం, పరిశుభ్రత, వైద్యపరీక్షలతో నిత్యం సక్రమ నిర్వహణకు తగిన ఆచరణాత్మక చర్యలు తీసుకోవాలని జస్టిస్ జె.బి.పార్థీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ మార్గదర్శకాల్లో తెలిపింది. ఎప్పటికప్పుడు నాణ్యతా ప్రమాణాలను, నిర్వహణను తనిఖీ చేయాలని కోరింది. పిల్లలు భిక్షాటన చేస్తూ కనిపిస్తే వారిని బెగ్గర్స్ హోమ్స్‌లో నిర్బంధించకుండా పిల్లల సంక్షేమ సంస్థలకు తరలించాలని స్పష్టం చేసింది. దీనికి సంబంధించి కొన్ని నమూనా మార్గదర్శకాలను మూడునెలల వ్యవధిలో రూపొందించాలని కేంద్ర సామాజిక న్యాయ, సాధికార మంత్రిత్వశాఖకు ఆదేశించింది. బెగ్గర్స్ హోమ్స్‌లో చేర్చుకునేముందుగా ప్రతివ్యక్తికీ అర్హుడైన మెడికల్ ఆఫీసర్‌తో వైద్యపరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని, తర్వాత 24 గంటల్లో వారికి ఆశ్రయం ఇవ్వాలని, యాచకులందరికీ నెలనెలా వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. కూటికి నోచుకోని నిరుపేదలకు యాచక సంరక్షణ కేంద్రాలలో గౌరవప్రదంగా జీవించే మౌలిక హక్కు కాపాడటంలో విఫలమైతే అది రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని హెచ్చరించింది. బెగ్గర్స్ హోమ్స్ నిర్వహణ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంత ప్రభుత్వాల బాధ్యతేననడంలో ఎలాంటి సందేహం లేదని పేర్కొంది. ఉత్తరఢిల్లీ జిల్లాలోని లాంపూర్‌లో ఉన్న బెగ్గర్స్ హోమ్‌లో తాగునీరు కలుషితం కావడం, వంట వండేందుకు ఉపయోగించే మంచినీరు కలుషితం కావడం, వాటిల్లో బాక్టీరియాలు చేరి యాచకులకు కలరా, గ్యాస్ట్రో సమస్యలు రావడంతో ఈ ఘటనలపై కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ కేంద్రాలలో సామర్థ్యానికి మించి ఎక్కువమందిని ఒకేచోట ఉంచకూడదని పేర్కొంది. ఈ కేంద్రాలలో వృత్తిపరమైన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని, యాచకులలో వివిధ రకాల నైపుణ్యాలు తరువాయి 12లో

## ప్రజాపోరాటాలు బలోపేతం




- సమస్యలపై సిపిఐ ఎల్లప్పుడూ గళం వినిపిస్తోంది
- వెనుకబడిన వర్గాల తరపున ఉద్యమాల్లో మరింత బలంగా ముందుకెళ్లాలి
- సిపిఐ జాతీయ కార్యదర్శి అమర్‌జీత్ కౌర్
- ఢిల్లీ సిపిఐ కార్యదర్శిగా దినేశ్‌చంద్ర వర్షిణే తిరిగి ఎన్నిక



**న్యూఢిల్లీ:** సిపిఐ ఢిల్లీ కార్యదర్శిగా ప్రొఫెసర్ దినేశ్ చంద్ర వర్షినే తిరిగి ఎన్నికయ్యారు. సిపిఐ 26వ ఢిల్లీ రాష్ట్ర మహాసభ దేశ రాజధానిలోని ఎఐటియుసి కేంద్ర కార్యాలయంలోని సురవరం సుధాకర రెడ్డి నగర్ ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా వర్షినే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహాసభలను సిపిఐ జాతీయ కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ ప్రారంభించారు. ప్రజల తరపున పోరాటాల బలోపేతానికి ఆమె పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై సిపిఐ ఎల్లప్పుడు గళం వినిపిస్తుందని అన్నారు. 100 ఏళ్ల పోరాట చరిత్రగల పార్టీ సిపిఐ ఒక్కటేనని చెప్పారు. కార్మికులు శ్రామికులు, వెనుకబడిన వర్గాల తరపున పోరాటాల్లో సిపిఐ మరింత బలంగా ముందుకు వెళ్లాలని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నిరంకుశ పాలనపై ప్రతిఘటన అవసరమన్నారు. ప్రజలు, కార్మికులు, రైతుల వ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకించాలని... లౌకివాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని అమర్‌జీత్ కౌర్ పిలుపునిచ్చారు. మహాసభలకు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి కె.నారాయణతో పాటు సీనియర్ నాయకులు, ప్రతినిధులు హాజరయ్యారు. తొలుత సీనియర్ నాయకుడు ప్రొఫెసర్ యజ్ఞదత్ శర్మ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అమరుల స్థూపం వద్ద నాయకులు నివాళులర్పించారు. సిపిఐ ఢిల్లీ కార్యదర్శి, జాతీయ సమితి సభ్యులు ప్రొఫెసర్ దినేశ్ చంద్ర వర్షినే సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టగా... సభ రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, మృతులకు నివాళులర్పించింది. ప్రొఫెసర్ దినేశ్ తిరిగి ఎన్నికైనందుకు నాయకులు, సహచరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## పోటాపోటీ ర్యాలీలు

- లండన్‌లో ఉద్రిక్తత
- ఘర్షణల్లో 26 మంది పోలీసులకు గాయాలు



**లండన్:** సెంట్రల్ లండన్‌లో శనివారం 1,50,000 మంది మితవాదులు "యునైట్ ద కింగ్డమ్" పేరుతో భారీ ర్యాలీ నిర్వహించారు. వలస ప్రజలకు వ్యతిరేకంగా, ఫాసిజాన్ని సమర్థిస్తూ బ్రిటన్ చరిత్రలో మునుపు ఎన్నడూలేని రీతిలో ఈ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని ప్రతిఘటిస్తూ, ఫాసిజం ఆలోచనాదృక్పథాన్ని తిరస్కరిస్తూ ప్రగతిశీలవాదులు మరో పోటీ ర్యాలీ నిర్వహించారు. మితవాద ర్యాలీలో పాల్గొన్న ప్రదర్శకులు పోలీసు ఆంక్షలు ఉల్లంఘించి పోటీ ర్యాలీలో ప్రదర్శకులమీదకు దూసుకువెళ్ళేందుకు ప్రయత్నం చేయడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ఉద్రిక్తతలను చల్లార్చేందుకు దాదాపు 1000 మంది బ్రిటన్ పోలీసులను ఈ ప్రాంతంలో మోహరించారు. పోలీసులు, పచ్చిమితవాద ప్రదర్శకులమధ్య తీవ్ర ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘర్షణల్లో 26 మంది పోలీసులు గాయపడ్డారు. ఇష్టానుసారంగా ప్రవర్తించిన 25 మంది ప్రదర్శకులను పోలీసులు ఎంపిక చేసి అరెస్టుచేశారు. వారిపై తరువాయి 12లో

## పత్తి రైతు మెడపై సుంకం రద్దు కత్తి



పడిపోనున్న ధర

భవిష్యత్తులో పంట సాగుపై నీలి నీడలు



ప్రజాపక్షం/ ఖమ్మం

కేంద్ర ప్రభుత్వం అమెరికా ఆంక్షలకు తలొగ్గి పత్తి దిగుమతులపై సుంకాన్ని రద్దు చేయడంతో పత్తి రైతు మెడపై కత్తి పెట్టినట్లయింది. ఇప్పటికే సహకరించని ప్రకృతి, పట్టించుకోని పాలకుల నడుమ పత్తి రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. అతివృష్టి, అనావృష్టి దిగుబడిపై ప్రభావం చూపుతుండగా గిట్టుబాటు ధర కల్పించడంలో పాలకులు వైఫల్యం చెందారు. ఈ నేపథ్యంలో దిగుమతి సుంకం రద్దుతో పత్తి ధర మరింత పతనమయ్యే పరిస్థితి నెలకొన్నది. గతంలో అమెరికా నుంచి దిగుమతి అయ్యే పత్తిపై భారత ప్రభుత్వం 11 శాతం దిగుమతి సుంకాన్ని విధించేది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తరువాయి 12లో

## దారుణం

- అనారోగ్య కుమారుడిని చంపేసి మూసీలో పడేసిన తండ్రి
- కుటుంబ కలహాలతో భార్య గొంతుకోసిన భర్త
- హైదరాబాద్‌లో వేర్వేరు చోట్ల ఘటనలు


ప్రజాపక్షం /హైదరాబాద్

మూడేళ్ల తన కుమారుడు తరచూ అనారోగ్యానికి గురికావడం.. చాలీచాలని సంపాదనతో కుటుంబం గడవడమే కష్టంగా మారిన పరిస్థితుల్లో కుమారుడి ఆరోగ్యం నయం చేసుకోలేక పోయాడు ఆ తండ్రి. ఆసుపత్రులకు డబ్బు కట్టే స్థోమత లేక అనారోగ్యంతో బాధపడుతున్న కుమారుడిని చంపేసి మూసీ నదిలో పడేసిన విషాదకర సంఘటన హైదరాబాద్‌లో తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సెనారోకు 27 ఏళ్ళు జైలుశిక్ష




**బ్రసిలియా :** బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సెనారో (70)కు ఆ దేశ సుప్రీంకోర్టు 27 సంవత్సరాల మూడు నెలలు జైలుశిక్ష విధించింది. దేశంలో ఎన్నికల వ్యవస్థను కుప్పకూల్చేందుకు సైనిక కుట్రచేశారన్న ఆరోపణలపై కేసు విచారణ తర్వాత కోర్టు ఈ తీర్పు చెప్పింది. 2019 నుండి 2023 వరకూ ఆయన బ్రెజిల్ అధ్యక్షుడుగా పనిచేశారు. ఆయనకు జైలుశిక్ష విధించడాన్ని ట్రంప్ తీవ్రంగా ఖండించారు. ఇది ఉద్దేశపూర్వక రాజకీయ కక్షసాధింపు కుట్రగా ఆయన పేర్కొన్నారు. 2022 ఎన్నికల్లో అధికారం కోల్పోయిన తర్వాత కూడా అధికారం నిలబెట్టుకునేందుకు ఆయన కుట్రకు పాల్పడ్డారన్న అభియోగం కోర్టులో రుజువైంది.



## గాజాసిటీ వదిలి వెళ్ళిపోయిన మూడు లక్షలమంది పాలస్తీనియన్లు

**గాజా:** గాజాసిటీలో ఐడిఎఫ్ దాడులు, హెచ్చరికల నేపథ్యంలో మూడు లక్షల మంది ప్రజలు ప్రాణభయంతో సామాన్లు సర్దుకుని దక్షిణ ప్రాంతానికి తరలివెళ్ళిపోయారు. ఇజ్రాయెల్ సైనికదళం ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన చేసింది. ఇప్పటికే గాజా సిటీలో 40 శాతం భూభాగం ఇజ్రాయెల్ సైన్యం చేతుల్లోకి వచ్చింది. శరణార్థ శిబిరాలుగా మారిన స్కూలు భవనాలు, తాత్కాలిక డేరాలపై కూడా ఇజ్రాయెల్ సైన్యం గగనతల దాడులు చేయడంతో ప్రజలు భయకంపితులవుతున్నారు. తాజాగా ఆదివారం చేసిన దాడుల్లో 48 మంది మరణించారు. స్కూలు భవనాలను ధ్వంసం చేశారు. మహిళలు కన్నీళ్ళతో ఆర్తనాదాలు చేస్తున్నారు. తమకు తలదాచుకోవడానికి సురక్షిత ప్రాంతం ఎక్కడ ఉందో చెప్పాలని వారు ప్రశ్నిస్తున్నారు. శనివారం ఐడిఎఫ్ చేసిన గగనతల దాడుల్లో 10 నివాసిత భవనాలు ధ్వంసమయ్యాయి. అన్నీ రెడ్‌జోన్‌లే ఉన్నాయని, తాము తలదాచుకోవడానికి తగిన ప్రదేశం ఎక్కడుందో చెప్పాలని బిడ్డలను పోగొట్టుకున్న పాలస్తినా మహిళలు ప్రశ్నిస్తున్నారు. కాగా బార్సిలోనా నుండి గతనెల 31న బయలుదేరిన ''ఫ్లోటెల్లా'' నౌకలు ట్యునీషియా రేవులో విశ్రాంతి తర్వాత గాజాకు తుది ప్రయాణం ప్రారంభించాయి. దాదాపు యాభై నౌకల్లో ఆహారం, మానవ సహాయం గాజా ప్రజలకు సరఫరా చేసేందుకు గ్రెటా థన్‌బర్గ్ నాయకత్వంలో వెళుతున్నాయి.



**వెస్టన్‌వాల్ సందర్శించిన రుబియో**

గాజాలో ఇజ్రాయెల్ దాడులు ఉధృతమైన తరుణంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఆదివారంనాడు జెరూసలెంలోని పవిత్రమైన వెస్టన్‌వాల్‌ను సందర్శించారు. ఆయన వెంట ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ, ఇజ్రాయెల్‌లో అమెరికా దౌత్యవేత్త మైక్ హక్కబీ ఉన్నారు. మొదటిసారి రుబియో అధికారికంగా ఇజ్రాయెల్‌లో పర్యటించారు. పురాతన వెస్టన్ వాల్‌కు ప్రకృతిసహజసిద్ధంగా పడిన బీటలను పరిశీలించారు. ఆ తర్వాత అక్కడ వారంతా ప్రార్థనలు చేశారు.

## బందీల విడుదలకు నెతన్యాహూ ఒక్కడే ఆటంకం

### టెల్‌అవీవ్‌లో వేలాదిమంది భారీ ప్రదర్శన



**టెల్‌అవీవ్:** బందీల విడుదలకు, శాంతి ఒప్పంద సాధనకు ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ ఒక్కడే పెద్ద ఆటంకంగా నిలబడ్డారని ఇజ్రాయెల్ ప్రజలు పెద్ద ఎత్తున విమర్శించారు. టెల్‌అవీవ్‌లో వేలాదిమందితో జరిగిన భారీ ప్రదర్శన (వీక్లీ ర్యాలీ)లో, దోహాలో గడచిన మంగళవారం హమాస్ అగ్రనాయకత్వ సమావేశం జరుపుతున్న భవంతిపై ఐడిఎఫ్ చేసిన దాడులను వ్యతిరేకిస్తూ ప్రదర్శకులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. బందీల విడుదలకు నెతన్యాహూ ఒక్కడే ఆటంకంగా మారాడని ప్రదర్శకులు నినాదాలు చేశారు. బందీల కుటుంబీకులు, గల్లంతైనవారి కుటుంబాల ఉమ్మడి వేదిక ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టింగ్ కూడా చేసింది. టెల్‌అవీవ్ లోని హోస్టేజెస్ స్క్వేర్ వద్ద ప్రదర్శకులను ఉద్దేశించి వేదిక నాయకులతోపాటు హమాస్ చెర నుండి గతంలో బయటపడి ఇజ్రాయెలీ ప్రజలు కూడా ప్రసంగించారు. ఆమె భర్త డేవిడ్ ఇప్పటికీ ఇంకా హమాస్ వద్ద బందీగానే ఉన్నారు. భర్తను పోగొట్టుకుని వైధవ్యం అనుభవించడానికి తాను సిద్ధంగా లేనని ఆమె అన్నారు. ప్రతి సెకనూ తీవ్ర జాప్యానికి, ప్రాణాంతకమైన ప్రమాదానికి దారి తీస్తుందని వారు హెచ్చరించారు. హమాస్ చెరనుండి బయటపడిన మాజీ బందీ షరోన్ అలోనీ క్యునియో ర్యాలీలో ప్రసంగిస్తూ, హమాస్ వద్ద బందీలుగా ఉన్న 48 మందిని విడుదల చేయడంలో నెతన్యాహూ తీవ్ర జాప్యం చేస్తున్నారని విమర్శించారు. బందీల విడుదలకు కుదిరిన తాత్కాలిక ఒప్పందాన్ని తిరస్కరించి ఆయన అనుసరిస్తున్న వైఖరి ప్రమాదకరంగా మారిందని, బందీల ప్రాణాలు అపాయంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు.

**ఆక్లాండ్‌లో 50 వేలమంది పాలస్తినా సంఘీభావ ర్యాలీ**

న్యూజిలాండ్ అతిపెద్ద నగరం ఆక్లాండ్‌లో 50 వేలాదిమంది ప్రజలు పాలస్తినా సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఇజ్రాయెల్‌పై కఠినమైన ఆంక్షలు విధించాలని సెంటర్‌–రైట్ న్యూజిలాండ్ ప్రభుత్వ పాలకులను ప్రదర్శకులు డిమాండ్ చేశారు. గాజా నుండి సైన్యం వెనక్కు వెళ్ళిపోవాలని, ప్రజలకు తగినంత ఆహార సరఫరా చేసేందుకు ఐక్యరాజ్యసమితి సంస్థలను అనుమతించాలని నినాదాలు చేశారు. గాజాలో ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన తర్వాత న్యూజిలాండ్‌లో ఇంతభారీ ప్రదర్శన జరగడం ఇదే మొదటిసారి. గతనెల ఆగస్టులో సిడ్నీలో ప్రఖ్యాతమైన హార్బర్ బ్రిడ్జిని స్తంభింపజేసి వేలాది మంది భారీ ప్రదర్శనను స్ఫూర్తిగా తీసుకుని పాలస్తినా సంఘీభావ 'ఆయోటెరోవా సమూహం'' సంస్థ ఈ ప్రదర్శన జరిపింది.

## ఇజ్రాయెల్–పాలస్తినా మనుగడకు జనరల్ అసెంబ్లీ మెజార్టీ తీర్మానం



**న్యూయార్క్:** మధ్యప్రాచ్యంలో దశాబ్దాలుగా ఇజ్రాయెల్–పాలస్తినా మధ్య ఘర్షణ నివారించేందుకు జరుగుతున్న సన్నాహాల్లో భాగంగా ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ రెండు దేశాల ఇరుగుపొరుగు మనుగడను అంగీకరిస్తూ కాలానుగుణమైన, దశలవారీ పరిష్కారానికి మెజారిటీ ఓటు ద్వారా ఆమోదం తెలియజేసింది. హమాస్ ఉగ్రవాద సంస్థలేని పాలస్తినా రాజ్యం మనుగడ సాగించాలని తీర్మానించింది. హమాస్, ఇజ్రాయెల్ పరస్పర దాడులను ఖండించింది. ఈ మేరకు ఐక్యరాజ్యసమితి ఏడు పేజీల తీర్మానం ఆమోదించింది. ఈ తీర్మానంలో అటు హమాస్‌ను, ఇటుఇజ్రాయెల్ చర్యలను ఐక్యరాజ్యసమితి ఖండించింది.మొదటిసారి ఐక్యరాజ్యసమితి అధికారికంగా హమాస్ ఉగ్రవాదాన్ని, దుష్కృత్యాలను ఖండించింది. వారు తక్షణం ఆయుధాలు స్వాధీనం చేయాలని కోరింది. గల్ఫ్, అరబ్ దేశాలు ఈ తీర్మానానికి మద్దతు తెలియజేశాయి. అదేవిధంగా 2023 అక్టోబరు 7వ తేదీన ఇజ్రాయెల్‌పై హమాస్ ఏకపక్ష కాల్పుల దాడిని జనరల్ అసెంబ్లీ ఖండించింది. హమాస్ ఆనాడు చేసిన దాడిలో 1200 మంది మరణించగా, మరో 250 మందిని బందీలుగా తీసుకుపోయారు. కొంతమంది విడుదలకాగా, ఇంకా వారివద్ద 20 మంది మాత్రమే సజీవులు ఉన్నారు. అగాజాలో ఇజ్రాయెల్ చేస్తున్న దారుణమారణ కాండను కూడా ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీవ్రంగా ఖండించింది. ఉద్దేశపూర్వక ఆకలిచావులను వ్యతిరేకించింది. జులైలో సౌదీ అరేబియా, ఫ్రాన్స్‌దేశాల చొరవతో జరిగిన ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ సదస్సు ఫలితంగా ఈ ఏడు పేజీల తీర్మానం శుక్రవారంనాడు వెలువడింది. ఐక్యరాజ్యసమితి వార్షికోత్సవాల సందర్భంగా ఈనెల 22వ తేదీన ఉన్నతస్థాయీ సమావేశం న్యూయార్క్‌లో జరుగుతుంది. బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా, ఆస్ట్రేలియా, బెల్జియం దేశాలు ఈనెల చివరలో జరిగే సమావేశంలో పాలస్తినాకు లాంఛనంగా గుర్తింపు ఇవ్వనున్నాయి. దీనికి ముందుగా జనరల్ అసెంబ్లీలో 142 దేశాలు పాలస్తినాకు అనుకూలంగా ఓటు వేయగా, పది దేశాలు వ్యతిరేకించాయి. మరో 12 దేశాలు తీర్మానానికి దూరంగా ఉండిపోయాయి. ఇక ఇజ్రాయెల్, అమెరికా దేశాలు ఈ సమావేశాన్ని బహిష్కరించాయి.

## ఆరునెలల్లో.. నేపాల్ ప్రజలకు అధికార బదిలీ




**ఖాట్మండు:** ఆరునెలలలోనే ఎన్నికైన ప్రజా ప్రభుత్వానికి అధికారం బదలాయిస్తానని నేపాల్ తాత్కాలిక ప్రధానమంత్రి సుశీల కర్కి చెప్పారు. ఆదివారం ఉదయం ఆమె ఖాట్మండులో అధికార బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆమె జనరేషన్ జెడ్ ఉద్యమంలో మరణించిన 72 మందికి నివాళులు అర్పించారు. మృతుల కుటుంబాలకు రూ.10లక్షలు నష్టపరిహారం అందజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మృతుల్లో 59 మంది ప్రదర్శకులు, 10 నివాసితులు, మరో ముగ్గురు పోలీసులు ఉన్నారు. ఒత్తిడికి తలొగ్గి అనివార్యంగా ప్రధానమంత్రి బాధ్యతలు తీసుకున్నాననీ, ఆరు నెలల్లో అధికారం బదలాయిస్తానని, ఈ పదవిలో కొనసాగే ఉద్దేశం తనకు లేదని చెప్పారు. మార్చి ఐదో తేదీన పార్లమెంటు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు శనివారంనాడే ఆమె ప్రకటించారు. జనరేషన్ జెడ్ ఆలోచనాదృక్పథానికి, వారి ఆశయాలకు అనుగుణంగా దేశాన్ని ముందుకు తీసుకువెళ్ళేందుకు తన కర్తవ్యాలను నిర్వర్తిస్తానని చెప్పారు. ఈ విధంగా ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం ఎంతో అవమానకరంగా ఉందనీ, ఇలా చేస్తే ఇక మనల్ని నేపాలీయులను ఎలా అంటారని ఆమె ప్రశ్నించారు. మంత్రివర్గ విస్తరణ, పాలన, ధ్వంసమైన ప్రభుత్వ భవనాల పునరుద్ధరణ, నిరుద్యోగ సమస్య పరిష్కారం, తదుపరి ఎన్నికల నిర్వహణ వంటి అనేక సవాళ్ళు ఆమెకోసం ఎదురుచూస్తున్నాయి.

**అమెరికా, చైనా సహా దలైలామా అభినందన**

నేపాల్ తాత్కాలిక ప్రధానమంత్రిగా బాధ్యతలు తీసుకున్న సుశీల కర్కిని పలు దేశాల నాయకులు అభినందించారు. అమెరికా, చైనా, బ్రిటన్, జపాన్, పాకిస్థాన్ తదితర దేశాలు ఆమెకు అభినందన సందేశాలు పంపారు. టిబెటన్ బౌద్ధమత గురువు దలైలామా ఆమెకు అభినందనలు తెలియజేశారు. నేపాల్‌కు టిబెట్ ప్రజలకు మధ్య సుదీర్ఘమైన అనుబంధం ఉందని, 1959 నుండి ఎంతోమంది టిబెటన్ శరణార్థులకు నేపాల్ ఆశ్రయం ఇచ్చిందని ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. నేపాల్‌లో అధికార బదలాయింపు కార్యక్రమం ఎంతో ప్రశాంతంగా ముగియడంపట్ల అమెరికా ప్రభుత్వం హర్షం ప్రకటించింది. అదేవిధంగా చైనా ప్రభుత్వం కూడా నేపాల్ కొత్త ప్రధానమంత్రికి అభినందనలు తెలియజేసింది. శాంతి, సహజీవనం సహా పంచశీల సూత్రాలను ప్రతిపాదించింది. పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాస్ షరీఫ్ కూడా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. బ్రిటన్ దౌత్యకార్యాలయం, జపాన్ ప్రభుత్వం, బంగ్లాదేశ్ ప్రభుత్వ తాత్కాలిక నాయకుడు, మహ్మద్ యూనుస్ కూడా అభినందన సందేశాలు పంపారు.

## తెలంగాణను వెడ్డింగ్ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ధ్యేయం

**సౌత్ ఇండియా వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెళ్లి వేడుకలు జరిపించేందుకు ప్రపంచంలో ప్రముఖ గమ్యస్థానంగా తెలంగాణను చూపించడం ధ్యేయంగాప్రభుత్వం పని చేస్తుందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లోని అక్షయ కన్వెన్షన్‌లో పర్యాటక శాఖ సహకారంతో తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టిసిఇఐ) ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన నాల్గవ సౌత్ ఇండియా వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ లో మంత్రి జూపల్లి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో పెళ్లిళ్ల పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోందని, అందులో తెలంగాణ రాష్ట్రం కీలకపాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. ప్రపంచం మొత్తం భారతదేశాన్ని వెడ్డింగ్ డెస్టినేషన్‌గా చూస్తోందని, అలాంటి సమయంలో తెలంగాణను ప్రపంచ పటంలో వివాహ వేడుకల హబ్ నిలపాలన్నదే మా సంకల్పమని పేర్కొన్నారు.వివిధ థీమ్స్, బడ్జెట్లకు అనుగుణంగా పెళ్లిళ్లను జరిపేందుకు అద్భుతమైన వేదికగా తెలంగాణ రాష్ట్రం ఉందని అన్నారు. పురాతన కోటలు, రాజమహాళ్లు, దట్టమైన అడవులు, నదులు సరస్సులు, కొండలు, ఆధునిక విలాసవంతమైన హోటళ్లు — తెలంగాణలోని ఈ సంపద ప్రపంచ స్థాయి వెడ్డింగ్ డెస్టినేషన్‌గా మార్చగల ఎన్నో అద్భుతమైన ప్రదేశాలు ఉన్నాయని, వెడ్డింగ్ ప్లానర్లు తెలంగాణను కేవలం ఒక రాష్ట్రంగా కాకుండా, ఒక జీవించే సంస్కృతిగా కొత్త దృష్టితో చూసి, దీనిని భారతదేశంలోనే కాక, అంతర్జాతీయంగా పరిచయం చేయాలి అని ఆయన పిలుపునిచ్చారు. పెళ్లి అనేది కేవలం రెండు మనసుల కలయిక మాత్రమే కాకుండా, రెండు కుటుంబాలు, రెండు సంస్కృతుల మిళితమని, అపూర్వమైన తెలంగాణలో ఉన్న పర్యాటక ప్రదేశాల్లో పెళ్లి వేడుకలు పూర్తి చేసుకోవాలని, మధుర స్మృతులను పదిలపరచుకోవాలని కాబోయే వధూవరులకు ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న గమ్యస్థానాల గురించి వివరాలను ప్రచారంలోకి తీసుకువచ్చి వివాహ వేడుకలను ఎందుకు తెలంగాణ లో చేసుకోవాలో తెలిపేలా ప్రణాళికలు రూపొందిస్తామ ని చెప్పా రు. రాష్ట్రంలోని అద్భుతమైన వెడ్డింగ్ డెస్టినేషన్‌ల ను పరిశ్రమకు ప్రత్యక్షంగా పరిచయం చేసేందుకు ప్రత్యే క పర్యటనలు ఏర్పాటు చేస్తామని, లైసెన్సులు, అనుమతులు, లాజిస్టిక్స్ , వివాహాల నిర్వహణకు అవసరమైన అ నుమతులు వేగంగా మంజూరు చేస్తామని, ప్రైవేట్‌పబ్లిక్ భాగస్వామ్యంతో ఈ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు కొత్త విధానాలు సిద్ధం చేస్తున్నామని, మీరు ఆలోచించండి, మేము అమలు చేస్తాం' అనే నినాదంతో పర్యాటక శాఖ ముందుకు సాగుతోందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ స్పెషల్ సిఎస్ జయేష్ రంజన్, టిసిఇఐ అధ్యక్షుడు ఆళ్ల బలరాం బాబు, ప్రధాన కార్యదర్శి రవి బురా, తదితరులు పాల్గొన్నారు.

## బూత్‌ల వారీగా ప్రచార ప్రణాళికలు

(మొదటి పేజీ తరువాయి)

జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ డివిజన్ల ఇన్‌చార్జ్‌లతో సిఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ లోని తన నివాసంలో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్ రావు, వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సిఎం సలహాదారు వేం.నరేందర్ రెడ్డి, ఎఐసిసి కార్యదర్శి విశ్వనాథన్, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, జిహెచ్‌ఎంసి మేయర్ విజయలక్ష్మి, వివిధ డివిజన్లకు ఇన్‌చార్జులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న కార్పొరేషన్ చైర్మన్లు వెన్నెల, శివసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, స్థానిక రాజకీయపరిస్థితులు, ప్రభావిత అంశాలు, రాజకీయ ప్రత్యార్థులు, కాంగ్రెస్ పార్టీ పరిస్థితి తదితర అంశాలపైన సిఎం సమీక్షించారు. ఉప ఎన్నిక గెలుపు, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న భరోసాను స్థానికు ప్రజలకు కల్పించాలన్నారు. కాంగ్రెస్‌తోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అభ్యర్థి ఎంపిక విషయం ఏఐసిసి చూసుకుంటుందని, పార్టీ గెలుపు కోసం పని చేయాల్సిన గురుతర బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పనితీరు, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఎప్పటికప్పుడు తాను సమాచారాన్ని తీసుకుంటానని,జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా సమన్వయంతో పని చేయాలని సిఎం సూచించారు.

## ఇసి ఆత్మపరిశీలన

(మొదటి పేజీ తరువాయి)

క్షుణ్ణంగా దర్యాప్తు చేయాల్సిన బాధ్యత ఇసికి ఉందని చెప్పారు. బిహార్‌లో ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్)ను నిర్వహించిన విధానాన్ని కూడా మాజీ ఎన్నికల కమిషనర్ తప్పుబట్టారు. సరైన విధంగా విధులు నిర్వహించకపోవడం వల్ల ఎన్నికల కమిషన్ (ఇసి)పై విమర్శలు వస్తుంటే మాజీ కమిషనర్ గానే కాకుండా భారత పౌరుడిగానూ తాను తీవ్ర వేదనకు గురవుతానని ఖురేషీ అన్నారు. ఎన్నికల విషయంలో ఏం చేస్తున్నాం, ఎలా చేస్తున్నాం అనే విషయాలను ఇసి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. మన నిర్ణయాలను ప్రభావితం చేసే అన్ని శక్తులు, ఒత్తిళ్లను ఎదుర్కొనే విధంగా అధికారులు ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ ప్రజల, ప్రతిపక్షాల విశ్వాసాన్ని గెలుచుకునేలా ఉండాలని ఆయన అన్నారు. ప్రతిపక్షాలతో మాట్లాడితేనే చాలా సమస్యలను పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. తాను ఎన్నికల కమిషనర్‌గా ఉన్న సమయంలో కూడా ప్రతిపక్షాలు తనను కలవడానికి వస్తే తప్పకుండా వారి వాదనలు వినేవాడినని చెప్పారు. ఎన్నికల సమయంలో తీసుకువస్తున్న కొత్త ఓటర్ల జాబితాలో కూడా ఎటువంటి తప్పులు లేవని మీరు అఫిడవిట్ ఇవ్వగలరా అని ఎన్నికల కమిషన్‌ను ఖురేషీ ప్రశ్నించారు. ఒకవేళ అందులో తప్పులు ఉన్నాయని తేలితే ఎన్నికల అధికారులు సైతం శిక్ష అనుభవించాల్సి వస్తుందని..దానికి మీరు సిద్ధమేనా అని ఎన్నికల అధికారులను ప్రశ్నించారు. ఖురేషీ వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ స్పందిస్తూ.. రాజకీయ పార్టీలతో తాము క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తున్నామని..ఇంత నిర్మాణాత్మక పద్ధతిలో మరెక్కడా సమావేశాలు జరగవని పేర్కొంది.

## జపాన్ రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

వంద సంవత్సరాలు వయసుదాటినవారి సంఖ్య కేవలం 1000 మాత్రమే ఉండగా, 1998 నాటికి ఈ సంఖ్య 10,000 దాటిపోయింది. సుదీర్ఘకాలం జీవించే ప్రజలసంఖ్య జపాన్‌లో చాలా ఎక్కువ. ఐతే కొన్ని అధ్యయనాలు ఈ వాదనతో విభేదిస్తున్నాయి. జపాన్ ప్రజలు ఆహార నియమాలు పాటించడంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తారు. అక్కడ జీవన విలువలు, జీవన కాలం ఎక్కువగా ఉండగా, జననాలసంఖ్య నానాటికీ గణనీయంగా పడిపోతున్నది. జపాన్‌లో 114 ఏళ్ళు వయసుగల షిగెకో కగవాను అత్యంత వృద్ధురాలైన ఆరోగ్యవంతురాలైన మహిళగా గుర్తించారు. ఆమె నారా సిటీ శివారు ప్రాంతంలోని యమటోరియామా ప్రాంతంలో నివసిస్తున్నారు. కోస్తా నగరం ఇతవాలోని 111 ఏళ్ళు వయసుగల కియోటక ముజినోను అందరికంటే వృద్ధుడుగా గుర్తించారు.

## జడివాన

(మొదటి పేజీ తరువాయి)

సీతాఫల్ మండి, ముషీరాబాద్, రాంనగర్, తార్నాక, ఎల్.బి.నగర్, దిల్‌సుఖ్ నగర్, మలక్‌పేట్, కాచిగూడ, కుషాయిగూడ, కాప్రా, కీసర, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్‌తో పాటు తదితర ప్రాంతాల్లో భారీగా వర్షం కురిసింది. హైదరాబాద్ సిటీలో కురిసిన భారీ వర్షానికి రోడ్లు వరద కాలువలుగా మారిపోయాయి. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 నుంచి, విరించి సిగ్నల్ వైపు భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. గంట పాటు అడుగు కూడా వాహనాలు కదలకపోవడంతో వాహనదారులు నరకయాతన అనుభించారు. మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని ఘట్‌కేసర్ మండలంలో 33.4 మిల్లీ మీటర్లుగా అధిక వర్షం పడింది. మండలాల వారీగా కుత్బుల్లాపూర్‌లో 21.5, మేడ్చల్‌లో 21.1, కీసరలో 20, శామీర్‌పేటలో 19.8, ఆల్వాల్‌లో 13.6, దుండిగల్‌లో 13.4, మల్కాజిగిరిలో 11.8, కూకట్‌పల్లిలో 11, బాలానగర్‌లో 11.3, కాప్రాలో 10.2, బాచుపల్లిలో 9.1, మూడుచింతలపల్లిలో 7.7, ఉప్పల్‌లో 5.3, మేడిపల్లిలో 3.4 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది.

**తెలంగాణలో రెండురోజులు భారీ వర్షాలు..**

తెలంగాణలో రెండురోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే సూచనలున్నాయన్నారు. సోమవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే సూచనలున్నాయని వివరించారు. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వర్షాలు పడే సూచట్లున్నాయని చెప్పారు.

## అసోంలో భూప్రకంపనలు

(మొదటి పేజీ తరువాయి)

నివాసితులు ఈ ప్రకంపనలను ప్రత్యక్షంగా చవిచూశారు. భూ ప్రకంపనలు రావడంతో ప్రజలు ఒక్కసారిగా గువహటిలోని తమ నివాసాల నుండి బయటకు పరుగులు తీశారు. మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్‌లోని పశ్చిమ ప్రాంతాల్లో కూడా భూ ప్రకంపనలు వచ్చాయి. అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఇటానగర్‌లో నివాసితులు భయంతో ఇళ్ళు, దుకాణాల నుండి బయటకు పరుగులు తీశారు. రాష్ట్రం నుండి ఇప్పటివరకు ఆస్తి నష్టం లేదా ప్రాణనష్టం జరిగినట్లు ఎటువంటి నివేదికలు రాలేదని రాష్ట్ర విపత్తు నిర్వహణ కార్యదర్శి డాని సులు చెప్పారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. ఈశాన్య రాష్ట్రాలు అధిక భూకంప జోన్‌లోకి వస్తాయి. ఈ ప్రాంతంలో తరచుగా భూకంపాలు సంభవిస్తుంటాయి. మరోవైపు ఆదివారం ఈశాన్య రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మయన్మార్, చైనాలోనూ భూ ప్రకంపనలు వచ్చినట్లు సమాచారం.

## మేధా స్కూల్ సీజ్

(మొదటి పేజీ తరువాయి)

మండల విద్యాధికారి హరీశ్ చంద్ర ఆదేశాలతో ఈ స్కూల్ ను ఆదివారం సీజ్ చేశారు. ఈ స్కూల్ లో ప్రస్తుతం 130 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారిని ఇతర స్కూల్ లో చేర్పించేందుకు విద్యాశాఖ అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పాఠశాల భవనంలో ఉదయం పూట పాఠశాల కొనసాగుతుండగా మరో రెండు గదుల్లో అల్ప్రాజోలం తయారీ నిర్వహిస్తున్నట్లు ఈగల్ బృందం దాడుల్లో బయటపడింది. రెండేళ్ల క్రితం నుంచి పాఠశాలను జయప్రకాశ్ గౌడ్ నిర్వహిస్తుండగా ఈ స్కూల్‌ను అడ్డం పెట్టుకుని మత్తు పదార్థాల తయారీ చేపట్టినట్లు తాజా దాడుల్లో బట్టబయలైంది. స్కూల్ అనుమతులు రద్దు చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. ఇక్కడి విద్యార్థులను ఇతర స్కూళ్లలో చేర్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నా కొత్త పాఠశాలలు అన్ని విధాలుగా తమకు అనుకూలంగా ఉంటాయా లేదా అనే ఆందోళన వ్యక్తం అవుతోంది. కొత్త స్కూళ్లు ప్రస్తుతం ఉన్న స్కూల్ తో పోలిస్తే దగ్గరే ఉంటుందా లేదా దూరం వెళ్లాల్సి వస్తుందా? అక్కడి ఫీజులు ప్రస్తుత స్కూల్ ఫీజులపై రకరకాల ఆందోళనలు నెలకొన్నాయి. శ్రీమేధా స్కూల్ డైరెక్టర్ మహబూబ్‌నగర్‌కు చెందిన డైరెక్టర్ జయప్రకాష్‌గౌడ్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. జయప్రకాష్‌గౌడ్‌కు మహబూబ్‌నగర్, జడ్చర్లలో కూడా స్కూళ్లు ఉన్నాయి. ఈ స్కూళ్లలో కూడా ఏమైనా అసాంఘీక కార్యక్రమాలు సాగిస్తున్నాడా అనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అరెస్టు అయిన నిందితులను చంచల్‌గూడ జైలుకు తరలించారు. కూకట్‌పల్లి కల్లుకాంపౌండ్‌లో ఇటీవల కల్తీకల్లుతో సుమారు పది మంది వరకు చనిపోయారు. ఈ సంఘటనలో కూడా జయ ప్రకాష్ గౌడ్ సరఫరా చేసిన అల్ప్రాజోలం కారణమై ఉండవచ్చని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ కేసులో మరింతలోతుగా దర్యాప్తు చేసేందుకు ప్రకాష్‌గౌడ్‌ను విచారించాలని పోలీసులు నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం పోలీసు కస్టడీ కోరుతూ నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేసే అవకాశాలు ఉన్నాయి. సుమారు 15 రోజుల పాటు విచారించాలని పోలీసులు భావిస్తున్నారు. స్కూల్‌లో ఎప్పటి నుంచి ఈ డ్రగ్స్ దందా నడుస్తుంది.. ? ఇక్కడ తయారైన డ్రగ్స్‌ను ఏఏ ప్రాంతాలకు సరఫరా చేశారు..? ఎంత డబ్బు సంపాదించారు..? ఇతర రాష్ట్రాలకు కూడా సరఫరా చేశాడా ఈ దందా వెనుక మరెవరి హస్తం ఉందనే కోణంలో జయప్రకాష్‌గౌడ్‌ను విచారిస్తామని పోలీసులు చెబుతున్నారు.

## దినోత్సవంగా జరపాలి

(మొదటి పేజీ తరువాయి)

భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనమైందన్నారు. మహోత్తర పోరాటం ఫలితంగానే హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమైందని, తమకు కూడ తెలుసని, అయితే మీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సెప్టెంబర్ 17ను గత ఏడాది తెలంగాణ ప్రజాపరిపాలన దినంగా నిర్వహించగ, ఈ ఏడాది కూడా అదే పేరుతో నిర్వహించనున్నట్లు తెలిసిందన్నారు. అయితే ప్రజాపాలన దినం పేరుతో ఉత్సవాలను నిర్వహించడం వల్ల నాటి చారిత్రాత్మక పోరాటాన్ని ఏ మాత్రం ప్రతిబింబించడం లేదని, అందుకే సెప్టెంబర్ 17ను ''తెలంగాణ విలీన దినోత్సవం''గా నిర్వహించడం సముచితంగా ఉంటుందని భావిస్తున్నామని, ఇందుకు తగిన నిర్ణయం తీసుకోవాలని ఈ లేఖ ద్వారా మనవి చేస్తున్నానని కూనంనేని పేర్కొన్నారు. అదే విధంగా సిపిఐ పలు ప్రతిపాదనలను లేఖ ద్వారా సిఎం ముందు పెడుతున్నామన్నారు.

**ప్రభుత్వానికి సిపిఐ ప్రతిపాదనలు**

- సెప్టెంబర్ 17ను ప్రజా పరిపాలన దినోత్సవంగా కాకుండా, తెలంగాణ విలీన దినోత్సవం పేరుతో నిర్వహించాలి
- నాటి మహత్తర తెలంగాణ స్వాతంత్ర్యోద్యమ, రైతాంగ సాయుధ పోరాట చరిత్రను రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాఠ్యాంశాలలో చేర్చాలి.
- అమరవీరుల స్మారక కేంద్రాన్ని ఏర్పాటుచేసి అందులో ఆనాటి పోరాటంలో అసువులు బాసిన అమరుల పేర్లను, పోటోలను ప్రతి గ్రామం నుంచి అధికారికంగా సేకరించి భావితరాలకు మార్గదర్శకంగా ఉండేలా స్మారక కేంద్రంలో మ్యూజియం ఏర్పాటు చేయాలి.
- హైదరాబాద్‌లో నాటి పోరాట సేనానులు రావి నారాయణ రెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి ఒకే చోట, దొడ్డి కొమరయ్య, షేక్ బందగీ, బొమ్మగాని ధర్మభిక్షం, చాకలి ఐలమ్మ లాంటి ఆనాటి సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ముఖ్య ప్రదేశాలలో ఏర్పాటు చేయడం ద్వారా తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుంది.
- తొలి సార్వత్రిక ఎన్నికల్లో నెహ్రూను మించిన మెజారిటీ పొందిన ప్రజానాయకుడు రావి నారాయణరెడ్డి విగ్రహాన్ని పార్లమెంటులో పెట్టాలి.
- నాటి తెలంగాణ స్వాతంత్ర్య పోరాట నాయకుల పేర్లు చిరస్థాయిగా నిలిచేవిధంగా వివిధ ప్రభుత్వ పథకాలకు, ప్రాజెక్టులకు నామకరణం చేయాలి.
- పలు సభలలో ముఖ్యమంత్రిగా నాటి కమ్యూనిస్టు పార్టీ, నాయకులు చేసిన వీరోచిత పాత్రను శ్లాఘించడం, అలాగే వీరనారి చాకలి అయిలమ్మ పేరును మహిళా యూనివర్సిటీకి, తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టినందుకు కమ్యూనిస్టు పార్టీ తరుపున ప్రత్యేకించి అభినందనలు తెలియజేస్తున్నాం. చరిత్రపై సంపూర్ణ అవగాహన ఉన్న వారిగా పై ప్రతిపానలను కూడా సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నాం.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు : సిఎం

ప్రజాపక్షం/హైదరాబాద్: ఇంజనీరింగ్ విద్యార్థులు, సాంకేతిక నిపుణులు, పరిశోధకులు అందరూ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర అభివృద్ధిలో ఇంజనీర్లు తమ వంతు పాత్ర పోషించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ఇంజనీర్లరందరికీ ముఖ్యమంత్రి 'ఇంజనీర్స్ డే' సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధికి, భారతావని ప్రగతికి బలమైన పునాదులు నిర్మించిన భారతరత్న, మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినమైన 'సెప్టెంబర్ 15'ను పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థం ఇంజనీర్స్ డేగా జరుపుకుంటున్నామని సిఎం గుర్తు చేసుకున్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీరుగా, దార్శనికుడిగా, విద్యాప్రదాతగా, నిపుణునిగా, పారిశ్రామిక ప్రగతి పోషకునిగా ప్రత్యేకతను చాటారని అన్నారు. అత్యుత్తమ ఇంజనీరింగ్ సాంకేతికతతో వివిధ రంగాలలో ఆయన చేసిన కృషి భారతదేశ ఇంజనీరింగ్ రంగానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. మూసీ వరదల నుంచి హైదరాబాద్ నగరాన్ని రక్షించేందుకు జల నియంత్రణ ప్రణాళికలు, ఎన్నో గొప్ప నిర్మాణాలు చేపట్టటంలో ప్రత్యేక చొరవ చూపించారని సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.

# అధికారం లేకున్నా ప్రజల కోసం పోరాడేది వామపక్షాలే




కమ్యూనిస్టు అమరుల త్యాగఫలితమే నేటి తెలంగాణ

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: అధికారం లేకున్నా పేదల పక్షాన నిలబడి పోరాటం చేసేది కమ్యూనిస్టులే అని కొత్తగూడెం ఎంఎల్‌ఎ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా ఆదివారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని దౌలాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ దివంగత నేత కుమ్మరి భీమయ్య 21 వర్ధంతిలో సభలో పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడారు. నాటి స్వాతంత్ర్య ఉద్యమం నుండి నేటి కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తూ పేదల పక్షాన నిలబడుతున్న పార్టీ సిపిఐ చరిత్రలో ఓ మైలురాయిగా నిలుస్తుందన్నారు. అధికారం ఉన్నా లేకున్నా పేద ప్రజల పక్షాన నిలబడి వారి సంక్షేమం కోసం నిరంతరంగా, నిస్వార్థంగా కృషి చేస్తున్న తమ పార్టీపై ప్రజల్లో అభిమానం తగ్గలేదన్నారు. జాతి వైరుధ్యంలో భావాలున్నప్పటికీ మనుసుల్లో ఉన్న మానవత్వమే నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని గుర్తు చేశారు. ప్రజల్లో ఓ విప్లవం సృష్టించాలంటే ప్రజలకు మార్గదర్శకంగా ఉండాలని, వారిలో ప్రేరణ కలిగించే వ్యక్తిత్వం కలిగి ఉండాలని అన్నారు. రైతాంగ సాయుధ పోరాటంలో ప్రజలను ఉత్తేజితులను చేసిన రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఎఐటియుసి నాయకులు మఖ్దూం మోహియొద్దీన్ లాంటి మహనీయుల పిలుపుతో వేలాదిమంది సాయుధ పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. సెప్టెంబర్ 11న మూడు వందల మంది రైతులు ప్రాణాలు విడిచిన ఆ సంఘటనతో నిజాం రాజు తన సామ్రాజ్యాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసిన సందర్భంగా అప్పటి నుండి సాయుధ రైతాంగ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలున్నంత వరకు కమ్యూనిస్టు పార్టీ ఉంటుందన్నారు. మిగతా పార్టీల లాగా మెరుపు తీగ లాగ వచ్చి కనుమరుగు అయ్యే పార్టీ సిపిఐ కాదన్నారు. ఈ క్రమంలో రైతాంగ పోరాటంలో కుమ్మరి భీమయ్య పాల్గొనక పోయినప్పటికీ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో జగదేవ్‌పూర్ మండలంలో సిపిఐ పార్టీని బలోపేతం చేయడంతో పాటు నాలుగు దశాబ్దాల కాలంగా గ్రామ ప్రథమ పౌరుడిగా ఉన్నత వర్గాలను ఎదిరించి నిలబడిన నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాల కోసం నేటితరం యువకులు పేదల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. అలాగే కమ్యూనిస్టు బలోపేతానికి కృషి చేయాలని కోరారు. సమావేశానికి ముందు భీమయ్య స్మారక స్థూపం వద్ద జెండా ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, జిల్లా కార్యవర్గ సభ్యులు బట్టు దయానందరెడ్డి, రిటైర్డ్ జడ్జి జయ సూర్య, సిపిఐ పార్టీ నాయకులు, అభిమానులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి పోరాడింది కమ్యూనిస్టులే

సిపిఐ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ అజీజ్ పాషా

ప్రజాపక్షం/హయత్‌నగర్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని భారత కమ్యూనిస్టు పార్టీ ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని మన్సూరాబాద్ చౌరస్తాలో డివిజన్ కార్యదర్శి కందుల సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలకు ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం, నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి పోరాడింది కమ్యూనిస్టులే అని నొక్కి చెప్పారు. నిజాం క్రూరత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో రజాకార్ల గుండెల్లో దడ పుట్టించింది కమ్యూనిస్టు పార్టీ అని ఆయన గుర్తు చేశారు. అనంతరం సిపిఐ రాష్ట్ర సీనియర్ నాయకులు రవీంద్ర చారి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర పోరాటంలోనూ సాయుధ పోరాటంలోనూ ఏమాత్రం పాత్రలేని మతోన్మాదులు విమోచన దినోత్సవం అని ప్రగల్బాలు పలుకుతున్నారని ధ్వజమెత్తారు. నిజాంకు వ్యతిరేకంగా ఎదురొడ్డి పోరాడి ప్రాణాలు అర్పించిన కమ్యూనిస్టు యోధులను అమరవీరులను విస్మరిస్తూ మతోన్మాద పార్టీలు గొప్పలు చెప్పుకుంటున్నారని ఆగ్రహించారు. ఈ సందర్భంగా ఎల్‌బినగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు వాస్తవాలు తెలిసేలా సెప్టెంబర్ 17న తెలంగాణ విలీన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. మన్సూరాబాద్ డివిజన్ కార్యదర్శి మాట్లాడుతూ కమ్యూనిస్టులు నిర్వహించిన పోరాటాన్ని నేటితరంవిద్యార్థులకు తెలియజేయాలని తెలంగాణ సాయిధ పోరాటం ద్వారా 3000 గ్రామాలకు విముక్తి కలిగించి పది లక్షల ఎకరాలను పేదలకు పంచిన ఘన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హయత్ నగర్ మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి, ఏఐటియుసి ఎల్బీనగర్ నియోజకవర్గం అధ్యక్షులు బోయపల్లి రాములు గౌడ్, ఏఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశివర్ధన్ రెడ్డి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, హయత్ నగర్ మండల సహాయ కార్యదర్శిలు మర్రి శోభన్, కర్నే సుజాత, ఎఐటియుసి మండల కార్యదర్శి గోల్కొండ నాగరాజు శాఖ కార్యదర్శులు, సరిత, గూని శోభ, అరుణ్, పారిజాత, అర్.సౌజన్య, శ్రీను, యమునా, పి.అనితతో పాటు ప్రజానాట్య మండలి నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, శాఖ కార్యదర్శిలు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిఓ 1195ను సవరించాలి




ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల జీతభత్యాల పెరుగుదల తరుగుదలను ప్రభావితం చేసే జిఓ నెంబర్ 1195ను వెంటనే సవరించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. ఆదివారం సత్యనారాయణ రెడ్డి భవన్‌లో నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న డిపిఎం యూనిట్ ఉద్యోగుల సమావేశం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నరసింహ మాట్లాడుతూ ఉద్యోగులతో కనీసం సంప్రదించకుండా జిఓ నెంబర్ 1195ను ఏ విధంగా తెస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 1195లో ప్రభుత్వం వివరించిన జీతభత్యాల గణాంకాలు చూస్తే అవి కేవలం బేసిక్ పే గానే పరిగణించాల్సి వస్తుందన్నారు. 18 సంవత్సరాల నుండి 8 సంవత్సరాల వరకు అనుభవం ఉన్న ఉద్యోగుల అనుభవాన్ని కూడా లెక్క వేయాల్సి ఉందన్నారు. అనుభవాన్ని పరిగణలోకి తీసుకోకుండా వేతనాలను ఎలా నిర్ధారిస్తారని ఆయన ప్రశ్నించారు. జీవో నెంబర్ 1195లో నిర్ణయించిన జీతాలకు సంబంధించి ఎఐటియూసిగా ఎవరి జీతాన్ని తగ్గించాలని తాము అడగడం లేదని కానీ ప్రభుత్వం తగ్గించిన జీతాల విషయంపై త్వరలో పోరాటం చేయనున్నామన్నారు. చాలా క్యాడర్లకు బేసిక్ పేను కూడా తగ్గించారని, కొందరికి రూ.3 వేల నుండి రూ. 30 వేల వరకు జీతం తగ్గిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడైనా పనిచేస్తున్న ఉద్యోగులకు అనుభవాన్ని బట్టి జీతాన్ని పెంచుతారని, కానీ తెలంగాణ రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్ నందు పనిచేస్తున్న డిపిఎంయు ఉద్యోగులకు మాత్రం జీతాలు తగ్గించారని ఆయన ఆందోళన చెందారు. తక్షణమే ఈ జిఓను సవరించాలని, లేకపోతే ఎఐటియుసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల డిపిఓలు, డిఎఎంలు, డిడిఎంలు, డి క్యూఎ ఎంలు, విసిసిఎంలు, అకౌంటెంట్స్, సైకాలజిస్ట్‌లు , డీఈవోలు, సోషల్ వర్కర్లు, డీసీఎంలు, డిపిపిఎంలు, టిబిహెచ్‌వి ఉద్యోగులు, ఫ్యామిలీ ప్లానింగ్ కౌన్సిలర్లు, మెకానికులతో పాటు సపోర్టింగ్ ఇంజనీరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక :**

తెలంగాణ రాష్ట్ర డిపిఎం యూనిట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సమితిని ఎన్నుకుంది. డిపిఎం యూనిట్ రాష్ట్ర అధ్యక్షులుగా ఉప్పునూరు సిద్ధార్థ, ప్రధాన కార్యదర్శిగాతండా నరసింహులు ఎన్నికైయ్యారు. కార్యనిర్వహక అధ్యక్షులుగా ఎండి రుక్మొద్దీన్, ఉపాధ్యక్షులుగా చెన్నూరి ఉమా మహేశ్వరి, తరుకొండ సాగర్, సహాయ కార్యదర్శులుగా మామిడి సైదులు, ఇటికాల పరశురాం, నామా రఘురాం, సకర్ప శ్రీకాంత్, కోశాధికారిగా చలువ గాని నాగరాజులతో పాటు మరో 21 మందిని రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకుంది.

# 17 నుంచి 'పోషణ మాసం'

చిన్నారులు, మహిళల్లో పోషకాహారం పట్ల చైతన్యం

విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులకు మంత్రి సీతక్క లేఖలు



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు 'తెలంగాణ పోషణ మాసం' మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. చిన్నారులు, మహిళల ఆరోగ్యం, పోషకాహారాన్ని మెరుగుపర్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ మహోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేలా అంగన్‌వాడీ సిబ్బంది ద్వారా ప్రతి ఇంటికీ పోషణ సందేశం చేరవేసేందుకు కార్యచరణను సిద్ధం చేసింది. పోషణ మాసం మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని, విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులకు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క లేఖలు రాశారు. ప్రతి ఒక్కరూ తమ నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రోత్సాహించాలన్నారు. కుటుంబ ఆరోగ్యానికి పోషకాహారం మొదటి అడుగు అని, ప్రతి ఇంట్లో పోషణపై చైతన్యం కల్పించడమే ఈ మాసం ప్రధాన ఉద్దేశమని మంత్రి సీతక్క రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతి ఐసిడిఎస్ ప్రాజెక్టుకు రూ.30వేలు, ప్రతి జిల్లాకు రూ.50వేల నిధులను విడుదల చేశామన్నారు. గ్రామ స్థాయి నుండి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు పోషణపై చైతన్య కార్యక్రమాలు, అవగాహన శిబిరాలు, ఆరోగ్య పరీక్షల క్యాంపులు నిర్వహించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించేందుకు, అలాగే చక్కెర, ఉప్పు, నూనె వాడకంపై ప్రజల్లో అవగాహన పెంచేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. పోషణ మిషన్‌లో పురుషుల భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా కుటుంబాల్లో పోషకాహారంపై సమగ్ర అవగాహన కలిగించాలన్నదే ఈ కార్యక్ర మ ఉద్దేశమని సీతక్క తెలిపారు. వోకల్ ఫర్ లోకల్ నినాదంతో గ్రామీణ స్థాయిలో ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించి, ఆత్మ నిర్భరతను పెంచే కార్యక్రమాలు కూడా ఇందులో భాగంగా నిర్వహించనున్నామన్నారు. టెక్నాలజీ వినియోగంతో గ్రామస్థాయిలోనూ పోషణ డేటాను సేకరించి, వాటిపై క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలంతా చురుకైన పాత్ర వహించాలని విజ్ఞప్తి చేశారు. పోషిత, ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణంలో 'పోషణ మాసం' కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి సీతక్క ఆశాభావం వ్యక్తం చేశారు.

# బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాతే నాలుగు బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్




ప్రజాపక్షం/హైదరాబాద్: బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు బొగ్గు బ్లాకులను ప్రయివేటీకరించారని ఆరోపించారు. ఈ నాలుగు బొగ్గు బ్లాకులను కాపాడేందుకు కెసిఆర్, తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ప్రయత్నించిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ నాయకుడు పుట్టమధు, టిజిబికెఎస్ నాయకుడు మిర్యాల రాజిరెడ్డితో కలిసి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ కేంద్రంలో బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క కలిసి బొగ్గు బ్లాకుల వేలం పాటలో పాల్గొన్నారని, సింగరేణి సంస్థను కాపాడాలనే చిత్తశుద్ధి ఆ ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్నా కాంగ్రెస్ సింగరేణికి ఏం చేయలేదని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని తీసుకొస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. సింగరేణి సంస్థలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రులు, ఎంఎల్‌ఎల ఆధిపత్యం పెరిగిందని ఆరోపించారు. సింగరేణి సిఎండి కాంగ్రెస్ చెప్పుచేతల్లో పని చేస్తున్నారని, ఆ సంస్థ మనుగడ ప్రమాదంలో పడిందని ఆరోపించారు. సింగరేణి మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం, గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంఘం సింగరేణి కార్మికుల్లో భరోసా నింపాలని, నాలుగు బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకు అప్పగించాలని కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. టిజిబికెఎస్ నాయకుడు మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ కార్మిక చట్టాలకు అనుగుణంగా కొప్పుల ఈశ్వర్‌ను తమ సంఘానికి గౌరవాధ్యక్షునిగా ఎన్నుకున్నామని, అంతకుముందు అనేకమంది తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘానికి గౌరవాధ్యక్షులుగా పని చేశారని అన్నారు.

# 'ఎస్‌ఎల్‌బిసి' కుటుంబాలకు పరిహారాన్ని చెల్లించరా?

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

ప్రజాపక్షం/హైదరాబాద్: శ్రీశైలం ఎడమ కాలువ (ఎస్‌ఎల్‌బిసి) సొరంగం కూలి, ఎనిమిది మంది కార్మికులు చనిపోయి రెండు వందల రోజులు దాటినప్పటికీ, ఆరు మృతదేహాలను ఇప్పటికీ వెలికి తీయలేదని, బాధిత కుటుంబాలకు ఎటువంటి పరిహారాన్ని చెల్లించలేదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు మండిపడ్డారు. ఈ విషయంలో కేంద్రలోని బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో చిన్నపాటి సమస్యలకే జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందాన్ని పంపించి, హంగామా సృష్టించిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ఎస్‌ఎల్‌బిసి ఘటనపై దర్యాప్తు చేసేందుకు ఎందుకు ఒక్క బృందాన్ని కూడా పంపించలేదని కెటిఆర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిజెపి బడే భాయ్ ఎందుకు తెలంగాణలోని కాంగ్రెస్ చోటే భాయ్‌ని కాపాడుతున్నారని, ఇది ఎలాంటి అపవిత్ర బంధం?' అని కెటిఆర్ అన్నారు. బిఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే ఆ ఆరు కుటుంబాలకు న్యాయం చేస్తామని, ప్రాణాలను బలిగొన్న వారికి శిక్ష పడేలా చేస్తామన్నారు. ఎస్‌ఎల్‌బిసి సొరంగం కూలిపోవడానికి గల కారణాలకు తాము సమాధానాలు రాబడతామన్నారు.

## అధికార భాషగా హిందీ..
# దేశ సమగ్రతకు గట్టి పునాది




హిందీ దివాస్ కార్యక్రమంలో పలువురు వక్తలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : అధికార భాషగా హిందీ ఈదేశ సమగ్రతకు బలమైన పునాదిగా నిలిచిందని పలువురు వక్తలు అన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధరక్ భవన్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ లింగ్విస్టిక్ మైనార్టీ సెల్, తెలంగాణ హిందీ జర్నలిస్టు అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హిందీ దివాస్ కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ లింగ్విస్టిక్ మైనార్టీ సెల్ ఛైర్మన్ రాజేశ్ కుమార్ అగర్వాల్, తెలంగాణ హిందీ జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు ఎంఎన్‌ఎస్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, గౌరవ అతిథులుగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, ప్రభుత్వ సలహాదారు హార్కర్ వేణుగోపాల్ రావు, ఎఐసిసి కార్యదర్శి విశ్వనాథన్, రాష్ట్ర ప్రణాళిక కమిషన్ చైర్మన్ డాక్టర్ చిన్నా రెడ్డి, మాజీ ఎంపి వి.హనుమంతు రావు, కార్పొరేషన్ చైర్మన్లు అన్వేష్ రెడ్డి, తాహెర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కొందరూ తమ స్వార్థ రాజకీయాల కోసం కులాలు, మతాల పేరిట ఈ దేశాన్ని విచ్ఛినం చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రాజకీయాలు అనేది పదవుల కోసం మాత్రమే అసరమని, కానీ కొందరూ ఒక్కసారి గద్దెనెక్కిన తమ పదవులను కాపాడుకోవడానికి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని, ఇది దేశ భవిష్యత్‌కు మంచిది కాదు అని పేర్కొన్నారు.1949లో భారత రాజ్యాంగ సభ హిందీని దేశ అధికార భాషగా ప్రకటించిందని గుర్తు చేశారు. గ్లోబలైజేషన్ ప్రభావంతో ఇంగ్లీష్ ప్రాధాన్యం పెరిగినా, హిందీ తన స్థానాన్ని కోల్పోలేదని పేర్కొన్నారు. తెలంగాణ లౌకికవాదానికి పెట్టింది పేరని.. ఇక్కడ భాష, ప్రాంతం అన్న భేదమే లేదని, అందరూ కలిసి మెలిసి జీవిస్తున్నారని పేర్కొన్నారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ భాషాలు, మతాలు వేరైనా మనమంతా భారతీయులమన్నారు. పరస్పరం గౌరవించుకుంటు కలిసి మెలిసి జీవించాలని, మార్వాడీలపై దాడులు సరికాదని ఆయన పేర్కొన్నారు. హార్కర్ వేణుగోపాల్ రావు, విశ్వనాథన్, వి.హనుమంతరావు, చిన్నారెడ్డిలు మాట్లాడుతూ భాషలు, మాండలికాలకు వారధి హిందీ భాషే నని అన్నారు. అనేక భాషాలకు నిలయమైన మన దేశంలో అత్యధిక జనాభా మాట్లాడేది హిందీభాషా కావడంతోనే ఆనాడే దేశ అధికారిక భాషగా గుర్తించబడిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హిందీ జర్నలిస్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.సర్వర్ ఈకార్యక్రమంలో ప్రదిప్ సురానా, లక్ష్మి నారాయణ రాఠీ, సిఎ మురళి మనోహర్ పలోడ్, బీమ్ అగర్వాల్, మహావీర్ అగర్వాల్, మధు సూదన్ సన్‌తూలియా, సురేశ్ కుమార్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

**పలువురికి అవార్డులు :**

హిందీ దివాస్ సందర్భంగా పలువురికి అవార్డులను ప్రధానం చేశారు. హిందీ మిలాప్ ఎడిటర్ వినయ్ వీర్ అవార్డును కవి, జర్నలిస్టు అర్వింద్ యాదవ్‌కు ప్రధానం చేశారు.అదేవిధంగా సీనియర్ జర్నలిస్టు సదాశివ శర్మ అవార్డును మిడ్‌నైట్ రిపోర్టర్ డాక్టర్ చైతన్యసింగ్‌కు, విద్యారణ్య హరిబెలికే అవార్డును హిందీ కవి మీనా లలిత్ ముతాకు అందజేశారు.

## ప్రైవేట్ కళాశాలల బంద్‌కు ఎఐఎస్‌ఎఫ్ మద్దతు

ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15 నుంచి ప్రైవేట్ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలలు చేస్తున్న నిరవధిక బంద్‌కి ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్‌లు తెలిపారు. ప్రభుత్వం ఫీజు బకాయిల విడుదలపై నిర్లక్ష్యం చేస్తూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తుందన్న అనుమానం కల్గుతోందన్నారు. తాము అధికారంలోకి వస్తే వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చి 21 నెలలు గడుస్తున్న ఫీజు బకాయిలు ఎందుకు విడుదల చేయడం లేదో సమాధానం చెప్పాలనివారు డిమాండ్ చేశారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా సంక్షేమ పథకాలు, ఎన్నికల హామీలు అమలు చేస్తున్నామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఫీజు బకాయిల విడుదల చేయకపోవడంతో విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం కళాశాలలకు అప్పులు చేసి మరి ఫీజులు కట్టే పరిస్థితి వచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీలకు, మంత్రులు హెలికాప్టర్లో తిరగడానికి, పక్క రాష్ట్రాల్లో పత్రిక ప్రకటనలు ఇవ్వడానికి ఉన్న నిధులు విద్యార్థుల ఉన్నత చదువులకు ఆసరాగా ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి నిధులు ఇవ్వకుండా నేడు కళాశాలలు బంద్ చేసే పరిస్థితి ప్రభుత్వమే తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే కళాశాలల యాజమాన్యాలతో చర్చ లు జరిపి బంద్ విరమింపజేసి పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిపుల బకాయిలు విడుదల చేయాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

## బకాయిలను చెల్లించాలి

బిసిహక్కుల సాధన సమితి ధనుంజయ నాయుడు డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాం లోనూ, ప్రస్తుత ప్రభుత్వ హయాం లోనూ కోట్లాది రూపాయల ఫీజులు కాలేజీలకు ప్రభుత్వం బకాయి పడటం వల్ల అటు యాజమాన్యాలు ఇటు విద్యార్థిని విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 4 ఏళ్లుగా సుమారు రూ.8 వేల కోట్ల ఫీజు పెండింగ్‌లో ఉన్నాయని దీంతో కాలేజీలు మూతపడే పరిస్థితి నెలకొన్నదన్నారు. ఇదే జరిగితే బోధన రుసుం, స్కాలర్‌షిపుల పెండింగ్ కారణంగా సుమారు 15 లక్షల మంది విద్యార్థులు చదువుకు దూరమైయ్యే పరిస్థితి నెలకొందన్నారు. ఈనెల 15 నుంచి రాష్ట్రంలో అన్ని ఇంజనీరింగ్ ఇతర వృత్తి విద్యా కాలేజీలు 17 నుంచి డిగ్రీ ఇంజనీరింగ్ కాలేజీలు నిరవధికంగా బంద్ చేస్తామని ప్రకటించారని ఇది చాలా బాధాకరమైన విషయమన్నారు. తెలంగాణలో నేడు అధికారంలో ఉన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలు గడుస్తున్నా విద్యార్థుల ఫీజులను మాత్రం విడుదల చేయకుండా అన్యాయం చేశారని దీంతో నిరుపేద కులాలైన బిసిలు చదువు దూరమైతే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రిగా కూడా కొనసాగుతున్న సిఎం రేవంత్ రెడ్డి తక్షణమే ఫీజు బకాయి విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కళాశాల యాజమాన్యాలకు సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## తక్షణమే విడుదల చేయాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్: ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ' పోరుబాట' అంటూ పిడిఎస్‌యు రూపొందించిన పోస్టర్‌ను హైదరాబాద్‌లోని తన నివాసంలో హరీష్‌రావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా ఫీజురియంబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని విద్యాసంస్థల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొద్దునిద్రను నటించడం సిగ్గుచేటని అన్నారు. ఫ్యూచర్ సిటీకి రూ.20వేల కోట్ల టెండర్లు, ఒక వైపు కాళేశ్వరం కూలిందంటూనే మల్లన్న సాగర్ నుంచి మూసిలో గోదావరి నీళ్లు పోసేందుకు రూ .7వేల కోట్ల టెండర్లు, జిహెచ్‌ఎంసిలో హై లెవెల్ బ్రిడ్జిలు, ఫ్లైఓవర్లు నిర్మించేందుకు మరో రూ.7వేల కోట్ల టెండర్లు, ఫ్యూచర్ సిటీలో ఆరు లైన్ల రోడ్డు కోసం రూ.5 వేల కోట్ల టెండర్లు, హెచ్‌ఎండిఎలో రూ.10,000 కోట్ల టెండర్లు, ఆర్ అండ్ బిలో రూ.16 వేల కోట్ల టెండర్లు, రూ.25 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు టెండర్లు, ఇలా మొత్తంగా రెండున్నర లక్షల కోట్ల రూపాయలకు టెండర్లు ఆహ్వానిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం, విద్యార్థుల చదువు పట్ల శ్రద్ధ లేదా?, విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పట్ల ఆలోచన లేదా అని హరీశ్‌రావు ప్రశ్నించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## గ్రూప్ 1 ఉద్యోగాలు రావొద్దని కెటిఆర్ కుట్ర : ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రూప్ 1 ఉద్యోగాలు రాకూడదని ఉద్దేశంతోనే కెటిఆర్ కుట్ర చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. గ్రూప్ 1 ఉద్యోగాల కోసం 563 మంది తల్లిదండ్రులు ఒక్కొక్కరు రూ. 3 కోట్ల చొప్పున లంచం పెట్టే స్తోమత ఉంటుందా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ హయాంలో గ్రూప్1, 2,3,4 పరీక్షలు నిర్వహించే పరిస్థితి లేదన్నారు. తమ ప్రభుత్వం తల్లిదండ్రులను, పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని ముందుకెళ్తున్నామని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రూప్ 1 పరీక్షలకు అర్హులు రావొద్దనే ఉద్దేశంతోనే న్యాయ నిపుణుల సలహాలు కూడా తీసుకున్నామని అన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే బిఆర్ఎస్ తమ ప్రభుత్వంపై నిందలు వేస్తున్నదని కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.

## 17న తెలంగాణ ప్రజలు ఇండ్లపై జాతీయ జెండా ఎగరేయాలి

కొమ్మిడి నర్సింహారెడ్డి పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజలందరూ తమ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని మాజీ ఎంఎల్‌సి, తెలంగాణ ప్రజా చైతన్య వేదిక కన్వీనర్ కొమ్మిడి నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 17 అనేది ఒక తేదీ కాదని తెలంగాణ కు నిజమైన స్వతంత్రం సిద్ధించిన రోజు అన్నారు. పరాయి ఆధిపత్య శక్తులను ఖండించే క్రమంలో కొందరు రాజకీయ నాయకులు సెప్టెంబర్ 17 ను రాజకీయాలకు వాడుకుంటున్నారన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ నాడు అటు హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఇటు కమ్యూనిస్టు పార్టీ పోరాడితే నిజాం నుంచి విముక్తి పొందడం కోసమేఅన్నారు. ఆగస్టు 15న తెలంగాణ కు స్వాతంత్రం రాలేదని, తెలంగాణకు స్వాతంత్ర్యం సెప్టెంబరు 17న వచ్చింది అనే నిజాన్ని నేటి పాలకులు గుర్తించి భవిష్యత్తు తరాలకు తెలిసేలా సెప్టెంబర్17న తెలంగాణ వ్యాప్తంగా తెలంగాణ స్వతంత్ర వేడుకలను నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని సూచించారు. లేదంటే తెలంగాణ పోరాట చరిత్రను అవమానించడం అవుతుందని కొమ్మిడి నర్సింహారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



## పోరాట యోధుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత ఐదేళ్లుగా కేంద్ర ప్రభుత్వమే హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తోందని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకల్లో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ లాంఛనంగా ప్రారంభించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఆనాటి పోరాట యోధుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. నిజాం పాలనలో ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు, వారి ధైర్యసాహసాలు, విమోచన పోరాటాల వెనుక ఉన్న చారిత్రక సత్యాలను నేటి యువతరానికి తెలియజేయాలన్నదే ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ ప్రదర్శన ద్వారా నాటి ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో బలంగా తీసుకెళ్లవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. సెప్టెంబర్ 17న కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్‌లో ప్రధాన ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరుకానున్నారని చెప్పారు. ఆయనతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, మహారాష్ట్రకు చెందిన మంత్రులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ పరిశీలించారు.

## గద్వాల జిల్లా కెటిఆర్ సభ అట్టర్ ఫ్లాప్

ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గద్వాల్ జిల్లాలో బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కె.తారక రామారావు సభ అట్టర్ ఫ్లాప్ అని ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ అన్నారు. తేరు మైదానానికి ఓ చరిత్ర ఉందని దానిని కెటిఆర్ అబద్ధాలకు అడ్డాగా మార్చి నడిగడ్డ ప్రతిష్టను దిగజార్చి పోయాడని ఆగ్రహంవ్యక్తం చేశారు. కెటిఆర్ వ్యాఖ్యలపై ఆదివారం సంపత్ కుమార్ స్పందిస్తూ అలంపూర్ నియోజకవర్గంలో గెలిచిన ఎంఎల్ఎ, ఎంఎల్‌సిలకు అభివృద్ధిపై ఆలోచన లేదు అని వారికి ప్యాకేజీలు ,కాంట్రాక్ట్ రాజకీయాలు చేయడమే తప్ప ప్రజా సమస్యలపై అవగాహన లేదని ఆరోపించారు. గత ప్రభుత్వంలోఅలంపూర్ నియోజకవర్గంలో ఒక్కటంటే ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా కట్టలేదని, అదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సిఎంరేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అలంపూర్ నియోజకవర్గంలో 3500 పైచిలుకు ఇందిరమ్మ ఇళ్లకు నిర్విఘ్నంగా నిర్మాణం జరుగుతుందని అని ఇది ప్రజాపాలనకు దర్పణం పడుతుందని సంపత్ కుమార్ అన్నారు. 10 ఏళ్ల రాజకీయంలో మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి ఈరోజు రాష్ట్రం యొక్క ప్రతిష్టను దెబ్బతీసేలా మాట్లాడడం తగదు అని, పెద్ద ధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీ గురించి కూడా మాట్లాడే అర్హత కేటీఆర్ కు లేదని సంపత్ కుమార్ అన్నారు. ఎందుకంటే ఆ రోజు బిఆర్ఎస్ పరిపాలనలోనే ఆ కంపెనీకి స్వయంగా కెటిఆర్ చేతుల మీదుగా 9 అనుమతులని ఇచ్చాడన్నారు.అప్పుడు కెటిఆర్ బుద్ధి ఏమైందని ప్రశ్నించాడు. గ్రూప్ 1 ఉద్యోగాలు అమ్ముకున్నారని కెటిఆర్ చేసిన ఆరోపణలకు బదులుగా ఒక్క సాక్ష్యం చూపించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాని సంపత్ కుమార్ గా నేను గాని దేనికైనా రెడీ అని సవాల్ విసిరారు.

## కెటిఆర్‌పై పోలీసులు చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రూప్ 1 పోస్టులు అమ్ముకున్నారని కెటిఆర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ డాక్టర్ రియాజ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్‌లు పోలీస్ అధికారులను కోరారు. బిఆర్ఎస్ నాయకులు నిరుద్యోగుల అనుమానాలు కలిగించేలా విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారని, త్వరలోనే రాష్ట్ర డిజిపి ని కలిసి బిఆర్ఎస్ పార్టీ నాయకుల మాట్లాడిన ఫేక్ వీడియో లు, క్లిప్పింగ్స్‌లతో ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు. గ్రూప్1 పరీక్ష పై బిఆర్ఎస్ పార్టీ విష ప్రచారాలను తిప్పికొట్టాలని కాంగ్రెస్ శ్రేణులను కోరారు. నిరుద్యోగుల సంక్షేమం కాంగ్రెస్ లక్ష్యమని ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. నిరుద్యోగుల న్యాయ బద్ధ పోరాటాలను కాంగ్రెస్ పార్టీ గౌరవస్తుందన్నారు. బిఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా అసత్య ప్రచారాలు మానుకోవాలని వారు హితువు పలికారు.

## బూర్గుల రామకృష్ణారావుకు కాంగ్రెస్ శ్రేణులు ఘన నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావుకు కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నివాళ్లు అర్పించారు. ఆదివారంహైదరాబాద్ గాంధీ భవన్‌లోబూర్గుల రామకృష్ణారావుకు చిత్రపటానికి టిపిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మల్లురవి మాట్లాడుతూ రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా చెరగని ముద్ర వేశారని, వారి దూరదృష్టి ఇప్పటికీ మనందరికీ ఆదర్శమని అన్నారు. భవిష్యత్ తరాలకు బూర్గుల స్ఫూర్తిదాయక నేతగా నిలిచారని పేర్కొన్నారు.వారి చూపిన మార్గంలోనే కాంగ్రెస్ పార్టీ నడుస్తూ ప్రజాసేవకు కట్టుబడి ఉందన్నారు. యువతరానికి బూర్గుల రామకృష్ణారావు మార్గదర్శి అని తెలిపారు.

# హైదరాబాద్ నగరాభివృద్ధే లక్ష్యంగా సిఎం రేవంత్ రెడ్డి అడుగులు

మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం జూబ్లీ హిల్స్ నియోజకవర్గ పరిధిలో ఎల్లారెడ్డి గూడ జయ ప్రకాష్ నగర్ కాలనీ, ఇంజనీర్స్ కాలనీలో నిర్వహించిన ఆత్మీయ సమావేశాల్లో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ హైదరాబాద్ విశ్వ నగరం అజెండాగా అభివృద్ధి చేయాలనే పట్టుదలతో సిఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు.జూబ్లీ హిల్స్ నియోజక వర్గంలో ప్రతి డివిజన్ లో సిసి రోడ్లు ,పార్క్ లు తాగునీటి సరఫరా డ్రైనేజ్ వ్యవస్థ శానిటేషన్ తో క్లీన్ అండ్ గ్రీన్ గా కాలనీలు ఉంచి ,పరిశుభ్రత పాటిస్తూ మెరుగైన జీవన ప్రమాణాలు పెంచేలా ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.హైదరాబాద్ నగర అభివృద్ధి కొనసాగేలా సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తుమ్మల చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కార్పొరేటర్ సంగీత స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## బాధితులకు రూ.40.8కోట్లు అందించాం

టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మూడవ జాతీయ మెగా లోక్‌అదాలత్ ద్వారా బాధితులకు రూ.40.8 కోట్లు వారు పోగుట్టుకున్న డబ్బును తిరిగి అందించామని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి), తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ, రాష్ట్రంలోని అన్ని పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్‌పిల పరిధిలో కలిపి 4,539 మంది బాధితులకు ఒకే రోజు రూ.12.94 కోట్ల రిఫండ ఆర్డర్లు లోక్‌అదాలత్ ద్వారా జారీ చేశామని తెలిపారు. అదేవిధంగా, లోక్‌అదాలత్‌కు ముందు రూ.27.91 కోట్ల రిఫండ్లు 2,501 మందికి అందించబడటంతో, ఈ విడతలో మొత్తం రూ.40.86 కోట్ల రిఫండ్లు 7,040 మందికి అందాయని శిఖాగోయల్ పేర్కొన్నారు. ఈ విజయంతో, 2025లో లోక్‌అదాలత్ ద్వారా మొత్తం రూ.138.04 కోట్ల రిఫండ్లు 18,872 మందికి అందించామన్నారు. సైబరాబాద్‌లో 1,937 కేసుల్లో రూ.11.51 కోట్లు, హైదరాబాద్‌లో 941 కేసుల్లో రూ.9.29 కోట్లు,రాచకొండలో 1,061 కేసుల్లో రూ.6.41 కోట్లు, టిజిసిఎస్‌బి హెడ్‌క్వార్టర్స్‌లో 197 కేసుల్లో, రూ.4.21 కోట్లు, సంగారెడ్డిలో 266 కేసుల్లో రూ.1.04 కోట్లు సైబర్ క్రైమ్ బాధితులకు కోల్పోయిన మొత్తాన్ని తక్షణ రికవరీ కోసం లోక్‌అదాలత్ విధానాన్ని తెలంగాణలో స్థిరంగా అమలు చేస్తున్నామని అన్నారు. 2024 మార్చి నుండి ఇప్పటివరకు మొత్తం రూ.321 కోట్లు 36,786 బాధితులకు రిఫండ అయ్యాయన్నారు. టిజిసిఎస్‌బి బ్యాంకులు, డిజిటల్ పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ యూనిట్లతో రియల్‌టైమ్ సమన్వయం చేస్తూ, వివాద పరిష్కారం వేగవంతం చేస్తూ, యుపిఐ మోసాలు, ఇన్వెస్ట్మెంట్ స్కామ్‌లు, డిజిటల్ చోరీలు వంటి కేసుల్లో బాధితులకు త్వరితగతిన రిఫండ్లు అందిస్తోందన్నారు.



## ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసేది కమ్యూనిస్టులే

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసేది కమ్యూనిస్టులేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్‌లోని పొట్లూరి నాగేశ్వరరావు భవన్‌లో సీపీఐ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు సువరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభల విజయవంతం కోసం కృషి చేసిన కార్యకర్తలను, వాలంటీర్స్‌ను ఆయన శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎర్రజెండాను మరింత ఎరుపెక్కించడమే సురవరంకు నిజమైన నివాళి అని అన్నారు. కమ్యూనిస్టులు బడుగు, బలహీన వర్గాల కోసమే పోరాడుతారని, పేద ప్రజల పట్ల కమ్యూనిస్టులకు ఎంతో అంకితభావం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దామోదర్‌రెడ్డి, సాయిలుగౌడ్, ధర్మేంద్ర, ఏసురత్నం, స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్, రచ్చ కిషన్, కృష్ణ, హరినాథ్, సత్యప్రసాద్, నర్సింహా, జిల్లా మండల కార్యదర్శులు యాదగిరి, యాదయ్యగౌడ్, బాబు, శ్రీనివాస్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జిఎస్‌టి సంస్కరణలు పౌరులందరి విజయం

నిర్మలాసీతారామన్

**చెన్నై:** వస్తుసేవల పన్ను (జిఎస్‌టి) సంస్కరణలు దేశంలో ప్రతిఒక్క పౌరుడి భారీ విజయమని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ అన్నారు. దేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ తమదైన పర్వదినాలు ఉన్నందువల్ల వాటిని పరిగణనలోకి తీసుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదేశాల మేరకు దీపావళికి ముందుగానే జిఎస్‌టి సంస్కరణలను అమలులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. 'అభివృద్ధి భారత్‌లో పన్నుల సంస్కరణలు' అనే అంశంపై చెన్నై సిటిజన్స్ ఫోరం నిర్వహించిన వాణిజ్య,పరిశ్రమల సంస్థ ఉమ్మడి సదస్సులో నిర్మలాసీతారామన్ ఆదివారం మాట్లాడుతూ,పౌరుడు నిద్ర లేచిన దగ్గర నుండి తిరిగి నిద్రపోయేవరకూ ఉపయోగించే ప్రతివస్తువు కొనుగోలు మీదా వస్తుసేవల పన్ను ద్వారా ప్రయోజనం పొందుతాడన్నారు. కేంద్రం తీసుకున్న కొన్ని చొరవలను ఆమె వివరిస్తూ, ఇంతకుముందు 12 శాతం పన్ను శ్లాబులో ఉన్న 99 శాతం వస్తూత్పత్తులన్నీ ఇప్పుడు ఐదుశాతం పన్నుశ్లాబులోకి వచ్చిచేరాయన్నారు. జిఎస్‌టి సంస్కరణలు ఈనెల 22వ తేదీ నుండీ అమలులోకి వస్తాయి. 250 రకాల వస్తువులపై జిఎస్‌టి కౌన్సిల్ పన్నురేట్లు తగ్గించిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఐదుశాతం, 28 శాతం శ్లాబులు మాత్రమే అమలులోకి తెస్తోంది. వ్యాపారులకు కూడా జిఎస్‌టి కార్యవిధాన పద్ధతులను సంక్షిప్తీకరించినట్లు చెప్పారు. 2017లో జిఎస్‌టి ప్రవేశపెట్టకముందు 66 లక్షలమంది వ్యాపారులు పన్నులు కట్టేవారని, కానీ ఈనాడు 1.50 కోట్లమంది వ్యాపారులు గడచిన ఎనిమిది సంవత్సరాలుగా పన్నులు చెల్లిస్తున్నారని చెప్పారు.

## రైతు వేదిక దొంగతనం కేసులో ఇద్దరు అరెస్ట్

సొమ్ము రికవరీ



**ప్రజాపక్షం/బెల్లంపల్లి:** తాళ్ళగురిజాల రైతు వేదికలో జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఈ చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ. 1.90 లక్షల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. తాళ్ళగురిజాల రైతు వేదికలోని వీడియో కాన్ఫరెన్స్ కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి చెందిన 65 అంగుళాల ఎల్ఇడి టివి, రెండు సౌండ్ బాక్సులు, సిపియు, యాంప్లిఫయర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు జూలై 3న రాత్రి దొంగిలించారు. ఈ ఘటనపై ఎఇఒ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రెండు నెలల విచారణ అనంతరం ఆదివారం మధ్యాహ్నం దొంగిలించిన వస్తువులను ఆటోలో తరలిస్తున్నారనే నమ్మదగిన సమాచారంతో బెల్లంపల్లి రూరల్ సిఐ హనోక్ ఆధ్వర్యంలో తాళ్ళగురిజాల ఎస్ఐ రామకృష్ణ, ఎఎస్ఐ అలీ, పిసి అరుణ్ పోచమ్మగడ్డ చౌరస్తా వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఓ ఆటోలో దొంగిలించిన వస్తువులను గుర్తించి, అందులో ఉన్న మహమ్మద్ నసీం బేగ్, వర్మ శైలేష్ లను అదుపులోకి తీసుకుని విచారించగా నిందితులు తమ నేరాన్ని అంగీకరించారు. రైతు వేదిక తాళం పగులగొట్టి దొంగతనం చేసినట్లు తెలిపారు. దొంగిలించిన వస్తువులను జనకాపూర్‌లోని నసీం తాత ఇంటిలో దాచి ఉంచినట్లు వెల్లడించారు. అనంతరం, వాటిని అమ్మేందుకు బెల్లంపల్లికి తీసుకెళ్తుండగా పట్టుబడ్డారని పోలీసులు పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం బెల్లంపల్లి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు.



## మినీ నయాగారా... ఎత్తిపోతల

పరవళ్ళు తొక్కుతున్న జలపాతం

**ప్రజాపక్షం/నందికొండ:** భారీ వర్షాలకు పర్యాటక ప్రాంతమైన ఎత్తిపోతల జలపాతం వరద నీటితో జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతాలలో భారీగా వర్షలు కురుస్తూ ఉండటంతో ఎత్తిపోతలకు వాగులు, అటవీ మార్గాల ద్వారా వరద వచ్చి చేరుతోంది. నల్లమల నుంచి పరవళ్ళు తొక్కుతూ వచ్చే మూడు వాగుల సంఘమమే ఎత్తిపోతల జలపాతం ఈ నీరు 70 అడుగుల ఎత్తు నుంచి కిందకు ప్రవహిస్తూ ఉండటంతో జలపాతం నయాగరా అందాలను తలపిస్తోంది. నాగార్జునసాగర్ నుంచి మాచర్ల మార్గంలో 15 కి.మీ దూరంలో ఉన్న ఈ ఎత్తిపోతల జలపాతం 70 అడుగుల ఎత్తైన జలపాతం. కృష్ణానది ఉపనది అయిన నక్కవాగు, చంద్రవంక వాగు, తుమ్మల వాగు కలయికే ఈ సుందర జలపాతం. చుట్టూ ఎత్తైన కొండలు, దట్టమైన అడవులు పాల నురగల జలపాతాలతో పర్యాటకులను ఎంతో అబ్బురపరుస్తుంది. సాగర్ ప్రాజెక్ట్, నాగార్జునకొండ, మ్యూజియంను తిలకించేందుకు వచ్చే పర్యాటకులు మినీ నయాగరా ఎత్తిపోతల చూసేందుకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని పర్యావరణ ప్రేమికులతోపాటు ఇతర రాష్ట్రాల పర్యావరణ ప్రేమికులు కూడా జలపాతాన్ని చూసేందుకు ఆసక్తిని చూపుతున్నారు.

## రైలు ఢీకొని రైతు మృతి



**ప్రజాపక్షం/నిజామాబాద్:** గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యవసా య రైతు మృ తి చెందిన ఘటన ఆదివారం చోటు చే సుకుంది. రై ల్వే ఎస్ఐ సాయిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉనా యి. ఇందల్వా యి మండలం గన్నారం గ్రామానికి చెందిన బద్దం రాజారెడ్డి కు మారుడుబద్దంరవీందర్‌రెడ్డి (46) కులం గురడికా పు, వృ త్తి :వ్య వసాయ రైతు గ్రామశివారులో ని రైలు పట్టాల పక్కన గల తన వ్య వసాయ భూమి వద్దకు వెళుతు న్న సమయంలో ఆదివారం తెల్లవారు జామున 4.40 గ ంటల కంటే ముందు ఇందల్వాయి సి ర్నాపల్లి రైల్వేస్టేషన్ల వద్ద గుర్తు తెలియని రైలు బండిరాకను గ మనించకు ం డారైలుపట్టా లుదాటుటకు ప్రయత్నించగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టగా త గిలిన గా యాల వల్ల అక్కడికక్కడే మరణించినట్లు తెలిపారు.

# వరి... వైరస్ వర్రీ

*వాతావరణ మార్పులతో ఆందోళనలో రైతన్న * సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అధికారుల సూచన


**ప్రజాపక్షం/ఎడపల్లి:** అల్పపీడనం, భారీ వర్షాల కారణంగా చోటుచేసుకున్న వాతావరణంలో మార్పులు వరి పంటకు శాపంగా మారాయి. వరి నాటిన దగ్గరి నుంచి తెగుళ్ల ఉధృతి అధికమైంది. ఎన్ని సస్యరక్షణ చర్యలు చేపట్టిన ప్రకృతి అనుకూలంగా లేకపోవడంతో పంట ఎదుగుదలలో సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో రైతుల్లో ఆందోళన షురూ అయ్యింది. ఈ ఏడాది సాగునీటి కొరత లేకపోవడంతో నిజామాబాద్ జిల్లాలో 4లక్షల 36వేల ఎకరాల్లో వరి సాగు కాగా, ఎడపల్లి మండలంలో 12,700 ఎకరాల్లో వరి సాగైంది.

**వరికు అధికమైన తెగుళ్లు..**

ప్రస్తుతం వానాకాలంలో మొత్తం వరి విస్తీర్ణంలో 85శాతం సన్న రకాలు సాగయ్యాయి. వరుస భారీ వర్షాలు, ముసురుతో పాటు ఉష్ణోగ్రత్తల్లో వ్యత్యాసాలు, ఉక్కపోత వంటి కారణాలతో వరి సాగులో ఇబ్బందులు ఎదురయ్యాయి. నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో జూన్‌లో నారు పోసుకొని జూలైలో నాటు వేసి పొలాలు వర్షాలకు ఏపుగా పెరగడంతో దోమ వ్యాప్తి, బూడిద తెగులు (బాక్టీరియా ఆకు ఎండు తెగులు) అధికమైంది. ఇప్పటికే రెండు నుంచి మూడు సార్లు ఖరీదైన పురుగు మందులు పిచికారి చేసిన వైరస్ నియంత్రణలో రాలేదని రైతులు వాపోతున్నారు. దోమతో పాటు మొగి పురుగు ఆశించడంతో దిగుబడులపై ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడింది. ఆగస్టు నెలలో ఆలస్యంగా సాగు చేసిన వరికి ప్రారంభం నుంచే పురుగు ఆశించింది. ఇప్పటి వరకు రెండు నుంచి మూడు సార్లు రైతులు పురుగు మందులు పిచికారి చేశారు. సాధారణ రసాయనిక మందులు పని చేయకపోవడంతో కొత్త రకం, ఖరీదైనవి పిచికారీ చేస్తుందన్నారు. ధర అధికంగా ఉండటంతో ఎకరానికి సుమారు రూ. 2,500 వరకు ఖర్చు వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే నెలలో పంట చేతికొచ్చి జోరుగా కోతలు షురూ కానున్న నేపథ్యంలో ఇలాంటి తెగులు సోకి పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందని, వాతావరణం అనుకూలిస్తే తప్ప పంట చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వరిలో సమస్యలు అధికమయ్యాయి**


మంగళ్పాహాడ్ రైతు, గంగారాజునాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తు న్నా.. నాటు దగ్గరి నుంచి తెగుళ్ల సమస్య అధికమైంది. దీనికి తోడు వాతావరణంలో పెను మార్పులు, అధిక వర్షాలు పంటలపై దుష్ప్రభావాలు చూపుతున్నారు. అగ్గి తెగులు, దోమ, మొగి వ్యాప్తితో పంట దెబ్బతింటోంది. సస్యరక్షణ చేపట్టాల్సి రావడంతో పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయి. దిగుబడులు ఆశించిన మేర వచ్చేట్టు కనబడటం లేదు.



**అధికారంగా పురుగు మందుల వాడకంతో నష్టం... ఎడపల్లి ఏవో, సిద్ధి రామేశ్వర్**



రైతులు దశాబ్ధకాలంగా సేంద్రియ ఎరువులు వాడటం లేదు. పశువుల ఎరువుతో పాటు పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము పంటలు రైతులు సాగు చేయడం లేదు. కేవలం అడుగు పిండితో పాటు నత్రజని ఎరువులు అధికంగా వాడటం వల్ల భూమిలో పోషక విలువలు తగ్గాయి. దీనికి తోడు వాతావరణంలో మార్పులు కారణంగా ప్రస్తుతం వరిలో తెగుళ్ల వ్యాప్తి అధికమైంది. రైతులు ఇష్టానుసారంగా మందులు పిచ్చికారి చేయకుండా సస్య రక్షణ చర్యలు, సమగ్ర యాజమాన్య పద్ధతులు చేపడితే మంచి ఫలితాలు సాధించవచ్చు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఊర్వశి, మిమిచక్రవర్తిలకు ఇడి నోటీసులు

**న్యూఢిల్లీ :** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దూకుడు కొనసాగుతున్నది. ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురు నటీనటులను విచారించిన కేంద్ర దర్యాప్తు సంస్థ.. తాజాగా బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలాతో పాటు బెంగాల్ నటీ, టిఎంసి మాజీ ఎంపి మిమి చక్రవర్తికి నోటీసులు జారీ చేసింది. మిమి చక్రవర్తిని ఈ నెల 15న, ఊర్వశిని ఈ నెల 16న ఢిల్లీలోని కార్యాలయంలో విచారణకు హాజరుకావలని ఆదేశించింది. వీరిద్దరూ ప్రముఖ బెట్టింగ్ యాప్ 1xBetకు ప్రచారం చేసినట్టు భావిస్తున్నారు. ఈ యాప్‌కు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, ప్రచారంలో తదితర అంశాల్లో వీరిద్దరి పాత్ర ఎంతో తెలుసుకునేందుకు విచారణ అవసరమని ఈడీ విచారణ అవసరమని భావిస్తున్నది. ఇంతకు ముందు ఇదే కేసులో మాజీ క్రికెటర్లు శిఖర్ ధావన్, హర్భజన్‌సింగ్, యువరాజ్‌సింగ్, సురేశ్ రైనాలను సైతం ఈడీ విచారించింది. శిఖర్‌ను ఈ నెల 4న ఈడీ ఎనిమిది గంటల పాటు విచారించింది. సోషల్ మీడియా వేదికగా 1xBetకి ప్రచారం చేసినట్లు ఆధారాలు లభించగా.. ఆ దిశగా ప్రచారం చేసినట్లు ఆధారాలు లభించాయని.. ఈ క్రమంలోనే విచారణ నిర్వహించినట్లు సమాచారం.

### దుబాయ్‌లో భారత్ – పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ వేళ...

# భారత్‌లో ప్రతిపక్షాల నిరసనలు

**మహారాష్ట్ర, జమ్ములో శివసేన (యుబిటి) ఆధ్వర్యంలో, ఢిల్లీలో ఆప్ నిరసనలు...**

**దక్షిణాదిన..మోదీ సర్కార్‌పై ఎఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ విమర్శనాస్త్రాలు**



**న్యూఢిల్లీ :** భారత్–పాకిస్థాన్ మధ్య ఆసియా క్రికెట్ కప్ మ్యాచ్ భారతదేశంలో నిరసన జ్వాలలను రగిలించాయి. దుబాయ్‌లో జరుగనున్న భారత్–పాకిస్థాన్ ఆసియా కప్ క్రికెట్ మ్యాచ్‌ను వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష పార్టీలు ఆదివారం ఢిల్లీ అంతటా నిరసనలు చేపట్టాయి. ఈ మ్యాచ్‌ను బహిష్కరించాలని ప్రజలను కోరుతూ నినాదాలు చేశాయి. శివసేన నాయకత్వంలో మహారాష్ట్ర, జమ్మూలో నిరసనలు వ్యక్తం చేయగా, ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యులు ఢిల్లీలో నిరసనలు చేపట్టారు. దక్షిణాదిన ఆల్ ఇండియా మజ్లిస్ ఇత్తెహాద్–ఎ–ముస్లిమీన్ (ఎఐఎంఐఎం) చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ పహల్గామ్‌లో మరణించిన వారి జీవితాల విలువ కంటే క్రికెట్ మ్యాచ్ ఆడటం ద్వారా సంపాదించే డబ్బే మీకు ఎక్కువా? అని ఆయన బిజెపి నేతృత్వంలోని కేంద్ర సర్కారుపై మండిపడ్డారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో పర్యాటకులు సహా 26మంది మరణించిన తర్వాత పాకిస్థాన్ నియంత్రణలో ఉన్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలను దెబ్బతీసేందుకు భారతదేశం 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించిన తర్వాత ఇరు దేశాల వైపునా మిలిటరీ మధ్య సంఘర్షణలు చోటుచేసుకున్నాయి. సాంప్రదాయ ప్రత్యర్థులు భారతదేశం–పాకిస్థాన్ ఆదివారం సాయంత్రం దుబాయ్‌లో ఆసియా క్రికెట్ కప్ మ్యాచ్‌లో తలపడుతున్నాయి. అందుకు భారత ప్రభుత్వం జాతీయ జట్టును అనుమతించింది. భారత ప్రభుత్వం ప్రపంచ కప్పు, ఆసియా కప్ వంటి అంతర్జాతీయ పోటీలలో పాకిస్థాన్‌తో ఆడటానికి జాతీయ జట్టును అనుమతించింది. కానీ క్రీడలలో ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని నిషేధించింది. శివసేన (యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్ బిజెపిని, బిజెపి సారథ్యంలోని కేంద్రప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శనాస్త్రాలు సంధించారు. ఇదేనా ప్రభుత్వంలో ఉన్న పార్టీ జాతీయవాదం, దేశం పట్ల ఉన్న ప్రేమ అని ఎద్దేవా చేశారు. 'దాని (బిజెపి) హిందుత్వ అనేది ఒక పెద్ద ప్రహసనం. గతంలో భారతదేశం ఇటువంటి క్రికెట్ మ్యాచ్‌ల నుండి వైదొలగింది. ఈ మ్యాచ్ బహిష్కరించాలని శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాకరే ఇచ్చిన పిలుపు కేవలం మహారాష్ట్రకు మాత్రమే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా ప్రతిధ్వనించింది' అని శివసేన (యుబిటి) నాయకుడు సంజయ్‌రౌత్ చెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీ నిరసనను ప్రస్తావిస్తూ రాజ్యసభ సభ్యుడు మాట్లాడుతూ మ్యాచ్‌ను ప్రదర్శించే రెస్టారెంట్ల పేర్లను బహిరంగంగా ప్రకటిస్తామని, ఆ ఔట్‌లెట్లను బహిష్కరించాలని పిలుపునిచ్చామన్నారు. 'క్రికెట్ మ్యాచ్ చూపించిన రెస్టారెంట్లను బహిరంగంగా ప్రకటిస్తారు. ఈ ట్రెండ్‌ను మహారాష్ట్రలో కూడా అనుసరిస్తారు' అని రౌత్ చెప్పారు. బిజెపి మంత్రి ఆశిష్ షెలార్ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు, ఆసియా క్రికెట కౌన్సిల్ (ఎసిసి) అధిపతి మోనక్వీ కింద పనిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. నైతిక కారణాల వల్ల షెలార్ ఎసిసికి రాజీనామా చేసి ఉండాల్సిందన్నారు. శివసేన వ్యవస్థాపకుడు బాల్‌థాకరే బతికి ఉంటే దుబాయ్ మ్యాచ్ కూడా జరిగేది కాదని ఆయన పేర్కొన్నారు. ఈ మ్యాచ్‌పై నిర్ణయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చీకటిలో తీసుకున్నారని శివసేన (యుబిటి) కార్యదర్శి, ముంబయి క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు మిలింద్ నర్వేకర్ ఎద్దేవా చేశారు. శివసేన(యుబిటి) పుణే, థాణే, మహారాష్ట్రలోని ఇతర ప్రాంతాలలో కూడా నిరసనలు చేపట్టింది. పహల్గామ్ ఉగ్రదాడిలో మరణించిన సంతోష్ జగ్‌దాలే తండ్రి పుణే నివాసి అసవరి జగ్‌దాలే మ్యాచ్‌ను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. 'ఆడటానికి సిద్ధంగా ఉన్నవారిని, ఆటను నిర్వహించే వారిని, ఈ సాయంత్రం ఉత్సాహంగా నినాదాలు చేసేవారిని చూసి నేను చాలా సిగ్గుపడుతున్నాను, పహల్గామ్ దాడిని, సైనికుల త్యాగాలను, లెక్కలేనన్ని దాడులను మర్చిపోతున్నాను' అని ఆమె అన్నారు. శివసేన(యుబిటి) ఆదివారం కూడా 'మజా కుంకు మజా దేశ్' ప్రచారాన్ని ముంబయిలో నిర్వహించింది. మేం ఈ వస్తువులను(వివాహిత స్త్రీ ఉపయోగించే సిందూర్ మరియు ఇతర వస్తువులు) అధికారిక మార్గాల ద్వారా పోస్ట్ ద్వారా కేవలం ముంబయి నుండి మాత్రమే కాకుండా మహారాష్ట్ర అంతటి నుంచి ప్రధానమంత్రి కార్యాలయానికి పంపిస్తున్నాం అని శివసేన (యుబిటి) నాయకురాలు, మాజీ ముంబయి మేయర్ కిషోరి పెడ్నేకర్ విలేకరులకు చెప్పారు. మా సోదరీమణుల భర్తల మరణాలకు సంబంధించిన బాధ్యులను (పహల్గామ్ దాడిని ప్రస్తావిస్తూ) తప్పకుండా పట్టుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరింది. పెడ్నేకర్ ఆమె పార్టీకి చెందిన దక్షిణ ముంబయ్ ఎంపి అర్వింద్ సావంత్ నాయకత్వంలో సెంట్రల్ ముంబయిలోని కర్రీ రోడ్‌లో ఒక నిరసన ప్రదర్శన చేపట్టారు. కాండివలిలో శివసేన పార్టీ కార్యకర్తలు ఒక టెలివిజన్ సెట్‌ను రోడ్డుపై ధ్వంసం చేశారు. ఈరోజు కూడా మ్యాచ్‌ను బహిష్కరించినట్లు శివసేన (యుబిటి) ఎమ్మెల్యే ఆదిత్య థాకరే చెప్పారు.


## ఆనకట్టల్లో పూడికతో నీటి నిల్వలు, వరద నియంత్రణపై ప్రభావం



**న్యూఢిల్లీ :** దేశంలోని చాలా ఆనకట్టలు తీవ్రమైన పూడికను ఎదుర్కొంటున్నాయి. దీంతో వరద నియంత్రణ, నీటి నిల్వలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఇఆర్) చేసిన కొత్త అధ్యయనంలో వెల్లడైంది. హిమాలయ, గంగా–సింధూ నదులు అత్యంత దుర్బలమైనవిగా మారాయని, వాటిపై తక్షణ శ్రద్ధ అవసరం అని సూచించింది. భారతదేశంలో జలాశయాల అవక్షేపణపై సంకలనం నుండి ఇటీవలి సెంట్రల్ వాటర్ కమిషన్ నివేదికలోని గణాంకాలను విశ్లేషించింది. చాలా ఆనకట్టలు వాటి మొత్తం జలాశయ సామర్థ్యంలో 50 శాతం కంటే ఎక్కువ కోల్పోయాయని కనుగొంది. 2050 నాటికి తూర్పున ప్రవహించే నదులలో 10, పశ్చిమాన ప్రవహించే నదులలో 7 జలాశయాలు వాటి పూర్తి సామర్థ్యంలో 50 శాతం నిల్వలను కోల్పోతాయని అంచనా వేసింది. ఇది నీటి భద్రతకు తీవ్ర ముప్పును కలిగిస్తుందని 'స్టోకాస్టిక్ ఎన్విరాన్‌మెంటల్ రీసెర్చ్ అండ్ రిస్క్ అసెస్‌మెంట్' జర్నల్‌లో ప్రచురించబడిన భారతదేశంలోని పెద్ద జలాశయాల అవక్షేపణ–ప్రేరిత దుర్బలత్వాలు అనే అధ్యయనం పేర్కొంది. భోపాల్‌లోని ఐఐఎస్ఇఆర్ నుండి పరిశోధకులు ఉమా మాధురి మొగిలి, సోమిల్ స్వర్ణంకర్ హిమాలయ, గంగా–సింధూతో సహా ఏడు ప్రాంతాలలో దాదాపు 370 పెద్ద జలాశయాలను 100 మిలియన్ క్యూబిక్ మీటర్లకుపైగా సామర్థ్యాన్ని పరిశీలించారు. విశ్లేషించబడిన జలాశయాలలో ఎక్కువ భాగం 1939–1991 మధ్య పని ప్రారంభించినట్లు కనుగొన్నారు. గోదావరి దాటి తూర్పు వైపు ప్రవహించే నదులు దాదాపు 160 జలాశయాలను కలిగి ఉన్నాయి. ఇవి దక్షిణ భారతదేశ వ్యవసాయ, పారిశ్రామిక నీటి అవసరాలను తీర్చడంలో కీలకమైన జోన్ అని పరిశోధకులు పేర్కొన్నారు. అయితే, నర్మదా వరకు పశ్చిమ వైపు ప్రవహించే నదులలో తక్కువ అని, అయితే పెద్ద జలాశయాలు ఉన్నాయని గుర్తించారు. పరిశోధన ప్రకారం, హిమాలయ, గాంగా–సింధూ నదుల్లోని అనేక జలాశయాలు అధిక లేదా అత్యంత దుర్బలత్వం మారినట్లు వివరించారు. వీటిపై తక్షణ శ్రద్ధ, నిర్వహణ జోక్యం అవసరమన్నారు.

## కాలువలో పడ్డ కారు


### మహిళలు, చిన్నారులు సహా ఏడుగురు మృతి



**జైపూర్ :** రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తుండగా, కారు అదుపుతప్పి నీటి కుంటలో పడింది. ఈ ఘటనలో రెండు కుటుంబాలకు చెందిన మహిళలు, చిన్నారులుసహా ఏడుగురు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి ప్రహ్లాద్‌పుర సమీపంలోని శివదాస్‌పుర పోలీస్ స్టేషన్ ప్రాంతంలో వేగంగా వెళ్తున్న కారు జైపూర్‌లో డివైడర్‌ను ఢీకొట్టి రింగ్ రోడ్డు దిగువన ఉన్న దాదాపు 16 అడుగుల లోతున పడిపోయిందని అధికారులు తెలిపారు. నుజ్జు నుజ్జు అయిన వాహనాన్ని ఆదివారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం, క్రేన్ సహాయంతో కారును బయటకు తీశారు. కారులో ఉన్న ఏడుగురి మృతదేహాలను పోస్టుమార్టం కోసం పంపినట్లు శివదాస్‌పుర ఎస్‌హెచ్‌ఓ సురేంద్ర సైని తెలిపారు. మృతులను వాటిక, సంగనేర్ నివాసి రామ్‌రాజ్ వైష్ణవ్; అతని భార్య మధు; వారి కుమారుడు రుద్ర; అజ్మీర్‌లోని కేక్రీకి చెందిన రామ్‌రాజ్ బంధువు కలురామ్; కలురామ్ భార్య సీమ; వారి కుమారుడు రోహిత్; మరియు గజరాజ్‌గా గుర్తించారు. ప్రమాదం శనివారం రాత్రి ఆలస్యంగా జరిగినట్లు కనిపిస్తోందని, అయితే కచ్చితమైన సమయం తెలియదని సైని అన్నారు. ఆదివారం మధ్యాహ్నం అండర్‌పాస్‌లో దెబ్బతిన్న కారు కనిపించినప్పుడు మాత్రమే ఈ విషయం వెలుగులోకి వచ్చింది అని ఆయన అన్నారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం టాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తున్న రామ్‌రాజ్ తన బంధువు చితాభస్మాన్ని నిమజ్జనం చేయడానికి కలురామ్, వారి కుటుంబాలతో కలిసి హరిద్వార్‌కు వెళ్లాడు. వారు జైపూర్‌కు తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది.

## దేశ వ్యతిరేక శక్తులకు కాంగ్రెస్ రక్షణ

### అసోం పర్యటనలో ప్రధాని మోదీ విమర్శ



**మంగళ్‌దోయ్ :** ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం అసోంలో పర్యటించారు. దరంగ్ జిల్లాలోని మంగళ్‌దోయ్‌లో జరిగిన ర్యాలీలో మోదీ ప్రసంగించారు. ప్రతిపక్ష కాంగ్రెస్‌పై మండిపడ్డారు. భాతర సైన్యానికి మద్దతు ఇవ్వడానికి బదులుగా, పాకిస్థాన్ తయారుచేసిన ఉగ్రవాదులకు మద్దతు ఇస్తోందని ఆరోపించారు. చొరబాటుదారులను, దేశ వ్యతిరేక శక్తులను రక్షిస్తోందన్నారు. చొరబాటుదారులు భూమిని ఆక్రమించుకోవడానికి, జనాభాను మార్చడానికి వారు చేసిన కుట్రను బిజెపి అనుమతించదని ప్రధాని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నాశనం చేసిన మన సాయుధ దళాలకు మద్దతు ఇవ్వడానికి బదులుగా, చొరబాటుదారులను, దేశ వ్యతిరేక శక్తులను రక్షించడంలో కాంగ్రెస్ నిమగ్నమై ఉందని ప్రధాని ఆరోపించారు. 1962లో చైనా దురాక్రమణ సమయంలో జవహర్‌లాల్ నెహ్రూ అసోం ప్రజలపై చేసిన గాయాలు ఇంకా మానలేదన్నారు. ఆక్రమిత భూమి నుండి చొరబాటుదారులను తరిమికొట్టి, రైతులు ఇప్పుడు ఈ ప్లాట్లలో సాగు చేసుకోవచ్చని ప్రకటించినదుకు అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మను కూడా ఆయన ప్రశంసించారు. చొరబాటుదారులు భూమిని లాక్కోవడానికి, మహిళలు, బాలికలను అవమానించడానికి, జనాభాను మార్చడానికి కుట్ర చేయడాన్ని బిజెపి అనుమతించదని, ఇది జాతీయ భద్రతకు ముప్పు అని మోదీ వ్యాఖ్యానించారు. భారతరత్న అవార్డు గ్రహీత భూపేన్ హజారికాను కాంగ్రెస్ అవమానించడం పట్ల తాను బాధపడ్డానన్నారు. ఆమె కలల సాకారం చేయడానికి బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ దశాబ్దాలుగా అసోంను పాలించిందని, కానీ బ్రహ్మపుత్ర నదిపై కేవలం మూడు వంతెనలు మాత్రమే నిర్మించిందని, బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం గత 10 సంవత్సరాలలో అలాంటి ఆరు నిర్మాణాలను నిర్మించిందని మోదీ పేర్కొన్నారు. భారతదేశం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఎదుగుతోందని ప్రధాని పేర్కొంటూ అసోం వృద్ధి రేటు 13 శామన్నారు.

**ముడి చమురు, గ్యాస్ దిగుమతులను తగ్గించడానికి చర్యలు**

బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ముడి చమురు, గ్యాస్ దిగుమతులను తగ్గించడానికి చర్యలు తీసుకుంటోందని, శిలాజ ఇంధనాలు, గ్రీన్ ఎనర్జీ అన్వేషణపై ఎక్కువ దృష్టి సారిస్తోందని ప్రధాన మోదీ అన్నారు. రూ. 12,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన తర్వాత నుమాలిగఢ్‌లో జరిగిన ర్యాలీలో ప్రసంగించారు. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారతదేశం అభివృద్ధి చెందుతున్నందున, ముడి చమురు, గ్యాస్ కోసం దేశం విదేశీ దేశాలపై ఆధారపడి ఉందని అన్నారు. దీనిని మార్చడానికి, మన ఇంధన అవసరాలను తీర్చడంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం చమురు అన్వేషణ, గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిపై పని చేస్తోంది అని ప్రధాని అన్నారు. ఇథనాల్ ఒక ప్రధాన ప్రత్యామ్నాయ ఇంధన వనరు, నుమాలిఘర్‌లో కొత్తగా ప్రారంభించబడిన బయోఇథనాల్ శుద్ధి కర్మాగారం రైతులకు, గిరిజనులకు గణనీయంగా ప్రయోజనం చేకూరుస్తుందని ఆయన అన్నారు.

## ఎస్ఎస్‌సి పరీక్షలకు 2,29,497 మంది అభ్యర్థులు హాజరు

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ ప్రభుత్వసహాయక పాఠశాలల్లో 11, 12 తరగతులలో అసిస్టెంట్ టీచర్ల నియామకం కోసం ఆదివారం జరిగిన స్కూల్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సి) పరీక్షలకు మొత్తం 2,29,497 మంది అభ్యర్థులు హాజరయ్యారని అధికారులు తెలిపారు. విద్యా మంత్రి బ్రాత్య బసు పేర్కొన్న ప్రకారం మొత్తం 2.46 లక్షల మంది నమోదైన అభ్యర్థులలో 93 శాతం మంది హాజరయ్యారు. తొమ్మిదేళ్ల తర్వాత నిర్వహిస్తున్న స్కూల్ లెవల్ సెలక్షన్ టెస్ట్ (ఎస్ఎల్ఎస్‌టి) 478 కేంద్రాలలో నిర్వహించారు. 13,517 మంది అభ్యర్థులు రాష్ట్రం వెలుపల నుండి వచ్చారని, వీరిలో ఎక్కువ మంది ఉత్తరప్రదేశ్, బిహార్ నుండి వచ్చారని బసు చెప్పారు. ఈనెల 7న నిర్వహించిన మొదటి దశలో 636 కేంద్రాలలో 9, 10 తరగతులలో అసిస్టెంట్ టీచర్ల నియామకం కోసం ఉద్దేశించిన ఎస్ఎల్ఎస్‌టి పరీక్షలకు 3.19 లక్షల మంది అభ్యర్థులలో 91శాతం మంది హాజరయ్యారు. వారిలో 31,362 మంది బెంగాల్ వెలుపల నుండి వచ్చారు. అధిక శాతం ఉత్తరప్రదేశ్, బిహార్ నుండి వచ్చారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన అభ్యర్థిలపై తాను రాజకీయ వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదని, బసు చెప్పారు.

## ఇజ్రాయెల్ దాడులపై నేడు అరబ్ దేశాల సదస్సు

**దోహా :** గడచిన మంగళవారం దోహాలో పలుచోట్ల ఇజ్రాయెల్ దాడులు చేయడంపై సోమవారం అరబ్ దేశాల నాయకులు శిఖరాగ్ర సదస్సు నిర్వహిస్తున్నారు. ఖతార్‌లో జరిగే ఈసదస్సులో పలు అరబ్ దేశాల నాయకులు పాల్గొని ఆ దేశానికి తమ సంఘీభావం ప్రకటిస్తారు. భవిష్యత్ ప్రణాళిక రూపొందించే అవకాశాలున్నాయి. దీనికి ముందుగా ఆదివారంననాడు దోహాలో అరబ్ దేశాల విదేశాంగమంత్రుల సమావేశం జరిగింది. దోహాలో చేసిన దాడులను ఖతార్ ప్రధానమంత్రి అల్ తహనీ ప్రతిష్ఠాత్మకంగా భావించారు. దేశ సార్వభౌమాధికారాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించిందని ఆయన విమర్శించారు. శుక్ర,శనివారాల్లో ఆయన అమెరికాలో పర్యటించారు. డోనాల్డ్ ట్రంప్, అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో, ఇతర అమెరికా ఉన్నతాధికారులతో సమావేశాలు జరిపారు. దోహాలో ఇజ్రాయెల్ దాడులపట్ల తమ దేశం ఎంత మాత్రం సంతోషంగా లేదని మార్కో రుబియో చెప్పారు.

## 27 శాతం ఒబిసి కోటాపై బిజెపి డ్రామా

### కాంగ్రెస్ సీనియర్ నేత కమల్‌నాథ్ విమర్శ



**భోపాల్ :** మధ్యప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం ఇతర వెనుకబడిన తరగతులకు(ఒబిసి) 27 శాతం రిజర్వేషన్ల పేరుతో 'డ్రామా' ఆడుతోందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కమల్‌నాథ్ ఆరోపించారు. సామాజిక హక్కులను హరించడానికి అధికార పార్టీ పనిచేస్తోందని మండిపడ్డారు. 2019లో నాథ్ నేతృత్వంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా ఒబిసి కోటాను 14 శాతం నుండి 27శాతానికి పెంచింది. కానీ వ్యాజ్యం కారణంగా అమలు చేయలేకపోయింది. కాగా, మోహన్ యాదవ్ ప్రభుత్వం తనను తాను రక్షించుకోవడానికి కోర్టు విధానాలు, న్యాయ సలహాలను పదేపదే ఉదహరిస్తోందని కమల్‌నాథ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఒబిసి కోటా విషయం సుప్రీంకోర్టు ముందు పెండింగ్‌లో ఉందని, దీనిపై ఈనెల 23నుండి ప్రతిరోజూ విచారణ జరగనుంది. యాదృచ్ఛికంగా, యాదవ్ శనివారం ఒబిసి మహాసభతో సమావేశం నిర్వహించగా, రాష్ట్ర అడ్వకేట్ జనరల్ ప్రశాంత్ సింగ్ ఈ అంశంపై న్యాయవాదులు, వాటాదారులతో చర్చించారు. గత నెలలో ముఖ్యమంత్రి యాదవ్ కోటా అంశంపై అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒబిసిలకు 27 శాతం రిజర్వేషన్లకు మద్దతు ఇవ్వడంలో ఏకగ్రీవంగా ఉన్నాయని చెప్పారు. శాసనసభ, కార్యనిర్వాహక వర్గం దాని అమలును నిర్ధారించడానికి సమష్టి ప్రయత్నాలు చేస్తాయని యాదవ్ నొక్కి చెప్పారు. అయితే బిజెపిపై కమల్‌నాథ్ విరుచుకుపడ్డారు. 'మధ్యప్రదేశ్‌లో 27 శాతం ఒబిసి రిజర్వేషన్లపై 'భారీవ్యూహం' పేరుతో ఆడుతున్న నాటకం. సామాజిక వర్గాల హక్కులను హరించే కుట్ర కంటే తక్కువేమీ కాదు' అన్నారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో పాల్గొనేవారిని మొబైల్\ఫోన్లు తీసుకెళ్లడానికి ఎందుకు అనుమతించలేదని నాథ్ ప్రశ్నించారు. 'ఇది కుట్రలో భాగమా? చర్చ వాస్తవ దృశ్యాలు, వివరాలు ప్రజలకు చేరాలని ప్రభుత్వం కోరుకోలేదా? అని నాథ్ నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒబిసి కోటాను 27 శాతానికి పెంచగా, బిజెఇ అమలు చేయకుండా కోర్టులలో అడ్డంకులు సృష్టించిందని నాథ్ ఆరోపించారు.

## బిజాపూర్‌లో కొత్తగా రెండు భద్రతా శిబిరాలు



**రాయ్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని నక్సలైట్ ప్రభావిత బిజాపూర్ జిల్లాలో భద్రతా శూన్యతను పరిష్కరించడానికి, అభివృద్ధి పనులను సులభతరం చేయడానికి రెండు కొత్త సిఆర్‌పిఎఫ్ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. దీంతో జనవరి 2024 నుండి జిల్లాలో 36 భద్రతా శిబిరాలను ఏర్పాటు చేసినట్లు బిజాపూర్ పోలీసు సూపరింటెండెంట్ జితేంద్ర కుమార్ యాదవ్ పిటిఐకి తెలిపారు. ఇదే సమయంలో 193 మంది మావోయిస్టులను తటస్థీకరించామని, 496 మంది లొంగిపోయారని, 900 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం 'నియాద్ నెల్లా నార్' (మీ మంచి గ్రామం) పథకం కింద గ్రామస్తులకు ప్రాథమిక సౌకర్యాలు, భద్రత కల్పించడం లక్ష్యంగా శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఉల్లూర్ గ్రామంలో జిల్లా పోలీసులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) సెప్టెంబర్ 9న 'సురక్ష ఏవం జన్ సువిధ క్యాంప్' (భద్రత, ప్రజా సౌకర్యాల శిబిరం)ను ఏర్పాటు చేయగా, మరొకటి 11న చిల్లమార్క గ్రామంలో ఏర్పాటు చేశారు. రెండూ భోపాల్‌పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నాయని ఆయన చెప్పారు. ఉల్లూరులోని సిఆర్‌పిఎఫ్ శిబిరం 62వ బెటాలియన్‌కు ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్‌గా, మరొకటి 2వ బెటాలియన్‌లో ఒకటిగా ఉంటుందని అధికారి తెలిపారు. ప్రతికూల వాతావరణం, కష్టతరమైన భౌగోళిక పరిస్థితులు ఉన్నప్పటికీ, భద్రతా దళాలు అజేయమైన ధైర్యాన్ని ప్రదర్శించి రెండు కొత్త శిబిరాలను విజయవంతంగా స్థాపించాయని, ఈ చర్య వ్యూహాత్మకంగా ముఖ్యమైనది మాత్రమే కాకుండా, ప్రాంతీయ అభివృద్ధి వేగాన్ని కూడా బలోపేతం చేస్తుందని అధికారి తెలిపారు. ఈ శిబిరాలు భోపాల్‌పట్నంను ఫర్సేఘర్, సాండ్రా (బిజాపూర్‌లో), గడ్చిరోలి (పొరుగున ఉన్న మహారాష్ట్రలో)లకు అనుసంధానించడంలో సహాయపడతాయి, మావోయిస్టుల అంతర్‌రాష్ట్ర కార్యకలాపాలను అదుపు చేస్తాయి. అంతేకాకుండా, ఇంద్రావతి జాతీయ ఉద్యానవనం ప్రాంతంలోని గ్రామాలను అనుసంధానించడానికి రోడ్ల నిర్మాణాన్ని కూడా ఇవి సులభతరం చేస్తాయని ఆయన అన్నారు. ఈ శిబిరాలు గ్రామస్తులకు ఆరోగ్యం, విద్య, విద్యుత్, తాగునీరు, పిడిఎస్ (ప్రజా పంపిణీ వ్యవస్థ) దుకాణాలు, మొబైల్ నెట్‌వర్క్, రోడ్లు, వంతెనలు అందుబాటులో ఉండేలా చూసుకోవడానికి సహాయపడతాయని అధికారి తెలిపారు.

## టర్కీకి ఇజ్రాయెల్ దాడి భయం

**ఇస్తాంబుల్:** ఏడాదికాలంగా మధ్యప్రాచ్యంలో ఖతార్ సహా ఏడు దేశాలపై దాడులు చేసిన ఇజ్రాయెల్ వల్ల తమ దేశానికి కూడా తీవ్ర ప్రమాదం ఉందని టర్కీ భయాందోళన చెందుతోంది. దోహాలో దాడుల తర్వాత తదుపరి లక్ష్యం తమ దేశమేనని భయపడుతోంది. ఈనెల తొమ్మిదో తేదీన ఇజ్రాయెల్ సైన్యం దోహాపై దాడులు చేసింది. హమాస్ నాయకులు హతులయ్యారని భావించింది. హమాస్ నాయకులను అప్పగించకపోతే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని ఖతార్‌కు ఇజ్రాయెల్ హెచ్చరించడంతో ఆ దేశ ప్రధానమంత్రి అల్ తహనీ ప్రపంచదేశాల మద్దతు కూడగడుతున్నారు. ఇప్పుడు టర్కీ కూడా భయపడుతోంది. ఇజ్రాయెల్,టర్కీ రెండు ఒకప్పుడు మధ్యప్రాచ్యంలో బలమైన భాగస్వామ్యదేశాలు. కానీ అనేక సంవత్సరాలుగా పాలస్తినాకు, హమాస్‌కు టర్కీ మద్దతుగా ఉంది. హమాస్ నాయకులు నిత్యం టర్కీలో పర్యటనలు చేస్తూనే ఉంటారు. వారికి అక్కడ నివాసాలు ఉన్నాయి. ఆ దేశాధ్యక్షుడు రెసెప్ తయ్యప్ ఎర్డొగాన్ హమాస్‌కు మద్దతు ఇస్తున్నందువల్ల ఐడిఎఫ్ దాడి చేస్తుందని ఆయన భయపడుతున్నారు. నెతన్యాహూను ఆయన అడాల్ఫ్ హిట్లర్‌తో పోల్చారు. ఖతార్ నాయకులకు ఆయన సన్నిహితుడు. ఇప్పటివరకూ ఇరాన్, సిరియా, యెమెన్, ఖతార్ దేశాలపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఐతే టర్కీకి బలమైన సైనికశక్తి ఉంది.

## బీమా రంగంలో నూరుశాతం ఎఫ్‌డిఐ శీతాకాల సమావేశాల్లో సవరణ బిల్లు



**న్యూఢిల్లీ:** పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో బీమా సవరణ బిల్లు ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ చెప్పారు. బీమారంగంలో నూటికి నూరుశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను(ఎఫ్‌డిఐ) అనుమతించేందుకు వీలుగా ఈ సవరణ బిల్లు ప్రతిపాదన పార్లమెంటుకు తెచ్చే అవకాశాలున్నాయని ఒక ప్రశ్నకు సమాధానంగా పిటిఐ వార్తాసంస్థకు మంత్రి చెప్పారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు సాధారణంగా నవంబరు రెండోవారంలో ప్రారంభమై క్రిస్మస్‌కు ముందే పూర్తవుతాయి. బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను తదుపరి మరింతగా సరళీకరించేందుకు ఈబిల్లు ఉపయోగపడుతుందా అని ప్రశ్నించగా ''నేనే అదే ఆశాభావంతో ఉన్నా'' అని సీతారామన్ చెప్పారు. జీవితబీమా సంస్థ చట్టంలో సవరణ ద్వారా బ్రాంచీల విస్తరణకు, ఉద్యోగుల నియామకాలు, ఎంపికలకు సంస్థ బోర్డుకే పూర్తి నిర్వహణాధికారాలు సంక్రమింపజేస్తారు. ఐతే ఈ చట్టంలో సవరణలు ప్రధానంగా పాలసీదార్ల ప్రయోజనాల రక్షణపైనే దృష్టి పెడుతుందని మంత్రి చెప్పారు. బీమారంగంలో ప్రస్తుతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు విధించిన 74 శాతం పరిమితిని నూరూశాతానికి పెంచుతామని ఈ ఏడాది బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి ప్రతిపాదించారు. ఆర్థిక రంగంలో కొత్త తరం సంస్కరణలను తీసుకురావడంలో భాగంగా ఈ సవరణ బిల్లు ప్రవేశపెడతారు. ''ఈ ఎఫ్‌డిఐ పరిమితి పెంపువల్ల దేశంలో యావత్ ప్రీమియం పెట్టుబడులకు సంబంధిత కంపెనీలకు అవకాశం కలుగుతుంది, ప్రస్తుతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో విధించిన ఆంక్షలను ఈ బిల్లు ద్వారా సమీక్షించి నిర్ణయం తీసుకుంటాం, ఈ విధానాన్ని సంక్షిప్తీకరిస్తాం అని మంత్రి చెప్పారు. ఇప్పటివరకూ బీమారంగం రూ.82,000 వేలకోట్లు ప్రత్యక్ష పెట్టుబడులను సమకూర్చుకుంది. 1938 నాటి బీమా చట్టంలోని వివిధ నిబంధనలను సవరించేందుకు ఆర్థికమంత్రి చేసిన ప్రతిపాదనలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను నూరుశాతం పెంపు కూడా ఒకటి. 1956 జీవిత బీమా సంస్థ చట్టం, 1999 నాటి బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ చట్టం,1938 బీమా చట్టాలలో సమగ్ర శాసనపరమైన సవరణల్లో భాగంగా ఈ ప్రతిపాదనలు చేశారు.

## ట్రంప్ రాకకోసం బ్రిటన్ రాచకుటుంబం ఏర్పాట్లు

**లండన్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ వారంలో బ్రిటన్‌లో పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఘనమైన స్వాగత సత్కారాలు చేయడానికి రాచకుటుంబం బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేస్తోంది. చారిత్రాత్మకమైన పురాతన బగ్గీలలో ప్రయాణ ఏర్పాట్లు, బ్రహ్మాండమైన విందులు, ఆడంబరాలు, గగనతల విన్యాసాలు, రెడ్‌కార్పెట్లతో ఘన స్వాగతాలకు రాచకుటుంబం ట్రంప్‌కోసం ఏర్పాట్లు చేస్తోంది. ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ కూడా తన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పర్యటన సందర్భంగా సుంకాలు, వాణిజ్యం, ఉక్రేన్ యుద్ధ సమస్యపై చర్చలు వంటి అనేక ఇబ్బందికరమైన సమస్యలపై కూడా ట్రంప్ నిర్మొహమాటంగా తన అభిప్రాయాలు ప్రకటించే అవకాశాలున్నాయి.

# సాహితీ విహారి

# ఉద్యమ నెగళ్లు రాజేసిన తెలంగాణ సాహిత్యం

తెలంగాణ సాయుధపోరాటం కావచ్చు.. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కావచ్చు.. ఉవ్వెత్తున ఎగసిపడిన నిరసనలకు ఊపిరిలూది, ప్రజలకు పోరాట మార్గాన్ని చూపిన ఘనత ముమ్మాటికీ సాహిత్యానిదే. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా, అప్పటి సాహిత్యాన్ని గుర్తుచేసుకోవడం అత్యవసరం. కానీ, విస్తృతమైన, లోతైన రచనలను ప్రస్తావించడం, స్థూలంగా విశ్లేషించుకోవడం అనుకున్నంత సులభం కాదు. అసాధ్యం కూడా. మచ్చుకు కొన్ని ప్రస్తావనలతో ముగించాల్సిన పరిస్థితి. నిజానికి, నాటి ఉద్యమాన్ని కవిత్వమే ఉరకలేయించింది. పరుగులు తీయించింది. దోపిడీని దునుమాడే ఆయుధమైంది. ప్రజల్లోకి దూసుకెళ్లి, ఉద్యమ స్ఫూర్తిని నింపి, నాటి నైజాం నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసింది. సాహిత్యం అనేది సమాజానికి అద్దం అన్న సామెత మనందరికీ తెలిసినదే. కానీ తెలంగాణలో సాహిత్యం కేవలం అద్దమేగాక, ఒక ఆయుధం.. ఒక జ్యోతి... ఒక పిలుపు. జమీందారీ దోపిడీ, అణచివేత, ఆకలి తెలంగాణ ప్రజలకు ప్రత్యక్ష నరకం చూపుతుంటే, కమ్యూనిస్టుల నేతృత్వంలో సాయుధ పోరాటం అనివార్యమైంది. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలు, ఉద్యమ నిర్మాణ వ్యూహాలు, ప్రజలతో మమేకమై వారి పక్షాన గళమెత్తే విధానాలు తెలంగాణ సాయుధ పోరాటాన్ని ముందుకు నడిపించాయి. అదే సమయంలో, అప్పటి సాహిత్యం కూడా ఈ ఉద్యమానికి అండగా నిలిచింది. ఫలితంగా, ప్రజల్లో గూడుకట్టుకున్న ఆగ్రహ అగ్నిపర్వతం ఒక్కసారి విస్ఫోటనమైంది. ఉద్యమంగా రూపాంతరం చెందింది. సాహిత్యమే ప్రజలను ఒక్కోసారి పాటగా, ఒక్కోసారి కవితగా, ఒక్కోసారి కథగా ఆకట్టుకుంది. ఉద్యమ బాట పట్టించింది. అప్పటి తెలంగాణ సాహిత్యాన్ని పరిశీలిస్తే, అది కేవలం అక్షరాల సమాహారం కాదని స్పష్టమవుతుంది. గాయాలే గేయాలైన ఆ అక్షరాల వెనక కదిలిన మానవ సమూహం గుర్తుకొస్తుంది. సగటు జీవి బతుకు బండిపై రాసిన అక్షరాలు మనల్ని పలకరిస్తాయి. ఆలోచింపచేస్తాయి. నాటి హైదరాబాద్ రాష్ట్రంలో రైతులు జమీందార్ల దోపిడీకి గురయ్యారు. వందల ఎకరాల భూమి కొందరి చేతుల్లో ఉండగా, రైతులు బానిసల మాదిరిగా బతికారు. ఈ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు లేచినప్పుడు, ఆ స్వరం మొదటగా కవిత్వంగా, పాటగా బయటపడింది. ఒక ఉద్యమంగా ఎగసిపడింది. తెలంగాణ సాయుధ పోరాటం భారత దేశ చరిత్రలో ముఖ్యమైన అధ్యాయంగా నిలిచిపోయింది. జమీందార్లకు, దోపిడీదార్లకు, నైజాం పాలనకు వ్యతిరేకంగా లక్షలాది రైతులు ఉద్యమించారు. కవులు, గాయకులు, రచయితలు ఉద్యమాన్ని రికార్డు చేయడమే కాదు.. దానికి ఇంధనం సమకూర్చారు కూడా. ఈ సమయంలో కవిత్వం, పాట, నాటకం, నవల ఇలా ప్రతి ఒక్క సాహితీ ప్రక్రియ ప్రజలకు మార్గదర్శకం చేసింది. ప్రజలు పెద్దఎత్తున వీధుల్లో నినాదాలు చేస్తే, రచయితలు పదాలతో ఆ నినాదాల్ని బలపరిచారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ సాగిన దాసరథి రచన, ఒక అణచివేతకు వ్యతిరేకంగా వినిపించిన సింహ గర్జన. వ్యంగ్యమూ, తిరుగుబాటూ కలిపిన శక్తి. ఆయన భాషలో తెలంగాణ మట్టివాసన ఉంది. దాశరథి మాదిరిగానే ఎంతో మంది కవులు అణచివేతను నిరసించారు. ప్రజల తరఫున ధిక్కారపు కేతనాన్ని ఎగురవేశారు. తిరుగుబాటు చేసి, సవాలు విసిరి, సాహిత్య సమరభేరి మోగించారు. సాయుధ దళాలతో తలపడ్డ అక్షరాలే ఆయుధంగా పోరాటాలు కొనసాగించారు. ఆచరణాత్మక ప్రబోధమై వెలిగే నిఖార్సుతనానికి నిలువెత్తు రూపంగా దర్శనమిచ్చారు. తెలంగాణలో జరిగిన దోపిడీలు, పడతుల మానాల అపహరణాలు, అణచివేతలు, ఊళ్ళకు ఊళ్ళు అగ్గిపెట్టి తల్లీ పిల్లల కడుపు కొట్టిన దుర్మార్గాలు... ఇలా ప్రతి అంశం నాటి సాహిత్యంలో ఆవిష్కృతమైంది. దౌర్జన్యాలు, అక్రమాలు, అన్యాయాలపై ధిక్కార స్వరాలు వినిపించింది. నాటి తెలంగాణ సాహిత్యమంటే ఉద్యమ సాహిత్యం... తిరుగుబాటు సాహిత్యం... విప్లవ సాహిత్యం... అణగారిన వర్గాల్లో ఆత్మస్థైర్యాన్ని నింపిన సాహిత్యం... నైజాం అకృత్యాలను ఎదిరించే శక్తిని సామాన్యుడికి అందించిన సాహిత్యం. తెలంగాణ ఉద్యమకాలంలో ప్రముఖ నవలా రచయిత వట్టికోట అళ్వారుస్వామి రచించిన 'ప్రజల మనిషి'కావచ్చు... దాశరథి రంగాచార్యులు రాసిన 'మోదుగపూలు' కావచ్చు... ప్రతి ఒక్క రచనా ఒక్కో నిప్పు కణిక. కాళోజీ నారాయణరావు సాహిత్యానికి, తెలంగాణ ఉద్యమానికి ఉన్న సంబంధం గురించి ఎంత చెప్పినా తక్కువే. కవితలు, పాటలు మాత్రమేకాదు... ఒగ్గుకథ, బుర్రకథ, హరికథ వంటి జానపద కళారూపాలు కూడా ఉద్యమాన్ని నిలబెట్టాయి. అప్పట్లో ఎంతో మంది రచయితలు




> *తెలంగాణ సాయుధ పోరాట సమయంలో వచ్చిన రచనలేకాదు.. ఆ తర్వాత ఎంతోమంది తమ అనుభవాలను వివరిస్తూ రాసిన పుస్తకాలు కూడా పాఠకులను విశేషంగా ఆకర్షిస్తునే ఉన్నాయి. రావి నారాయణ రెడ్డి 'వీర తెలంగాణ నా అనుభవాలు... జ్ఞాపకాలు' కావచ్చు... దొడ్డా నరసయ్య రాసిన 'తెలంగాణ సాయుధ పోరాటం.. అనుభవాలు–జ్ఞాపకాలు' కావచ్చు.. నల్లా నరసింహులు రచించిన 'తెలంగాణ సాయుధ పోరాటం.. నా అనుభవాలు' కావచ్చు.. ప్రతి పుస్తకం చరిత్రకు దర్పణం. ప్రతి అక్షరం భవిష్యత్ తరాలకు మార్గదర్శకం.*

కేవలం సాహిత్య ప్రయోగం కోసం కాదు, ఉద్యమంలో భాగస్వాములయ్యేందుకు అక్షరయజ్ఞం చేశారు. ప్రజాగేయాలు ఊరూవాడా మారుమోగాయి. ప్రజా గీతం అంటే కేవలం జానపద స్వరం కాదు, అది 'న్యాయం కావాలి' అంటూ ప్రతిధ్వనించే ఆత్మకేక అని నిరూపించాయి. తెలంగాణ సాహిత్యాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా ప్రజా గీతాలే చూడాలని అనుకునే రీతిలో నాటి పాటలు ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకున్నాయి. అవి దాదాపు ప్రతి గ్రామంలో వినిపించాయి. ఆయా ప్రాంతాల సమస్యలను బయటపెట్టాయి. ప్రజల కష్టాలను, జమీందారుల దౌర్జన్యాలను కళ్లకు కట్టాయి. తిరుగుబాటుకు ప్రేరేపించాయి. వీధినాటకాల రూపంలోనూ ఉద్యమ సాహిత్యం తెలంగాణ నలుమూలలా విస్తరించింది. కమ్యూనిస్టు కళా బృందాలు గ్రామాలకి వెళ్లి వీధి నాటకాలు ఆడేవి. మనం ఎందుకు బానిసలుగా ఉన్నాం? అన్న ప్రశ్న లేవనెత్తేవి. తెలంగాణ సాహిత్యం ఉద్యమానికి జవజీవాలను అందించేవి. పాట నుంచి నాటకం వరకూ... కవిత నుంచి నవల వరకూ, అన్ని రకాల సాహిత్య ప్రక్రియలూ తెలంగాణ ఉద్యమాన్ని నిలబెట్టాయి. గెలుపుబాటలో నడిపించాయి. స్థూలంగా చెప్పాలంటే, ఉద్యమ నెగళ్ళు రాజేసిన తెలంగాణ సాహిత్యం కేవలం పుస్తకాలలో పరిమితమైనది కాదు. అది వీధిలో నినాదమైంది, పొలాల్లో పాటైంది, పల్లెలో గర్జనైంది. తెలంగాణ సాహిత్యం అనేది ఒక యుగానికి నినాదం. అది తిరుగుబాటుకు పిలుపు. అది కన్నీటి చరిత్ర. అదే సమయంలో ఆశ, ఆత్మగౌరవం, గెలుపు పిలుపు కూడా. 1940 దశకంలో వచ్చిన తెలంగాణ సాహిత్యాన్ని... తెలంగాణ సాయుధ పోరాటాన్ని వేరువేరుగా చూడడానికి వీల్లేదు. అప్పటి సాహిత్యంతా ఉద్యమమే. ఉద్యమమంతా సాహిత్య ప్రభావితమే. ఆ రచనలు నేటికీ అదే తరహా ఉద్రేకాన్ని, ఉద్వేగాన్ని కలిగిస్తాయి. ఆ సాహిత్యానికి శతకోటి విప్లవాభివాదాలు.

**– బిఎల్**

బండి యాదగిరి రాసిన 'బండెన్క బండి కట్టి.. పదహారు బండ్లు కట్టి... ఏ బండ్లో వస్తవు కొడుకో దేశ్‌ముఖు దొరగాడా' అనే పాట నాటి సాయుధ పోరాటంలోనేకాదు... ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో కొన్ని చిన్నచిన్న మార్పులతో మరోసారి తెలంగాణ యావత్తు మారుమోగిపోయింది. యువతకు హితబోధ చేసింది. జన సామాన్యంలోకి చొచ్చుకుపోయి, దశాబ్దాలపాటు తెలంగాణ పోరాటాలకు ప్రతిబింబమైంది. ఆ వేదనను వినిపించడానికి, ఆగ్రహాన్ని ప్రతిబింబించడానికి విద్యార్హతలేవీ అవరం లేదని యాదగిరి పాట ని రూపిస్తుంది. నిరక్షరాస్యుడైనప్పటికీ, అతని పాట తెలంగాణ సాయుధ పోరాట హృదయస్పందనగా మా రింది. చురకత్తుల్లా సూటిగా మెదళ్లలోకి దూసుకుపో యే పదాలకు అక్ష ర లక్షలు సరిపోవు. ప్రశ్నించే గొం తుకలకు ధైర్యమిచ్చిన ఆ పాట సింహనాదమై జనం గుండెల్లో ప్రతిధ్వనించింది. నైజాం సర్కారు గుండెల్లో రై ళ్లు పరిగెత్తించింది. అప్పటి ప్రజల యొక్క దృఢ సంకల్పాన్ని, లక్ష్యాన్ని ఎలుగెత్తి చాటిన ఆ పాట ఇప్పటికీ ప్రజల గుండెల్లో సజీవంగా, స్థిరంగా నిలిచిపోయింది. 'మా భూమి' సినిమా కోసం గద్దర్ కొన్ని మా ర్పులుచే ర్పులు చేసి పాటిన అదే పాట, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం లోనూ ప్రజలను ఉర్రూతలూగించింది. 'దేశ్‌ముఖు దొరగాడ' అనే పదాల స్థానంలోనే 'నైజా ము సర్కరోడ' అనిమార్చడం, ఆ సినిమాకు అనువైన సందర్భం.



### యాదగిరి రాసిన పాట..

**బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి**
**ఏ బండ్లే వస్తవ్ కొడుకో దేశ్‌ముఖు దొరగాడ**
**నాజీల మించినవ్ రో దేశ్‌ముఖు దొరగాడ**
**పోలీసు మిలిట్రీ రెండు బలవంతులానుకోని**
**నువ్వు పల్లెలు దోస్తివి కొడుకో .. మా పల్లెలు దోస్తివి కొడుకో**
**దేశ్‌ముఖు దొరగాడ**
**స్త్రీ పురుషులంత గలిసి ఇల్లాలమంత గలిసి**
**వడిసేల రాళ్లు గట్టి వడివడిగ గొట్టితేను**
**కారాపు నీళ్లు దెచ్చి కండ్లల్ల జల్లితేను**
**నీ మిలిట్రీ బారిపాయెరో,, నీ మిలిట్రీ బారిపాయెరో**
**దేశ్‌ముఖు దొరగాడ**
**మాపొలం మింగినోడ.. మా అడవి దోచినోడ**
**మా బతకు బుగ్గిచేసి.. సిరిసంపదంత దోచి**
**సంచుల్లకెత్తుకోని.. బళ్లల్లో నింపుకోని**
**బయలుదేరినావ కొడుకో**
**దేశ్‌ముఖు దొరగాడ**
**సుట్టుముట్టూ సూర్యపేట, నట్టనడుమ నల్లగొండ**
**నువ్వుండేది హైద్రబాదు దాని పక్క గోలుకొండ**
**గోలుకొండ ఖిలా కిందా.. గోలుకొండ ఖిలా కిందా**
**నీ గోరికడతం కొడుకో**
**దేశ్‌ముఖు దొరగాడ**
**నీ గోరికడతం కొడుకో**
**దేశ్‌ముఖు దొరగాడ**

# పోరాటాలకు ఊపిరులూదిన తెలంగాణ పాట

పాట తెలంగాణ జన జీవితంలో ఓ భాగమైంది. సంతో షం, దుఃఖం, పండుగ, పబ్బం, చావు, పెళ్లి ఏదైనా పాట ఉండాల్సిందే. తెలంగాణ పాట ప్రజల జీవితాల్లో మా ర్పులు తెచ్చింది. తమ జీవితంలో భాగమైన పాటం తెలంగాణ ప్రజలకు గౌరవం. ఇక్కడి పాటలన్ని శ్రమజీవుల కష్టాల్లోంచి, ఆచార వ్యవహారాల్లోంచి అన్నింటికి మించి పని పాటల సోదరుల పొత్తిళ్లలో పుట్టింది. జనం సుఖ సంతోషాలు, బాధలు, ఆచారాలు, వ్యవహారాలే పాటకు ఇతివృత్తాలయ్యాయి. ఎవరి కోసమో అవసరాలు తీర్చుకోవడానికో ఇక్కడి కవులు కలాలు పట్టలేదప్పుడు. ప్రజల కోసమే కలం పట్టి ప్రజల కోసమే రాశారు. అందుకే తెల ంగాణ పాటకు పదునెక్కువ. అది ఎంతటి శక్తిని సంతరించుకుందం తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రజలు ఉ ప్పెనలా కదిలెలా చేసింది. సామాన్యలను సాయుధులు ను చేసి బలవంతులమని విర్రవిగిన అనేక మందిని తోకముడిచి పారిపోయేలా చేసింది. తరతరాల రాచరిక వ్యవస్థను మట్టికరిపించింది. తమకు ఎదురే లేదని భావించిన వారికి గజగజలాడించిన తెలంగాణ పాట రైతాంగ సా యుధ పోరాటంలో దిక్సూచిగా నిలిచింది. పా ప్రేరణై మ హోత్తర ప్రజా తిరుగుబాటుకు నేతృత్వం వహించింది. ఆ రోజుల్లో పాటలు ప్రజలను ఆలోచింపజేసేవి. ఎంతటి త్యాగానికైనా సిద్ధం కావాలని హితబోధ చేశాయి. ఇప్ప టి బిజెపి నేతలు సాయుధ తెలంగాణ పోరాటం హిందు, ముస్లిం పోరాటంగా చూపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ సందర్భంలో దాశరథి రాసిన పాట విం బిజెపి నేతల్లో మార్పు రావచ్చు. నల గొండ రణములో తెలుగ తెగువను చూపి బలమైన వీరులను కలవాలి
నిలిచి ముస్లింలు, హిందువులు తెలంగాణ సంకెళ్లు తెంచాలి ఈ పాట తర్వాత అనేక పాటలు తెలంగాణ ప్రజలను పోరాటానికి సన్నద్ధం చేశాయి. ఇదే సందర్భంలో

**అరుణారుణ తరుణి కొరకు**
**చెలరేగిన ప్రబల వాంఛ**
**పురికొల్పిన పొంగులతో**
**పోతున్నాం యుద్ధానికి**
**రణరంగపు విపణి వీధి**
**లక్షలాది ప్రాణాలను పైసలుగా పారబోసి స్వాతంత్ర్యం కొనితెస్తాం.** అన్న దాశరథి పాట ప్రజల్లో విశ్వాసాన్ని పోది చేసింది.

**రణభేరీ మ్రోగింది తెలుగోడా**
**రావోయి ముందుకు మొనగాడా**
**ఆంధ్రా వీరులు బాలచంద్రులై లేవాలి**
**మగువలందరూ రుద్రమాంబలై కదలాలి** అన్న సుద్దాల హన్మంతు పాట ప్రజలను కదిలించింది.

**చిన్న చిన్న పొరగాళ్లు**
**సీతయ్య జీతగాళ్లు**
**గొడ్డళ్లు నూరారు**
**భుజానపెట్టారు** అని కైకట్టిన పాట సామాన్యులు ఆయుధాలు పట్టేలా చేసింది. సుద్దాల హన్మంతు, కాళోజీ నారాయణరావు, దాశరథి, సుంకర, విశ్వం, తెన్నేటి సూరి, తిరునగరి రామాంజనేయులు, వట్టికోట అల్వారు స్వామి, బం డి యాదగిరి ఇలా అనేక మంది రాసిన పాటలతో పాటు స్థా నికంగా కవులు, కళాకారులు పరిస్థితులకు అనుగుణంగా స్థానిక బాణిలతో పాటలు పాడుకుంటూ సాయుధ పోరాట విజయవంతానికి తమ పాటను ఆయుధంగా అందించారు. ఇలాంటి త్యాగాల ముటా తెలంగాణ పాట. శృతితప్పి గతితప్పింది. పైసల కోసం




కలాలు, గళాలు అమ్ముడుపోతున్నాయి. తెలంగాణ ప్రజ ల వాస్తవిక జీవితాన్ని ప్రపంచానికి చూపిన పాట చైతన్యాన్ని నింపిన పాట ఇప్పుడు డబ్బుల కోసం జోగుతుం ది. స్థాయి లేని వారిని తెగపొగుడుతూ సా గిల పడుతుం ది. లేనిది ఉన్నట్లుగా ఉన్నది లేనట్లుగా చూపి ప్రజలను ఏమార్చుతుంది. తెలంగాణ పాట వ్యాపార వ స్తువై ఎన్నికల వేళ ఊరురా వినిపిస్తుంది. సాయుధ పోరాట వార్షికోత్సవ వేళ ప్రజల బాధలు తమవిగా ప్రజల జీవితమే పా టకు ప్రేరణగా పాటలు, కవితలు రాసి అమరులైన వారి కి జోహార్లు అర్పిస్తూ ఇప్పటికీ ప్రజల పక్షాన నిలుస్తున్న కలాలకు, గళాలకు వందనాలు అర్పిస్తూ ఓ కవి రాసినట్లు

**కాసు కొరకు కీర్తి కొరకు**
**కాకూడదు గానం**
**ఎత్తవోయి నీ గళం**
**కదలాలి ఈ జనం**
**నీ గానం నీ చిత్రం**
**నీ కావ్యం నీ నటన**
**తెలపాలి అసలు నిజం**
**కదలాలి జనం మనం**


**– ఏనుగు వెంకశ్వరరావు, ఖమ్మం**

## చదవాల్సిన పుస్తకం


# ఉద్యమ యోధుడి సింహావలోకనం




తెలంగాణ సాయుధ పోరాట మహా ఉద్యమంలో పాల్గొన్న ఓ మహాయోధుడు తన అనుభవాలను అక్షర రూపంలో సింహావలోకనం చేసుకోవడం ఆత్మసంతృప్తి కావచ్చు. కానీ, భావి తరాలకు మాత్రం ఓ అద్భుత వరం. 'తెలంగాణ సాయుధ పోరాటం.. నా అనుభవాలు' పేరుతో నల్లా నరసింహులు ఉద్యమ తీరుతెన్నులను అద్భుతంగా వివరించారు. అందులో తన భాగస్వామ్యాన్ని కూడా పొందుపరిచారు. తెలంగాణ చరిత్రలో సాయుధ పోరాటం ఒక అపూర్వమైన విప్లవ ఘట్టం. నిజాం ప్రభుత్వాల దౌర్జన్యం, దోపిడీ, తరతరాల బానిసత్వం, అంతులేని పన్నుల మోత వంటి ఎన్నో పరిణామాలు రైతాంగాన్ని తిరుగుబాటు పంథాలో నడిపించాయి. అణచివేతను, అకృత్యాలను సహించలేని స్థితికి చేరుకున్న గిరిజన, దళిత పేదలు, తమ బానిస సంకెళ్లు తెంచుకోవడానికి ఉద్యమ బాట పట్టారు. కమ్యూనిస్టు పార్టీ మార్గదర్శకంలో తుపాకీ పట్టారు. 'భూమి కోసం.. విముక్తి కోసం ఈ పోరాటం' అంటూ రక్తాన్ని ధారపోశారు. గ్రామగ్రామాన పోరాటాలు చేశారు. ఎంతో మంది వీరమణం పొందారు.



రైతుకి భూమి, కూలీకి గౌరవం సాధించడమే వారి లక్ష్యం. సామంతుల భూస్వామ్య వ్యవస్థను కూల్చివేయడమే వారి ధ్యేయం. దళిత, గిరిజన పేదలపై జరుగుతున్న దోపిడీకి ముగింపు వారు కోరుకున్నారు. కేవలం భూమి కోసం మాత్రమే కాదు.. మనిషి గౌరవం కోసం కోసం కూడా పరితపించారు. వీరి త్యాగం వల్లే నల్లని కాళరాత్రిలో వెలుగురేపిన అగ్ని కిరణాలతో గ్రామాలు మేల్కొన్నాయి. నిజం సర్కారు పీడల నుంచి విముక్తి పొందారు. నాటి తెలంగాణ సాయుధ పోరాటం చూపిన దారి, వేసిన బాటలే ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోశాయి. ఈ అంశాలన్నీ నల్లా నరసింహులు పుస్తకం ప్రస్తావిస్తుంది. విసునూరు దేశ్‌ముఖ్ దోపిడిని, దౌర్జన్యాలను వివరిస్తుంది. చాలా మంది హరిజనులు వెట్టి చేయలేక ముస్లిం మతంలోకి మారిన దైన్యాన్ని కళ్లకు కడుతుంది. ఆకునూరులో ప్రజల తిరుగుబాటు, కడవెండిలో ఆంధ్రమహాసభ నిర్మాణం, చాకలి ఐలమ్మ పోరాటం, జీతగాళ్ల సమ్మె, దొడ్డి కొమురయ్య వీరమణం, ధర్మాపురంలో భూమికోసం పోరాటం, మూకుమ్మడి అరెస్టులు వంటి ఎన్నో జ్ఞాపకాలతో పుస్తకాన్ని నల్లా నరసింహులు తీర్చిదిద్దారు. ఇందులో ప్రతి పేజీ చరిత్ర పుటగా కనిపిస్తుంది. పాఠకులను స్ఫూర్తిదాయక ఆలోచనా స్రవంతిలోకి తీసుకెళుతుంది. నాటి తెలంగాణ పోరాయ యోధులు చేసిన త్యాగాలు వృథా కాకూడదన్న సత్యాన్ని మనకు నిరంతరం గుర్తుచేస్తుంటాయి. ఈ పుస్తకాన్ని ఎన్. సాంబశివరావు 'The Telangana Armed Struggles... my experiences' పేరుతో ఆంగ్లంలోకి అనువదించారు. ఇది ఒక అనువాదం మాదిరికాకుండా, నేరుగా ఒక చారిత్రక నేపథ్యం గల ఆంగ్ల పుస్తకాన్ని చదువుతున్న అనుభూతిని కలిగిస్తుంది. రచయిత స్వయంగా చూసిన పరిస్థితులు... అనుభవించిన కష్టాలు... ఎక్కడికక్కడ రగులుకున్న పోరాట పంథాలు... ఇలా ఎన్నో అంశాలు, ఘటనలు, అనుభవాలతో కూడిన ఈ పుస్తకం తప్పక చదవాల్సిందే.



### పుస్తకం పేరు

**తెలంగాణ సాయుధ పోరాటం.. నా అనుభవాలు**
**రచయిత: నల్లా నరసింహులు**
**వెల: రూ. 170**
The Telangana Armed Struggle... my experiences
price: Rs. 220
**అనువాదం: ఎన్. సాంబశివరావు**

**ప్రతులకు**

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

## ఈ వారం కవితలు

### చలో చండీఘడ్



చలో చలో చలో కామ్రేడ్స్
పద పద పద కామ్రేడ్స్
భారత కమ్యూనిష్టుపార్టీ
ఇరువై ఐదవ మహాసభలకు
రారమ్మని చండీఘ్‌డ పిలుస్తోంది.

నాటి తొలితరం నేతలు
కమ్యూనిస్టు పార్టీ నిర్మాతలు
సింగారవేలు డాంగే ఘాటే అధికారి
చంద్ర ఇంద్రజిత్ గుప్తాలు ఎగరేసిన
ఎర్రజెండా మహాసభ పిలుస్తోంది

ప్రజాస్వామ్య పట్టుగొమ్మ
పార్లమెంటు భవన ప్రారంభకులు మన
రావి నారాయణరెడ్డి ప్రజలవాణి ప్రతిధ్వనించిన
భూపేష్ గుప్తా చతురానన్ చంద్రప్పన్ బర్ధన్
గర్జించిన గళం పిలుస్తోంది. పద కామ్రేడ్

మహిళా బిల్లుకై పోరాడిన మన
గీతా ముఖర్జమ్మ శ్రామిక హక్కుల ప్రధాత
గురుదాస్ దాస్‌గుప్త పార్టీ నిర్మాణధక్షులు
నీలం నల్లమల గిరి ప్రసాద్ త్యాగాల
సమర పతాకం పిలుస్తోంది.పదకామ్రేడ్

నాలుగు వందల దెబ్బె అయిదు మంది
అభ్యర్థుల పోరు బరిలో గెలిచి ఎన్నికల చరిత్రను
తిరగరాసిన ధర్మభిక్షం వామపక్ష విద్యార్థి
యువజన ఉద్యమాల రణం సురవరం
అందించిన ఆరుణ పతాకం పిలుస్తోంది
పద కామ్రేడ్

భరతమాత ముద్దుబిడ్డడు. భగత్ సింగ్
పురిటి గడ్డ పిలుస్తోంది పద కామ్రేడ్
నరహంతక డయ్యర్ తూటాలకు
నేలకొరిగిన అమరుల త్యాగాల నేల
జలియన్ వాలాబాగ్ పిలుస్తోంది.
రక్షణలేని రాజ్యాంగం
ఉగ్రవాదపు ఉన్మాదాలు
మణిపూర్‌లో మారణహోమాలు
మతోన్మాద శక్తుల నుంచి
ఈదేశాన్ని రక్షిద్దాం పద కామ్రేడ్స్

**(సిపిఐ 25వ జాతీయ మహాసభలు చండీఘడ్‌లో జరుగు సందర్భాన్ని పురస్కరించుకొని)**

**బొమ్మగాని నాగభూషణం**
**సెల్: 9849622633**

### గుట్టు తెలియాలి

అవినీతి విశ్వరూపమెత్తింది విశ్వమంతా
విశ్వాసాన్ని కోల్పోయి దోపిడీ కొమ్ము కాస్తున్నది
నీతి గోతిలో కూరుకు పోయింది
నేతిబీర నవ్వు లొలకబోస్తున్నది
ధర్మదేవత గాంధారి రూపు దాల్చింది
మాటకు విలువ లేకుండా ఉంది
మూటలకు వంత పాడుతున్నది
చట్టం చట్ట బండలయినది

పీతాంబర దారులకే పీటలేస్తున్నది
గోచిలోని పాపం కాశీకే అంకితమంటున్నది
రక్త సంబంధాలకు లుప్త మనే వ్యాధి సోకింది
ఆత్మీయత అనురాగం ఎడారిలోన యుగళగీతమైనది
ఐక్యత బీడు పడి పోగా నీతికి పట్టమెక్కడున్నది
అవినీతి అంతం కావాలంటే కలుశాలకు నిలయమైన.....
కలియుగాన్ని మట్టు బెట్టే గుట్టు తెలియాలి

**నమిలకొండ నాగేశ్వర్ రావు**

### ఎవడిదిరా పోరాటం!

అబద్ధాలు ప్రచారం చేస్తే ఊరూరా
ఇంకా నిటారుగా ఆకాశాన్నంటిన
సుత్తికొడవలి స్థూపాలు కాంద్రించి ఉమ్మేస్తాయి
స్థూపాల కింది మండే గుండెలు పెళపెళ
మంటూ విరుచుకు పడతాయి
ఏ కోశానా కూడా పోరాటపు ఛాయలే లేని
ఛాందసులు మౌఢ్యం వాసనే సోకని నేలపై
ప్రగల్భాలు పలక జూస్తే ఊర్ల నడిబొడ్డున
రంగు వెలవని సుత్తి కొడవలి జెండా
దిమ్మెలు మహత్తర పోరాట కాల సాక్ష్యా
లుగా ప్రజాకోర్టుల ఎదుట నిలబడతాయి

ఏ గుట్టను కదిలించినా
తుపాకి గుళ్ల శబ్దాలను చెబుతాయి
ఏ వాగును కదిలించినా దోసిళ్ళతో
దూపను తీర్చిన చెలిమెలను చూపిస్తాయి
ఏ చెట్టును పట్టుకున్నా కొమ్మన వేలాడిన
సద్దులు సందేశాలు యాదికి తెస్తాయి
ఏ దారి ఎటుపోతుందో తెలియదు
ఏ డొంక ఎటు కదులుతుందో
కార్యాచరణలో నిబద్ధత పల్లెల నిండా
గడీల కూలదోసే దాకా సాగిన నడక
చేతికి దొరికిందే ఆయుధంగా మలచుకున్న
సృజనాత్మకత

రేపటి తరానికి విముక్తిని ప్రసాదించాలనే
ఆకాంక్షతో సాగిన సాయుధ పోరాట
హైజాక్ మీ తరం కాదు రా!!
కులం లేదుమతం లేదు
నిరంకుశ పాలనకి చరమగీతం పాడాలనే
లక్ష్యంగా సాయుధ పోరాటం!
మతం పేరిట వక్రీకరణ చేయ జూస్తే
బందగీ షోయబుల్లా ఉదయిస్తార్రా!
ఒక్క అడుగు పెట్టని మీకు ఈ నేలన
అడుగు పెట్టే అర్హత ఎక్కడిది?!

**గిరి ప్రసాద్, 9493388201**

# గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల్లో రాణించాలి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. అనంతరం క్రీడకారులకు సహాయంగా దాత అంజన్ గౌడ్ రూ. 1,50,000 విలువైన క్రీడ సామాగ్రిని ఎమ్మెల్యేతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతలో క్రీడలో ప్రతిభను గుర్తించేందుకు ఈ క్రీడలు దోహదపడతాయన్నారు. యువతకు క్రీడా ప్రాగాణం ఆధునీకరించి ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొంకళ్ల చెన్నయ్య, నాయకులు తిరుపతి రెడ్డి, ముక్తార్, నరేష్, మురళీ మోహన్, గోపాల్ నాయక్, రవి తేజ, శివకుమార్, మధుసుదన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కాలనీలకు మౌలిక వసతులు కల్పిస్తా

హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ సుజాత నాయక్



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** హస్తినాపురం డివిజన్‌లోని ప్రతి కాలనీలకు మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తామని హస్తినాపురం డివిజన కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బానోతు సుజాత నాయక్ అన్నారు. ఆదివారం డివిజన్‌లోని వందనపురి కాలనీలో ఇంజనీరింగ్, శానిటేషన్, జిహెచ్‌ఎంసి విద్యుత్ అధికారులతో కలిసి కాలనీల్లో పర్యటించారు. కార్యక్రమంలో గొపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కర్నాటి చండీశ్వర్, గుర్రం చంద్రశేఖర్, నరసింహ, సతీష్ గౌడ్, పంత్యా నాయక్, చల్లా వేణుగోపాల్‌రెడ్డి, యాదగిరి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

# అన్నిరంగాలలో గ్రామాభివృద్ధి లక్ష్యం

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



**ప్రజాపక్షం/శంషాబాద్ :** అన్నిరంగాలలో గ్రామాలు అభివృద్ధి సాధించేందుకు సహకారం అందిస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తెలిపారు. శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్ద గోల్కొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన హెచ్‌పి పెట్రోల్‌బంకును ఆదివారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రారంభించారు. నార్సింగ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనెగౌని శ్రీకాంత్ ఆధ్వర్యంలో సైదాబాద్ నివాసి కుమారచారి పెట్రోల్ బంకును సీనియర్ నాయకుడు చంద్రరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్ద గోల్కొండ గ్రామ సమస్యను పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందుంటాను" అని తెలిపారు. కార్యక్రమంలో దూడల వెంకటేష్, గణేష్ గుప్తా, మహేందర్ రెడ్డి, నీరటి రాజు ముదిరాజ్, కౌన్సిలర్ శ్రీనివాస్, చిన్న గోల్కొండ ప్యాక్స్ చైర్మన్ బొమ్మదవనాకర్, చిలకమర్రి మహేందర్ ముదిరాజ్, సరికొండ వెంకటేష్, వట్టెల సతీష్ యాదవ్, జగన్, వెంకటేష్, రవి, గుడాల కృష్ణయ్య, కోటేశ్వర్, రేణుక ఎల్లమ్మ దేవాలయం చైర్మన్ రామ్‌నాథ్ ముదిరాజు, విట్టల్ నాథ్, సంతోష్ గౌడ్ పాల్గొన్నారు.

# సిఎం రిలీఫ్‌ఫండ్‌తో పేదలకు మేలు

టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** సిఎం రిలీఫ్ ఫండ్‌తో పేద ప్రజలకు మేలు కలుగుతుందని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బి నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఆదివారం వనస్థలిపురం, చెందిన పొరంద పావని, ఉడుముల సుధాకర్‌రెడ్డి, సిర్సుల్లా రాకేష్, ఎల్‌బి నగర్‌కు చెందిన చౌకత్ సురేష్, దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన సిరందాసు శ్రీదేవి, కర్మన్‌ఘాట్‌కు చెందిన జి సతీష్, హయత్ నగర్‌కు చెందిన లింగం శ్రీశైలంలకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను వనస్థలిపురం పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు కుట్ల నర్సింహ యాదవ్, శ్రీపాల్‌రెడ్డి, వేణుగోపాల్ యాదవ్, చెన్నగోని రవీందర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, నాయకులు ఎస్సీ సెల్ అధ్యక్షులు బోడ రాజశేఖర్, శ్రీనివాస్, రమేష్, దాసరమేని శ్రీనివాస్, శరత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చల్లా నర్సింహారెడ్డి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** తెలంగాణ రాష్ట్ర టియుఎఫ్‌ఐడిసి చైర్మన్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి జన్మదినం సందర్భంగా పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో దేవాలయ కమిటీ చైర్మన్ ఇదులకంటి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో చల్లా నర్సింహారెడ్డి స్వామి వారి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం చంద్రాగార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పుట్టిన రోజు కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, మండల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని గజమాలలతో సత్కరించి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి, పలు శాఖ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, చిలుక మదుసూదన్‌రెడ్డి, ముంగి జైపాల్‌రెడ్డి, నాయకుడు సత్యనారాయణ, జక్కిడి శివచరణ్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్, తీగల అనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్రస్టీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కార్మికుడు మృతి

**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** ఇండ్రస్టీస్ ఇండియా ప్రైవేట్ లిమిటేడ్ కంపెనీలో కార్మికుడు మృతిచెందారు. బిహార్ రాష్ట్రానికి చెందిన దిపక్ కుమార్ (33) నిన్న రాత్రి కంపెనీలో తయారైన 10ఎంఎం ఇనుప రాడ్లను లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు మీద పడి తలకు గాయం కావడంతో నగరంలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందిన్నట్లు తోటి కార్మికులు తెలిపారు. ఈ విషయమై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొత్తూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రాజకీయంగా ఎరుకల జాతిని గుర్తించాలి : టిఎవైఎస్ విజ్ఞప్తి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్రంలో ఆరు లక్షల జనాభాపైగా ఉన్న ఎరుకల సామాజికవర్గాన్ని గుర్తించి, ఎంఎల్‌ఎ, ఎంపి, స్థానిక సంస్థల్లో అభ్యర్థులుగా ఎంపిక చేసి పోటీలో దింపేందుకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం (టిఎవైఎస్) రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు, ప్రధానకార్యదర్శి కూతాడి రవికుమార్, ముఖ్య సలహాదారులు శ్రీరామ్ సదానందం కోరారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎరుకల అభివృద్ధికి ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్‌టిల 10శాతం రిజర్వేషన్లను పూర్తిస్థాయిలో అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు ఎస్‌టిల్లోని లంబాడ, కోయ, గోండు తెగలు మాత్రమే రాజకీయ పదవులు పొందుతున్నారని, ఎరుకలను పట్టించుకోవడం లేదని తెలిపారు. సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కోనేటి నర్సింహ, కోశాధికారి వనం రమేష్, ఉపాధ్యక్షులు కెంసారం నాగులు తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసిలో అర్బన్ మలేరియా..

# కార్మికుల శ్రమ దోపిడీని అరికట్టాల్సిందే

ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్య-దర్శి ఎం.నరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసిలో అర్బన్ మలేరియా విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు, కార్మిక చట్టాల అమలుకు నోచుకోవడం లేదని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి, జిహెచ్‌ఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం. నరసింహ ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల శ్రమతో జిహెచ్‌ఎంసికి ఆదాయం వస్తున్నా, వారికి మాత్రం సరైన ప్రతిఫలం లభించడం లేదన్నారు. గత ఐదేళ్లుగా వారి జీతాలు పెరగలేదని, కరువు భత్యం (డిఎ) వంటి అలవెన్సులు కూడా అందడం లేదన్నారు. చందానగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల క్రితం కేవలం అరకొరగా జీతాలు పెంచిన తరువాత ఇప్పటివరకు ఎలాంటి అలవెన్సులు, కరువు భృతి ఇవ్వకపోవడంతో కార్మికులు కష్టాల్లో జీవనం సాగిస్తున్నారని నరసింహ ఆవేదన వ్యక్తం చేశారు. జిహెచ్‌ఎంసి వంటి ప్రభుత్వ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు చట్టపరంగా లభించాల్సిన ఏటా 23 సెలవులు, పండుగ బోనస్ (ఒక నెల జీతం అదనంగా) ఇవ్వాలని చట్టం చెప్పినా, అధికారులు అమలు చేయడంలేదని నరసింహ తెలిపారు. జిహెచ్‌ఎంసిలో కాంట్రాక్ట్ కార్మికులు కనీస వేతనాలు, కార్మిక చట్టాల అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. అర్బన్ మలేరియా విభాగం కార్మికులు అంటురోగాలు రాకుండా మందులు పిచికారీ చేస్తూ, దోమల బెడద నుంచి నగర ప్రజలను కాపాడుతున్నారన్నారు. ప్రమాదకరమైన పరిస్థితుల్లో తమ కుటుంబాల పోషణ కోసం విధులు నిర్వహిస్తూ తమ ఆరోగ్యాలను పణంగా పెడుతున్నారని నరసింహ ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి కార్మికులకు కనీస వేతనాలు కూడా ఇవ్వకుండా, కార్మిక చట్టాలను అమలు చేయకుండా అధికారులు వారి శ్రమను దోచుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం మందులు పిచికారీ, ఫాగింగ్ చేస్తూ తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టుకుంటున్న మలేరియా కార్మికులకు కనీస వేతనాలు తక్షణం ఇవ్వాలని నరసింహ డిమాండ్ చేశారు. పాత పద్ధతుల్లో పనిచేయిస్తూ, అవసరమైన కొత్త యంత్రాలు, సామగ్రి కూడా ఇవ్వకుండా కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సామగ్రి సక్రమంగా అందించకపోవడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని నరసింహ తెలిపారు. జిహెచ్‌ఎంసి మలేరియా విభాగం కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అధికారులను ఆయన హెచ్చరించారు. సమావేశంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి. వెంకటయ్య, జిహెచ్‌ఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, ఉపాధ్యక్షులు ఎల్. రవి కుమార్, ఉప ప్రధాన కార్యదర్శులు నాగార్జున రెడ్డి, బాలా గౌడ్, ఇజాజ్, జి. మహేష్, యు. శివ కుమార్, రవీందర్, బాలు, ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి కొమ్ము పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## భూపతి సురేష్ మరణం

# పార్టీకి తీరణి లోటు

సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి అజీజ్‌పాషా

**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** సిపిఐ సీనియర్ నాయకులు భూపతి సురేష్ మరణం పార్టీకి తీరణి లోటని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎం.పి సయ్యద్ అజీజ్‌పాషా అన్నారు. అదివారం నాగోల్ జైపూరికాలనీ ఫేస్1,2 కాలనీ శాఖల ఆధ్వర్యంలో కమ్యూనిటీహాల్‌లో సురేష్ సంతాప సభ నిర్వహించారు. సీనియర్ నాయకులు బొడ్డుపల్లి కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అజీజ్‌పాషా ముఖ్యఅతిధిగా హాజరై సురేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సురేష్ 32 సంవత్సరాలుగా పార్టీలోఉంటూ అంచెలంచెలుగా ఎదిగి గొప్ప స్థానాన్ని దక్కించుకున్నారని గుర్తుచేశారు. కాలనీలో పట్టాల పంపిణీ నుండి శాశ్వత ఇండ్ల నిర్మాణం పథకం వరకు పార్టీ తరుపున అనేక పోరాటాలు చేసిన గొప్ప నాయకుడు అని కొనియాడారు. సురేష్ ఆశయాలను కొనసాగించేందుకు స్థానిక యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎ.రవీంద్రాచారి, ఎల్‌బినగర్ కార్యదర్శి ఎస్.శేఖర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా కార్యదర్శి రామనారాయణ, ఉప్పల్ మండల సహాయ కార్యదర్శి ఎం.డి బషీర్, నాగోల్ మాజీ సర్పంచ్ గొల్కొండ మైసయ్య, బిఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, శ్యామల యాదగిరి, సూరారం రాములు, ఎస్సార్ గంగాధర్, శంకర్, సంపత్, చుక్కయ్య, రాజుమల్లయ్య, కృష్ణ, అశోక్‌గౌడ్, శ్యామల, అమృతమ్మ, బాలమ్మ, ఎల్లయ్య, అఖిల్, అమరేశ్వర్ పాల్గొన్నారు.



# విద్యాపరంగానే కాదు రాజకీయరంగాల్లో రాణించాలి




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** యాదవ సామాజికవర్గం విద్యాపరంగానే కాదు రాజకీయరంగాల్లో కూడా రాణించాలని అఖిల భారత యాదవ మహాసభ జాతీయ అధ్యక్షులు మేకల రాములు అన్నారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో యాదవ్స్ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు అల్లాడి శరత్ యాదవ్ ఆధ్వర్యంలో యాదవ ఉపాధ్యాయ పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన సుమారు 100 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు, లెక్చరర్లకు అవార్డులిచ్చి, శాలువా, మెమెంటోతో సత్కరించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాములు మాట్లాడుతూ ప్రతి ఏటా ప్రతిభావంతులను యాదవ టీచర్లను గుర్తించి పురస్కారాలివ్వడం అభినందనీయమన్నారు. యాదవ సమాజం అభివృద్ధిలో దూసుకెళ్లాలంటే ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రోత్సహించడం అవసరమన్నారు. కార్యక్రమంలో బిసి ఉద్యోగ సంఘం నేత ఎంబి కృష్ణ యాదవ్, విద్య ఫౌండర్ లలిత యాదవ్, సంఘం వ్యవస్థాపకులు అరుణ్ యాదవ్, మహేశ్ యాదవ్ పాల్గొన్నారు.

# 26 నుంచి మిని హ్యాండ్‌బాల్ జాతీయ పోటీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నిజాం కాలేజీ గ్రౌండ్‌లో 17వ హెచ్‌ఎఫ్‌ఐ మిని హ్యాండ్‌బాల్ నేషనల్ చాంపియన్‌షిప్ బాయ్స్– గర్ల్స్ –2025 పోటీలు ఈనెల 26 నుంచి 29వరకు నిర్వహించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మల్‌రెడ్డి రాంరెడ్డి, ప్రధానకార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ బేగంపేటలోని టూరిజంప్లాజాలో చాంపియన్‌షిప్‌కు సంబంధించిన బ్రోచర్‌ను అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైజింగ్ ఇండియా అంటూ సిఎం రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు అంతర్జాతీయ స్థాయిలో నిలపాలని ఈపోటీలను హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దేశంలోని 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి మొత్తం 72 బాల, బాలికల హ్యాండ్‌బాల్ టీమ్‌లు పోటీ ల్లో పాల్గొంటాయన్నారు. సమావేశంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కనపర్తి రమేశ్, రంగారెడ్డి అధ్యక్షులు వెంకటరాంరెడ్డి, కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, వరంగల్ అధ్యక్షులు సాంబయ్య, రెఫిరి బోర్డు కన్వీనర్ ఇంద్రసేనా రెడ్డి పాల్గొన్నారు.



# ప్రజల దేశభక్తిని మోదీ తాకట్టు పెట్టారు : సుధాకర్




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ఇండియా, పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌కు ప్రధాని మోదీ అంగీకరించి, ప్రజల దేశభక్తిని తాకట్టు పెట్టారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర కన్వీనర్ డా.దిడ్డి సుధాకర్ విమర్శించారు. పాకిస్తాన్‌తో భారత్ క్రికెట్ మ్యాచ్‌ను దుబాయ్‌లో నిర్వహించడాన్ని నిరసిస్తూ ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ చౌరస్తా వద్ద ఆప్ నేతలు, కార్యకర్తలు పాకిస్తాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ పాక్‌కు సింధు జలాలను నిలిపివేసి, ఇప్పుడు క్రికెట్ పోటీలకు అనుమతివ్వడం ఏంటని నిలదీశారు. కేవలం కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొడుకు జైషా కోసమే ఈ మ్యాచ్‌ను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. పహల్గామ్ దాడి ఉగ్రవాదులను పట్టుకోవడంలో కేంద్రం విఫలమైందని విమర్శించారు. ఇకనైనా దైవభక్తి, దేశభక్తి పేరిట మోదీ రాజకీయాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. ఆప్ నేతలు బుర్ర రాములు గౌడ్, విజయ ముల్లంగి, మహమ్మద్ మాజీద్, హేమ జిల్లోజు, సుధారాణి, రమ్యగౌడ్, సనూజ్ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

# అధికారికంగా తెలంగాణ సాయుధ పోరాటం దినోత్సవం

సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి అజీజ్‌పాషా డిమాండ్




**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దినోత్సవం పేరుతో సెప్టెంబర్ 17న ప్రభు త్వం అధికారికంగా ఉత్సవాలను నిర్వహించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా డిమాండ్ చేశారు. సరూర్‌నగర్ మండలి సమితి ఆధ్వర్యంలో భగత్‌సింగ్‌నగర్‌లో జరిగిన సమావేశం సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నర్సింహ అధ్యక్షతన జరిగింది. ముందుగా సిపిఐ సీనియర్ నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ స మావేశానికి ముఖ్యఅతిధిగా అజీజ్‌పాషా హాజరై మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరితో పాటు తెలంగాణ ప్రాంత విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మట్టి మనుషులంతా ఏకమైన దొరలు, భూస్వాములు, జామీందార్ల గడీలను బద్దలు కొట్టి వారిని తరిమికొట్టిన మహోత్తర ఉద్యమం తెలంగాణ రైతాంగ సాయుత పోరాటమన్నారు. కార్యక్రమంలో ఇన్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.గోపాల్, ఎస్‌టియూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్ణాకర్‌రెడ్డి, సిపిఐ రంగారెడ్డి జిల్లా సమితి సభ్యులు జిల్లాల కృష్ణ, మహబూబ్, కమలమ్మ, రమావత్ సక్రునాయక్, నాయకులు వర్రె ఇస్తారి, ఇదిబాయ్, నూర్జహాన్, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

**తుర్కయంజాల్ :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు అబ్దుల్లాపూర్ మెట్టు మండలంలో ఆదివారం తుర్కయాంజల్ కూడలిలో రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కొంతం మాధవరెడ్డి, రైతు సంఘం ఉపాధ్యక్షులు చల్ల నారాయణరెడ్డి, సిపిఐ తురక యంజాలు కార్యదర్శి నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర నాయకులు ముత్యాల యాదిరెడ్డి హాజరై పార్టీ జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి చేసి పది లక్షల ఎకరాల భూములు పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదే అన్నారు. బ్రాహ్మణపల్లిలో సిపిఐ కార్యదర్శి ఎస్.జగన్ మోహన్‌రెడ్డి జెండా ఎగురవేశారు. కోహెడలో సురవరం సుధాకర్‌రెడ్డి కాలనీలో సిపిఐ జెండాను కార్యదర్శి రేఖ అండాలు ఎగరవేశారు కార్యక్రమంలో సిపిఐ మెట్టు మండల కార్యదర్శి అజ్మీర్ హరి సింగ్ నాయక్, నాయకులు బి.ఎల్లేషా, ఎస్‌కె.ముజీబ్, నిరంజన్, అంజమ్మ, పద్మ, నరసింహ, ఫాతిమా, సత్తమ్మ, నిర్మల, లక్ష్మమ్మ, అంజమ్మ పాల్గొన్నారు.

## అమరుల ఆశయాలు కొనసాగిద్దాం

**అబ్దులాపూర్‌మెట్ :** తెలంగాణ విముక్తి కోసం సాయుధ పోరాటం చేసి ప్రాణాలు అర్పించిన అమరుల ఆశయలను కొనసాగిద్దామని సిపిఐ రాష్ట్ర నాయకులు అందోజు రవీంద్రచారి పిలుపునిచ్చారు. సాయుధ పోరాట వారోత్సవల పురస్కరించుకోని సిపిఐ అబ్దులాపూర్‌మెట్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించినా కార్యక్రమనికి ఆయన హాజరై మాట్లాడుతూ అనాటి పోరాట ఫలితంగా తెలంగాణ ప్రజలకు విముక్తి జరిగిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ముత్యాయల యదిరెడ్డి,పబ్బతి లక్ష్మణ్,సపిఐ మండల కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్ నాయక్,శేఖర్,నారాయణ,ప్రసాద్,వేణుగోపాల్ చారి తదితరులు పాల్గొన్నారు.

## రావి నారాయణరెడ్డి విగ్రహాన్ని పార్లమెంటులో పెట్టాలి

**గండిపేట:** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి విగ్రహాన్ని పార్లమెంట్‌లో పెట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలలో భాగంగా ఆదివారం సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యాలయంలో ఎఆర్ దేవరాజు భవన్‌లో రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాలమాకుల జంగయ్య, సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పేద బడుగు బలహీన వర్గాలు సమిష్టిగా నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఫ్యూడల్ ప్రభువుల అణిచివేతకు, దోపిడీలపై జరిపిన పోరాటం అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంఎ రియాజ్,జిల్లా కౌన్సిల్ సభ్యులు జే ఆనంద్ గౌడ్,కన్యగారి లక్ష్మి,సిపిఐ మండల సహాయ కార్యదర్శి జె విజయానంద్ గౌడ్,దేవరాజ్ భవన్ కార్యదర్శి జి సత్యం ,సిపిఐ రాజేంద్రనగర్ మండల శాఖ కార్యదర్శులు పాండు,కాజా,సదానంద్,మౌనిక,మొగులయ్య జ్యోతి సాబేరు,సలీం,బండి నరసింహ,ప్రజా సంఘం నాయకులు పాల్గొన్నారు.








## ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం : బండి రమేష్

**కూకట్‌పల్లి / ప్రజాపక్షం :** ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని టిపిసిసి ఉపాధ్యక్షుడు జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జీ, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని బాలానగర్ డివిజన్ దిల్‌కుష్‌నగర్‌లో స్థానిక నాయకులతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు మౌలిక వసుతల కల్పన గురించి స్థానికులతో మాట్లాడారు. వీటితోపాటు స్థానికంగా రాత్రిపూట కొంతమంది పోకిరివాళ్లతో శాంతిభద్రతల సమస్యల పట్ల స్థానికులు రమేష్ దృషికి తీసుకురాగా, ఆయన వెంటనే స్పందించి పోలీసు అధికారులు, జీహెచ్‌ఎంసి అధికారులతో మాట్లాడి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో జింక మాంసం కలకలం.. ముఠా గుట్టురట్టు చేసిన పోలీసులు

**హైదరాబాద్:** నగరంలో జింక మాంసం కలకలం రేపింది. టోలిచౌకిలో జింక మాంసం అక్రమ రవాణాను అధికారులు బట్టబయలు చేశారు. పక్కా సమాచారం మేరకు మావిన్ క్లాసిక్ అపార్ట్‌మెంట్ వద్ద అధికారులు అర్ధరాత్రి సోదాలు నిర్వహించారు. సోదాల్లో 10 కిలోల జింక మాంసం, 3 జింక కొమ్ములు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటితో పాటు బొలెరో వాహనం ఎపి09బిటి4716 సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. జింక మాం సం రవాణా చేస్తున్న మహమ్మద్ సలీం, మహమ్మద్ ఇక్బాల్ అనే ఇద్దరి నిందితులను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మాంసం, బొలెరో వాహనాన్ని అటవీ శాఖ అధికారులకి అప్పగించినట్లు పేర్కొన్నారు. నిందితులపై వన్యప్రాణి రక్షణ చట్టం 1972 ప్రకారం కేసు నమోదు చేసినట్లు వివరించారు. నిందితులకు జరిమానా తోపాటు జైలు శిక్ష కూడా తప్పదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ వన్య ప్రాణి రక్షణకు సహకరించాలని సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ విజ్ఞప్తి చేశారు.

## బాలాజీ ఉన్నత పాఠశాలలో చోరీ

పోలీసులకు ఫిర్యాదు చేసిన పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్



**ప్రజాపక్షం / కొడంగల్ :** కొడంగల్ పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఇండ్లను తొలగిస్తున్న క్రమంలో ఓ పాఠశాలకు సంబందించిన ఇనుప రాడ్‌లతో పాటు గేట్ సమాన్లను అర్ధరాత్రి కొంత మంది దొంగిలించడం జరిగిందని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారి అనుచరులు మీడియాతో మాట్లాడుతు కొడంగల్ పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఇండ్లను, షెడ్లను, షాపింగ్ కాంప్లెక్స్‌లను తొలగిస్తున్న క్రమంలో శనివారం సాయంత్రం బాలాజీ పాఠశాల తరగతి గదులతో పాటు ప్రహరి గోడను కూల్చివేయడం జరిగింది. అయితే గేటు, సంబందిత రాడ్‌లు, ఇనుప రాడ్‌లు దాదాపు లక్ష రూపాయలకు సంబందించిన సామాగ్రిని దళిత వాడకు చెందిన కొంత మంది దొంగిలించి స్క్రాప్‌కు అమ్మడం జరిగిందన్నారు. దీనిపై పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరగా పోలీసులు విచారణ చేపట్టి తెల్లవారుజమున కొడంగల్ నుంచి హైదరాబాద్ వెళ్లే డిసిఎంను పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## ఇంకెన్నాళ్లు అద్దె భవనంలో రిజిస్టార్ కార్యాలయం

విలేకరుల సమావేశంలో మాజీ ఎంపిపి పల్లె సీతారాములుగౌడ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అద్దె భవనంలో సబ్ రిజిస్టార్ కార్యాలయాన్ని ఎన్ని రోజులు నడిపిస్తారని, ప్రభుత్వంపై అద్దె భారం పడకుండా ఖాళీగా ఉన్న మండల పరిషత్ కార్యాలయంలోని భవనంలోకి సబ్‌రిజిస్టార్ కార్యాలయాన్ని మార్చాలని శామీర్‌పేట మండల మాజీ ఎంపిపి పల్లె సీతారాములు గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శామీర్‌పేటలో 1996 నుంచి అద్దె భవనంలో సబ్ రిజిస్టార్ కార్యాలయం అరకొర వసతులతో నడుస్తోందన్నారు. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నూతనంగా శామీర్‌పేట రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ స్థలంలో కొందరు దాతల సహకారంతో భవనాన్ని సబ్ రిజిస్టార్ కోసం నిర్మాంచారని, ప్రభుత్వ స్థలంలో ప్రైవేట్ వ్యక్తులచే భవనం ఎలా నిర్మాణం చేపడుతారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారుల బాగస్వామ్యం లేకుండా భవనం నిర్మాణం చేపట్టడంతో ఆంతర్యమేమిటని ఎవరి స్వలాభం కొరకు నిర్మాణం చేపట్టారని ఆయన ధ్వజమెత్తారు. శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయానికి సబ్ రిజిస్టార్ కార్యాలయంగా మార్చాలని అక్కడ అన్ని విధాలుగా వసతులు ఉన్నాయని పార్కింగ్, మడిగెలు, వసతి ఉందని చెప్పారు. ప్రభుత్వ ఉన్నతాదికారులు స్పందించి సబ్ రిజిస్టార్‌ను మండల పరిషత్‌కు మార్చాలని ఆయన మీడియాతో కోరారు.

## రేపు ఉమ్మడి శామీర్‌పేట జోనల్ స్థాయి క్రికెట్ సెలెక్షన్స్

శామీర్‌పేట జోనల్ క్రీడా కార్యదర్శి గుర్రం సత్తిరెడ్డి




**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు శామీర్‌పేట జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జోనల్ కార్యదర్శి గుర్రం సత్తిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి శామీర్‌పేట మండలం, బొమ్మరాశిపేటలోని శాంతినికేతన్ విద్యాలయ పాఠశాలలో క్రికెట్ సెలెక్షన్స్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి పాఠశాల నుంచి అండర్ 14 విభాగంలో 5 మంది, అం డర్ 17 విభాగంలో 5 మంది విద్యార్థుల చొప్పున అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. అండర్ 14 విభాగంలో పాల్గొనే విద్యార్థులు 01.01.2012 తర్వాత జన్మించిన వారై ఉండాలని, అండర్ 17 విభాగంలోని విద్యార్థులు 01.01.2009 తర్వాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఈ క్రికెట్ సెలెక్షన్స్‌లో పాల్గొనే విద్యార్థులు ఎల్జిబిలిటి సర్టిఫికెట్‌తో పాటు తెల్లటి క్రీడా దుస్తులు, షూస్, క్రికెట్ కిట్లను వెంట తెచ్చుకోవాలన్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు గ్రౌండ్‌లో రిపోర్ట్ చేయాలని మరిన్ని వివరాలకు మదన్‌మోహన్‌రెడ్డి 92461990425, గోపాల్‌చారి 9490148731, నరేష్ 96665911551 నెంబర్లను సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

## ద్యానంతో మానసిక ప్రశాంతత

మల్కాజ్‌గిరి ఎంపి ఈటల సతీమణి జమున

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ధ్యానమనేది ఒక కులానికి, మతానికి, ప్రాంతానికి చెందినది కాదని మనస్సుకు సంబందించిందని, ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున అన్నారు. ఆదివారం తూంకుంట మున్సిపల్‌లోని హార్ట్‌ఫుల్‌నెస్ శ్రీరామచంద్రమిషన్ కోఆర్డినేటర్ అర్చన, ఆశ్రమ మేనెజర్ సత్యేంద్రప్రకాష్ ఆధ్వర్యంలో మూడుచింతలపల్లి మున్సిపల్ కేశవరంలో ఒకరోజు ధ్యానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ ధ్యానోత్సవంలో ఉమ్మడి మండలంలోని మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్, కేశవరం, జగ్గంగూడ, అలియాబాద్, ఆద్రాస్‌పల్లి, లాల్‌గడిమలక్‌పేట, బొమ్మరాశిపేట, తదితర గ్రామాలకు చెందిన సుమారు 300 మంది ఈ ధ్యానంలో పాల్గొన్నారు. అనంతరం ధ్యాన కేంద్రం కోఆర్డినేటర్ అర్చన, ఆశ్రమ మేనెజర్ సత్యేంద్రప్రకాష్ లు మాట్లాడుతూ ఈ ద్యానం పొందడానికి తూంకుంటంలోని శ్రీరామచంద్రమిషన్‌ను సంప్రదించాలని సూచించారు. మూడు రోజులు ద్యానంలో పాల్గొనాలని ఈ ద్యానాన్ని ఉచితంగా నేర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మూడుచింతలపల్లి మున్సిపల్ అధ్యక్షుడు తప్పెట్ల నరేందర్‌గౌడ్, లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ సింగం ఆంజనేయులు, జగ్గంగూడ మాజీ ఉపసర్పంచ్ నరేందర్‌రెడ్డి, స్వీకర్లు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



# నగరీకరణ సమస్యగా కాకుండా.. అవకాశంగా మలుచుకోవాలి

- ‘ఆర్కిటెక్టులు సామాజిక - ఆర్థిక పరిష్కారాలు అన్వేషించాలి’
- వ్యవసాయం నుంచి పరిశ్రమల వైపు మార్పు అవసరం
- ఆర్కిటెక్ట్‌ల సదస్సులో మెట్రోరైల్ ఎం.డి. ఎన్.వి.ఎస్. రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శరవేగంగా పెరుగుతున్న నగరీకరణ ప్రక్రియను ఒక సమస్యగా కాకుండా దానిని దేశ అభివృద్ధికి ఒక అవకాశంగా చూడాలని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెట్ ఎం.డి. ఎన్‌విఎస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన అఖిల భారత ‘ఆర్కిటెక్చర్ రికనెక్ట్ సమ్మిట్’లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ ఆర్కిటెక్చర్ సంస్థలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను ఆయన సందర్శించి, వాటి వినూత్న ఉత్పత్తులు, ఆలోచనలను పరిశీలించారు. అధిక జనాభా, పర్యావరణ సమస్యలు, కాలుష్య నియంత్రణ, వేగంగా పెరుగుతున్న నగరీకరణ వంటి సవాళ్లను ఎదుర్కోడానికి ఆర్కిటెక్ట్‌లు తమ సాంకేతిక పరిజ్ఞానంతో వినూత్న ఆలోచనలు చేయాలని ఎన్‌విఎస్ రెడ్డి సూచించారు. వీటికి సామాజిక, ఆర్థిక కోణంలో సాంకేతిక పరిష్కారాలను అన్వేషించాలన్నారు. నగరీకరణ గణనీయంగా పెరుగుతుంటే రవాణా పరమైన సమస్యలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయన్నారు. అందుకు దీటుగా ఆర్కిటెక్టులు, నిర్మాణ రంగ నిపుణులు తగిన పరిష్కారమార్గాలను శోధించాలన్నారు.





### వ్యవసాయం నుంచి పరిశ్రమల వైపు మార్పు అవసరం

భారత జనాభాలో అధిక భాగం ఇప్పటికీ వ్యవసాయంపై ఆధారపడి ఉందని ఆయన గుర్తుచేశారు. చైనాను ఉదాహరణగా చూపుతూ, వ్యవసాయం నుంచి పరిశ్రమలకు పెద్ద ఎత్తున కార్మిక శక్తిని మళ్లించడం ద్వారా జిడిపి వృద్ధి వేగవంతం అవుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మార్పులో నగరీకరణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

### కొత్త ఆవిష్కరణలతో మెట్రోకు ఆధరణ..

పటిష్టమైన ప్రజా రవాణా వ్యవస్థలు మాత్రమే ట్రాఫిక్ రద్దీకి దీర్ఘకాలిక పరిష్కారమని ఎన్‌విఎస్ రెడ్డి అన్నారు. మహిళల భద్రత, శక్తి సామర్థ్యం, సౌకర్యవంతమైన ప్రయాణం కారణంగా హైదరాబాద్ మెట్రో ప్రజాదరణ పొందిందని వివరించారు.హైదరాబాద్ మెట్రో రైల్ ప్రజా రవాణా వ్యవస్థగా అత్యంత ఆదరణ పొందడానికి అనేక కొత్త ఆవిష్కరణలేకారణమన్నారు.

### ఆధునిక సాంకేతికత - భారతీయ సంప్రదాయాల కలయిక..

ఆర్కిటెక్టులు ఆధునిక సాంకేతికతను భారతీయ సంప్రదాయ డిజైన్ సిద్ధాంతాలతో కలిపి, పర్యావరణహిత విధానాలను వినియోగించాలని సూచించారు. ప్రస్తుతమున్న సాంకేతిక, డిజిటల్ వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకుంటూనే, సంప్రదాయంగా వస్తున్న సహజ సిద్ధమైనభావనా నిర్మాణ సూత్రాలను జోడించి, ప్రజల జీవన విధానాన్ని మరింత సులభతరం చేయడంలోఆర్కిటెక్ట్‌లు తగిన మార్గాలపై దృష్టి సారించాలన్నారు.

### ఆహ్లాదకరమైన ప్రదేశాలు లేకపోవడంతోనే పెరుగుతున్న నేరాల సంఖ్య..

నగరాలలో ఎక్కువగా ఉన్న పేదరికం, సరైన గృహ సదుపాయాలు లేకపోవడం, ఆహ్లాదకరమైన బహిరంగ ప్రదేశాలు లేకపోవడం వల్ల నేరాల సంఖ్య పెరుగుతోందని ఎన్‌విఎస్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. అందువల్ల గృహ నిర్మాణ రంగం అందరికీ అందుబాటులో ఉండాలని సూచించారు. ఆహ్లాదకరమైన వాతావరణంతో కూడిన పార్కులు, బహిరంగ ప్రదేశాలను అభివృద్ధి చేయాల్సిన అవసరముందన్నారు. ఇందుకు ఉదాహరణగా కొలంబియాలో ఉన్న బొగొటా నగరం గురించి ప్రస్తావిస్తూ, అద్భుతంగా సాధించిన ఆ నగరం అభివృద్ధి గాథను స్ఫూర్తివంతంగా తీసుకోవాలని ఆయన సూచించారు.

### నీటి సంరక్షణపై దృష్టి సారించాలి..

పట్టణాలు వేసవిలో నీటి ఎద్దడి, వర్షాకాలంలో వరద నీటి ముంపు వంటి తీవ్ర పరిస్థితులు ఎదుర్కొంటున్నాయని ఎన్‌విఎస్ రెడ్డి చెప్పారు. వీటికిఆర్కిటెక్ట్‌లు తగిన పరిష్కార మార్గాలు అన్వేషించాలన్నారు. సింగపూర్ వర్షపు నీరు సేకరణ విధానాన్ని ప్రస్తావిస్తూ, భూగర్భ జలాల స్థాయిని పెంచేలా వర్షపు నీటి నిల్వ వ్యవస్థలు ప్రతి పట్టణ ప్రాజెక్టులో తప్పనిసరిగా అంతర్భాగం చేయాలని ఆయన సూచించారు.

### ట్రాన్సిట్ - ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యం..

నగరాలలోమెట్రో మార్గాల వెంట బహుళ అంతస్తుల నివాస గృహాలను, వాణిజ్య సముదాయాలను, విద్యా సంస్థలు ఏర్పడితే వాహనాలపై ఆధారపడకుండా ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కార్బన్ ఉద్గారాలను తగ్గించడంపై దృష్టి పెట్టాలన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ వ్యవస్థలో అటువంటి చర్యలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. తాముచేపట్టిన ఇంధన పొదుపు, పర్యావరణ హిత చర్యల వల్ల హైదరాబాద్ మెట్రో అనేక అంతర్జాతీయ, జాతీయ పురస్కారాలను గెలుచుకుందన్నారు.

## రోడ్లు గోతుల మాయం.... ప్రయాణం నరక ప్రాయం

**ప్రభుత్వాలు మారినా మారని సరిహద్దు రోడ్లు**

**ప్రజాపక్షం/తాండూరు :**వికారాబాద్ జిల్లా ప్రాంతం దాదాపుగా కర్నాటక సరిహద్దు ప్రాంతాలను ఆనుకోని విస్తరించి ఉంది. తాండూరునుండి జహిరాబాద్, వెళ్ళాలన్న కర్నాట సరిహద్దు ప్రాంతాన్ని దాటాల్సిందే. తాండూరు చించోల్లి మార్గాలను సరిహద్దు ప్రాంతాలు ఉన్నాయి. అటు తాండూరు బషీరాబాద్ మండల ప్రాంతానికి ఆనుకోని కర్నాటక సరిహద్దు ప్రాంతం విస్తరించి ఉంది. సరిహద్దు ప్రాంతాల రోడ్లు పూర్తిగా ధ్వంసమై పోయి పాలకులను వెక్కిరిస్తున్నాయి. రాష్ట్ర సరిహద్దు రోడ్లు అద్వాన్నంగా మారినాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా, స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఇలాకలో రాష్ట్ర సరిహద్దు రోడ్లు పూర్తిగా గోతుల మాయంగా మారి ప్రయాణం నరకప్రాయంగా మారింది. ప్రభుత్వాలు మారిన తాండూరు– జహిరాబాద్ రోడ్డు తీరు మారడం లేదు. తాండూరు నుండి పోరుగున ఉన్న సరిహోద్దు గ్రామాలకు వెళ్ళాలన్న ప్రయాణమే ఓ గండంగా మారింది. ఇటివల ప్రభుత్వం అంతరాష్ట్ర బస్సు సర్వీసులను ప్రారంభించారు. బస్సు సర్వీసులను ప్రారంభించడం వరకు బాగనే ఉందని కాని గోతుల మాయంగా మారిన రోడ్లపై ఎందుకు శ్రద్ధ తీసుకోవడం లేదని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా తాండూరుజహిరాబాద్ రోడ్డు మార్గంలోని కర్నాటక సరిహద్దు గ్రామమైన కుంచారం మద్యలో రోడ్డు పూర్తిగా ధ్వంసమై పోయింది. ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు సైతం నడపలేని దుస్థితి నెలకొంది. ఈ రోడ్డుపై మోకాళ్ళ లోతు గోతులు ఏర్పాడి ప్రమాదకంగా మారినాయి. గత పదేళ్ళ నుండి కూడా ఈ రోడ్డును పట్టించుకోక పోవడం గమనార్హం . ఎన్ని ప్రభుత్వాలు మారిన ఈ రోడ్డు తీరు మారదని ప్రయాణికులు శాపణార్థాలు పెడుతున్నారు.


ఈ రోడ్డుపై అనునిత్యం ఎర్రమట్టి లారీలు అధిక లోడ్ వాహనాలు సరిహద్దు దాటి పోతుండడంతో రోడ్డు పూర్తిగా ద్వసమై పోతున్నాయి. అం తరాష్ట్ర సర్వీలు నిరంతరం నడపాలంటే ఈ రోడ్ల ను వెంటనే నిర్మించాల్సిన అవసరం ఎంతైన ఉం ది. తాండూరుజహిరాబాద్ మార్గంలోని ఇందూ రు వద్ద రోడ్డు పూర్తిగా ద్వసమై పోయింది. ఈ రోడ్డును బాగు చేయాలని పలుమార్లు స్థానిక ఎంఎల్‌ఏ మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుక పోయిన స్పందన కన్పించడం లేదని స్థానిక ప్రజలు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన పాలకులు, అధికారులు స్పందించి రోడ్లను మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

## రూ. 4 లక్షల గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దూల్‌పేట్‌లో గంజాయి కేంద్రాలపై ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ అధికారులు ఆదివారం దాడి చేసి రూ.4 లక్షల విలువైన 8.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌టిఎఫ్ లీడర్ అంజిరెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దూల్పేట్ లోని దిల్వార్ గంజ్ ప్రాంతంలో రాజ్ అలియాస్ కబూతర్ వాలా రాజాసింగ్, తుల్జారాం సింగ్ ఇద్దరు వ్యక్తులు గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లలో నింపి సరఫరా చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ పోలీసులు వారింటిపై దాడి చేసి గంజాయితో పాటు నిందితులిద్దరిని అదుపులోకి తీసుకుని దూల్‌పేట్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. నిందితులిద్దరు ఒరిస్సాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.

## ‘మేడ్చల్’లో కుండపోత వర్షం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జిల్లా వ్యాప్తంగా మేడ్చల్ మల్కాజిగిరిలోని అన్ని ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం నుండి కుండపోత వర్షం కురుస్తోంది. దీంతో రహదారులు జలమయ్యాయి. ప్రధాన రహదార్లన్నీ ఎక్కడ చూసినా మోకాళ్ల లోతు వరకు నీరు చేరటంతో ట్రాఫిక్ నిలిచి పోవటంతో వాహనదార్లు నానా ఇబ్బందులకు గురవుతున్నారు.

బస్తీలతో పాటు చిన్న చిన్న రోడ్లు సైతం ఇదే పరిస్థితి. పలు చోట్ల లోతట్టు ప్రాంతాలన్నీ వరద నీటితో చెరువుల్లా తలపిస్తున్నాయి. తార్నాక, మౌలాలి, ఉప్పల్, రామంతాపూర్, కూకట్‌పల్లి, గాజులరామారం, రాంపల్లి, దమ్మాయిగూడ, ఏఎస్ రావునగర్, కీసర, శామీర్‌పేట, మేడ్చల్, కొంపల్లి, బాచుపల్లిలాంటి పలు ప్రాంతాలన్నీ ఇదే పరిస్థితి నెలకొంది. గత నెల రో జుల నుండి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలు చోట్ల ఏర్పడ్డ గుంతలను అధికారులు మరమ్మత్తులు చేపట్టక పోవటంతో ప్రమాదభరితంగా తయారయ్యాయి. జిల్లాలోని ఘట్‌కేసర్ మండలంలో 33.4 మిల్లీ మీటర్లుగా అధిక వర్షం పడిం ది. మండలాల వారీగా కుత్బుల్లాపూర్‌లో 21.5, మేడ్చల్‌లో 21.1, కీసరలో 20, శామీర్‌పేటలో 19.8, ఆల్వాల్‌లో 13.6, దుండిగల్‌లో 13.4, మల్కాజిగిరిలో 11.8, కూకట్‌పల్లిలో 11, బాలానగర్‌లో 11.3, కాప్రాలో 10.2, బాచుపల్లిలో 9.1, మూడుచింతలపల్లిలో 7.7, ఉప్పల్‌లో 5.3, మేడిపల్లిలో 3.4 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది.

## తీరని యూరియా కష్టాలు

రాత్రి గుట్టచప్పుడు కాకుండా బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని రైతులు ఆగ్రహం



**ప్రజాపక్షం/వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా రెండు నెలల నుండి అన్నదాతలకు యూరియా కష్టాలు తీర డం లేదు ఆదివారం తెల్లవారుజామున వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అగ్రోస్ రైతు సేవ కేంద్రంలో యూరియ ఉన్న విషయం తెలియడంతో ఉదయం 4గంటల నుండి అగ్రోస్ సెంటర్ వద్ద బారులు తీరారు. రెండు సంచుల కోసం సాయ త్రం 4గంటల వరకు లైన్‌లో నిలబడిన వారికి మత్రమే దొరికింది. చాలా మంది రైతులకు దొరుకాలేదు, ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఓట్ల కోసం ఇంటింటికి తిరుగుతారు కాని యూరియా దొరకడం లేదని అడిగితే పట్టించుకోవడం లేదని అవేదన వ్యక్తం చేశారు. సకాలంలో ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలం అయిందన్నారు. ఇప్పుడు పంట కు యూరియా వేయకపోతే భారీ నష్టం జరుగుతుంది కావు న రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని కోరా రు. కొందరు రాత్రి సమయంలో పరిగిల్లో, వికారాబాద్ జిల్లా కేంద్రంలోని యూరియాను బ్లాక్‌లో అమ్మకుంటున్నారని రై తులు తెలిపారు. అధికారులు బ్లాక్‌లో అమ్ముతున్న వారిపై చ ర్యలు తీసుకోవాలని రైతులు కొరుతున్నారు.

## పంచాయతీల్లో నిలిచిన అభివృద్ధి

**● ‘మన ఊరు - మన బడి’ పెండింగ్ బిల్లులు రూ.10.35 కోట్లు ● పాలకవర్గం లేక నిలిచిన కేంద్రం నిధులు**




**ప్రజాపక్షం/వికారాబాద్ :** గ్రామ స్వరాజ్యానికి పట్టు కొమ్మలుగా పిలిచే పంచాయతీ అప్పులు ఊబిలో కూరుకుపోయాయి. రెండున్నర ఏళ్లుగా బిల్లులు అందక గ్రామాలు వెలవెలబోతున్నాయి. సర్పంచులు పదవుల్లో ఉన్న సమయంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు సైతం నేటికీ అందడం లేదు అప్పుల భారతంలో సర్పంచులు పదవీవిరమణ చేయగా ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులు అప్పుల పాలవుతున్నరు. జిల్లా వ్యాప్తంగా 594 పంచాయతీలకు గాను రూ.29కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. రాష్టంలో రూ.750 కోట్ల వరకు జిపిల బిల్లులు పెండింగ్‌లో ఉండగా ఇటీవల ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేసింది. అయితే ఇందులో వికారాబాద్‌కు పైసలు రాలేవు, నాలుగేళ్ల క్రితం ‘ మన ఊరు మనబడి’ కార్యక్రమాన్ని ప్రారంభించింది. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 1130 ప్రభుత్వ పాఠశాలలుండాగా మూడింట ఒకటో వంతు చొప్పున తొలి విడుతలో 371 పాఠశాలల అభివృద్ధి పనులు ప్రారంభించారు. రెండున్నరేళ్ల కొనసాగిన ఈ కార్యక్రమంలో 62 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తి చేశారు. వీటికి సంబందంచిన ప్రభుత్వం నుంచి రూ.12.19కోట్ల నిధులు విడుదల చేయగా ఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకం నుంచి రూ2.5 కోట్లు కలుపుకొని మొత్తం రూ24.4కోట్ల బిల్లులు చెల్లించారు. ఇంకా ఆసమయంలో పూర్తి చేసిన పనులకు సంబంధించి రూ7.35కోట్ల రాష్ట ప్రభుత్వం నిధులు, రూ.3కోట్ల జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లించాల్సిన నిధుల మొత్తం రూ. 10.35 కోట్ల బిల్లులు ఇంకా ఇవ్వాల్సింది ఈ పనులు కూడా ఆ సమయంలో ఉన్న సర్పంచులు, వార్డు సభ్యులే నిర్వహించారు. పనులు పూర్తై మూడేళ్ల దాటిన బిల్లులు మాత్రం రావడం లేదు, బిఆర్‌ఎస్ హయంలో సర్పంచులు గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్లు ,సైడ్‌డ్రెయిన్లు , క్రిమిటోరియం తదితర పనులకు సంబంధించి బిల్లులు కోట్ల రూపాయల్లో పెండింగ్‌లో ఉండిపోయాయి. గ్రామాలకు సర్పంచుల స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించినప్పటికి వారు అప్పుడప్పుడు చుట్టపు చూపుగా వచ్చి వెళ్లడం మినహ సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదు శానిటేషన్ వీధి లైట్లు ,వాటర్‌సప్లై నిర్వహణ , ట్రాక్టర్లకు డీజిల్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం పంచాయతీల్లో కార్యదర్శులు అప్పులు తెచ్చి పనులు చక్కపెడుతున్నామని వీటికి వడ్డీ కట్టలేక సతమతమవుతన్నామని, తమకు ఈ బాధ్యతలు వద్దంటూ ఎంపిడిఒలకు, పంచాయతీల తాళాలు అప్పగించాలరు. ఉన్నతాధికారుల వారిని సముదాయించి మళ్లీ వారికే అప్పగించారు. గతంలో పంచాయతీల్లో చేసిన పనులు నేరుగా జిపిలో అవసరానికి ఖర్చు చేసే అవకాశం ఉండేది. 2018లో బిఆర్‌ఎస్ ప్రభుత్వం పన్నులను ట్రెజరీలో జమచేయాలనే నిబంధన తీసుకుచ్చింది. కాని ప్రభుత్వం ఈ ఖాతాలను ప్రిజింగ్‌లోనే ఉంచుతొంది. ప్రజల చేత ఎన్నుకోబడిన పాలకవర్గం లేక కేంద్ర ప్రభత్వం నుంచి రావాల్సిన నిధులకు సైతం బ్రేక్ పడింది. రాష్ట ప్రభుత్వం కొత్త నిధులు మంజురు చేయక పాత బిల్లులు విడుదల చేయక నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. కేంద్రం నిధులు రాకపోవడంతో పంచాయతీలు నిర్వహణ చాలా ఇబ్బందికరంగా ఉందని తెలుస్తుంది.

## సూరారంలోని వసతి గృహంలో పేరెంట్స్ మీటింగ్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** ప్రభుత్వ షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ కళాశాల వసతి గృహంలో ఆదివారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ కమిషనర్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి వినోద్ కుమార్ ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించినట్లు వార్డెన్ కొండల్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతిలో తల్లిదండ్రుల పాత్ర చాలా గొప్పదని, వారి చదువులపట్ల, విలువల పట్ల ప్రత్యేక శ్రద్ధ కలిగి నడుచుకొనుటలో విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని రకాల వసతులు ప్రభుత్వ సహకారంతో కల్పిస్తున్నామని వాటిని వినియోగించుకొని శ్రద్ధగా చదివి ప్రయోజకులు కావాలని విద్యార్థులకు సూచించారు.



క్రీడ

# పాక్‌పై భారత్ ఘనవిజయం

## ఆసియా కప్‌లో సూర్య, అభిషేక్ విధ్వంసం..



వరల్ కప్‌లోనే కాదు ఆసియా కప్‌లోనూ తమకు తిరుగులేదని చాటుతూ పాకిస్థాన్‌ను చిత్తు చేసింది భారత జట్టు. ఆదివారం చిరకాల ప్రత్యర్థిని మట్టి కరిపించిన టీమిండియా ఈ మెగా టోర్నీలో వరుసగా రెండో విజయం నమోదు చేసింది. దుబాయ్ స్టేడియంలో కుల్దీప్ యాదవ్ విజృంభణలో 127కే పాక్ పరిమితం అవ్వగా.. ఛేదనలో అభిషేక్ శర్మ (31) బౌండరీల మోతతో మెరుపు ఆరంభం ఇచ్చాడు. ఆ తర్వాత సూర్యకుమార్ యాదవ్ (47 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో పాక్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మూడో వికెట్‌కు తిలక్ వర్మ(31)తో కలిసి 56 రన్స్ జోడించిన సూర్య జట్టు విజయానికి బాటలు వేశాడు. ఫినిషర్ శివం దూబే(10 నాటౌట్) తనదైన స్టయిల్లో ఆడగా.. సిక్సర్‌తో భారత్‌కు 7 వికెట్ల విజయాన్ని అందించాడు సూర్య. ఆసియా కప్‌లో బాయ్‌కాట్ నిరసనల మధ్య జరిగిన మ్యాచ్‌లో భారత్ విజయఢంకా మోగించింది. చిరకాల ప్రత్యర్థి పాక్‌ను వణికిస్తూ భారీ విక్టరీతో ఈజీ కాదని మరోసారి చాటింది. తొలుత పాక్‌ను 127కే నిలువరించిన నిర్దేశించిన టీమిండియా స్వల్ప లక్ష్యాన్ని 15.5 ఓవర్లలోనే అందుకుంది. దాయాది నిర్దేశించిన ఛేదనను భారత్ ధాటిగా మొదలెట్టింది. షాహీన్ అఫ్రిది వేసిన తొలి ఓవర్లో మొదటి రెండు బంతులకు అభిషేక్ శర్మ 4, 6 బాదాడు. రెండో ఓవర్లో సయీం అయూబ్‌ను ఉతికేస్తే శుభ్‌మన్ గిల్(10) రెండు ఫోర్లు కొట్టాడు. అయితే.. ఆఖరి బంతికి షాట్ ఆడబోయిన గిల్ స్టంపౌట్ అయ్యాడు. వికెట్ పడినా సరే అభిషేక్ జోరు తగ్గించలేదు. సయీంను లక్ష్యంగా చేసుకొని రెండు బౌండరీలు సాధించిన అతడు అతడి ఓవర్లోనే వెనుదిరిగాడు. అభిషేక్ ఔటయ్యాక వచ్చిన తిలక్ వర్మ(31) సైతం ఫోర్లతో చెలరేగాడు. నవాజ్ వేసిన ఆరో ఓవర్లో రెండు ఫోర్లతో జట్టు స్కోర్ 60 దాటించాడు. దాంతో.. పవర్ ప్లేలో భారత్ రెండు వికెట్ల నష్టానికి 61 స్కోర్ చేసింది. కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్(47 నాటౌట్), తిలక్ . మూడో వికెట్కు విలువైన 56 రన్స్ జోడించి జట్టును విజయ తీరాలకు చేర్చారు.అయితే.. అయుబ్ ఓవర్‌లో తిలక్ బౌల్ కాగా.. అప్పటికి విజయానికి 45 బంతుల్లో 31 రన్స్ కావాలి. అనంతరం శివం దూబే(10 నాటౌట్) అండగా సూర్య చెలరేగిపోయాడు. సయీం వేసిన 15వ ఓవర్లో చివరి బంతిని దూబే స్టాండ్స్‌లోకి పంపాడు. సూఫియన్ బౌలింగ్‌లో ఎల్బీ అప్పీల్ అనంతరం సారథి సూర్య సిక్సర్ బాదగా 7 వికెట్ల తేడాతో పాక్‌ను మట్టికరిపించింది భారత్. ఈ విక్టరీతో సూర్యకుమార్ యాదవ్ బృందం సూపర్ 4కు చేరువైంది.

**ఫర్హాన్, అఫ్రిది రాణించగా.. :** టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న పాకిస్థాన్ భారత బౌలర్ల విజృంభణతో స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. ఇన్నింగ్స్ ఆరంభంలోనే హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా వికెట్ల వేటతో పాక్ను మానసికంగా దెబ్బతీశారు. యూఏఈపై చెలరేగిన కుల్దీప్ యాదవ్(318) మరో సారి తన స్పిన్ మ్యాజిక్‌తో మూడు కీలక వికెట్లు తీసి ప్రత్యర్థిని కోలుకోలేని దెబ్బకొట్టగా.. అక్షర్ పటేల్(218) ఓ చేయి వేశాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ షహిబ్జద ఫర్హాన్(41) ఒంటరి పోరాటం చేశాడు. ఆఖర్లో షాహీన్ అఫ్రిది(33 నాటౌట్) నాలుగు సిక్సర్లతో రెచ్చిపోయాడు. దాంతో పాక్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 127 రన్స్ చేసింది.

## బాక్సింగ్‌లో భారత్‌కు రెండు స్వర్ణాలు!





వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు రెండు స్వర్ణాలు లభించాయి. జైస్మీన్ లాంబోరియా, మీనాక్షి హుడా విజేతగా నిలిచారు. ఆదివారం జరిగిన మహిళల 48 కిలోల విభాగం ఫైనల్లో మీనాక్షి హుడా 4–1 తేడాతో కజకిస్థాన్ ప్లేయర్ నజీమ్ కైజైబేపై విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభం నుంచి వ్యూహాత్మకంగా ఆడిన మీనాక్షి ప్రత్యర్థిపై క్రమం తప్పకుండా పంచ్‌లు విసిరి.. ఆధిపత్యం చెలాయించింది. ఈ బౌట్లో తన ఎత్తును అడ్వాంటేజ్‌గా మార్చుకుంది. బ్యాక్‌ఫుట్‌పై ఉంటూ ప్రత్యర్థిపై దాడి చేసింది. బలమైన డిఫెన్స్‌తో ప్రత్యర్థి పంచ్‌లను కాచుకుని విజయాన్ని సొంతం చేసుకుంది.

అంతకుముందు జరిగిన మహిళల 57 కేజీల విభాగంలో జైస్మీన్ లాంబోరియా 4–1 తేడాతో పోలండ్‌కు చెందిన జూలియాను ఓడించింది. మరో వైపు భారత్‌కు చెందిన నుపుర్ షెరోన్(80+ కేజీలు) సిల్వర్ మెడల్ సాధించగా.. పుజారాణి(80 కేజీలు) బ్రాంజ్ మెడల్ గెలిచింది. పురుషుల విభాగంలో ఈ సారి భారత్‌కు ఒక్క పతకం రాలేదు. 2013 తర్వాత పురుషుల విభాగంలో భారత్ ఒక్క పతకం కూడా సాధించకపోవడం ఇదే తొలిసారి.


**ఫైనల్ చేరిన జైస్మిన్, నుపుర్ :** భారత స్టార్ బాక్సర్, తెలుగు తేజం నిఖత్ జరీన్ పోరాటం మాత్రం క్వార్టర్స్‌లోనే ముగిసింది. భారీ అంచనాలతో బరిలోకి దిగిన ఈ మాజీ ఛాంపియన్ క్వార్టర్ ఫైనల్లో 0–5తో రెండుసార్లు ఒలింపిక్ రజత పతక విజేత బ్యూస్ నాజ్ కకిరోగ్లు (తుర్కియే) చేతిలో చిత్తయింది. దాంతో పతకం లేకుండా నిఖత్ జరీన్ ఇంటిబాట పట్టింది. గత సారి (2023) 50 కిలోలు, అంతకుముందు (2022) 52 కిలోల విభాగాలలో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన నిఖత్ ఈసారి 51 కిలోల బరిలో దిగింది.

ఫోకస్ ఆరోగ్యం

# మనిషికి వెన్నునొప్పి ఎందుకు వస్తుంది?

వెన్నునొప్పి ప్రపంచవ్యాప్తంగా అత్యంత సాధారణ వైద్య సమస్యల్లో ఒకటి. ఇది కేవలం చెడ్డ కూర్చునే తీరు లేదా ఎక్కువసేపు కుర్చీలో గడపడం వల్లే కాదు.... మనిషి పరిణామ క్రమంలో చేసిన చోటు చేసుకున్న ఒక ప్రత్యేకమైన పరివర్తన ఫలితమేనని శాస్త్రవేత్తలు శాస్త్రవేత్తలు అంటున్నారు. మన పూర్వీకులు లక్షల సంవత్సరాల క్రితం జంతువుల్లా నాలుగు కాళ్ల మీద నడిచేవారు.

పరిణామక్రమంలో మనిషి రెండు కాళ్లపై నిటారుగా నడవడం అలవాటు చేసుకున్నాడు. ఈ మార్పు చేతులను స్వేచ్ఛగా ఉపయోగించే అవకాశం ఇచ్చింది. పనిముట్లు తయారు చేయడం, వేట చేయడం, వ్యవసాయం, సాంకేతికత ఇలా నాగరికత మొత్తం ఈ మార్పుపైనే ఆధారపడింది. కానీ ఈ విప్లవాత్మక మార్పు, 'వెన్నుముక మీద అతి ఎక్కువ ఒత్తిడి' అనే సమస్యను కూడా వెంట తెచ్చింది. వెన్నెముక మొదట నిటారుగా నడిచేలా రూపకల్పన కాలేదు. అది మొదట నాలుగు కాళ్లతో నడిచే జీవాలకు అనుకూలంగా ఉండేది. నిటారుగా నడవడం వలన 'S' ఆకారపు వక్రత ఏర్పడింది. ఇది శరీరాన్ని నిలబెట్టటానికి సహాయపడినా, ఒత్తిడి కొన్ని చోట్ల అధికమై వెన్నునొప్పికి దారితీస్తుంది. ఈ పరిణామ మార్పు వల్ల మనిషి మెదడు పెద్దదవడానికి, చేతులు స్వేచ్ఛ కలిగించడానికి అవకాశం దొరికిందికానీ, దాని బదులుగా తరతరాలకు వెన్నునొప్పి భాధ తప్పలేదు. ఈ సమస్యను ఆధునిక జీవన శైలి మరింతగా పెంచుతున్నది. కుర్చీల్లో ఎక్కువసేపు కూర్చోవడం, శారీరక వ్యాయామం లేకపోవడం, తలకు మించిన బరువు మోసుకోవడం, తప్పుడు భంగిమలు ఇవన్నీ ఈ పరిణామంలో ఏర్పడిన బలహీనతను మరింత ముదిరిస్తాయి. ఆధునిక కాలంలో సెడెంటరీ లైఫ్ స్టైల్ (ఆలస్యపూరిత కూర్చునే జీవనశైలి) ఈ సమస్యను ప్రపంచ వ్యాప్తంగా పెంచుతోంది. ఏదిఏమైనా వెన్నునొప్పిని ఒక వైద్య సమస్యగా మాత్రమేగాక, ఒక జీవ సంబంధమైన మార్పు, జీవనశైలితో ముడిపడిన అంశంగా కూడా చూడాలి. వెన్నునొప్పి కథ అంటే కేవలం ఆరోగ్య సమస్య కాదని, మనిషి ఎవరమో చెప్పే పరిణామ గాథలో ఒక భాగం తెలుసుకోవాలి. మానవజాతి నేటి నాగరికతను, సాంకేతికతను పొందిన కారణం రెండు కాళ్లపై నడిచే సామర్థ్యమే. కానీ అదే సామర్థ్యం మనకు శాశ్వత సమస్యలా వెన్నునొప్పి రూపంలో ఎదురవుతోంది. ఇది పరిణామం ఇచ్చిన ఓ బహుమానం. ఓ శిక్ష.



## కిడ్నీవ్యాధికి ఉపయోగపడే మలబద్ధకం మందు!



సాధారణంగా మలబద్ధకానికి ఇచ్చే మందు కిడ్నీ వ్యాధుల చికిత్సకు పనికివస్తుందని అంటున్నారు జపాన్‌లోని టోహోకు యూనివర్సిటీ పరిశోధకులు. వారి ఆవిష్కరణను అనుసరించి, మలబద్ధకానికి ఇచ్చే లుబిప్రోస్టోన్ అనే ఔషధం, దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి పెరగకుండా నిరోధిస్తుంది. ఫేజ్ II క్లినికల్ ట్రయల్లో 150 మంది రోగులపై పరీక్షలు చేశారు. ప్లాసిబో (నకిలీ మందు) వాడినవారితో పోలిస్తే, లుబిప్రోస్టోన్ వాడినవారి కిడ్నీ పనితీరు మెరుగుపడింది. దీర్ఘకాల మూత్రపిండ వ్యాధి చాలా సందర్భాల్లో కిడ్నీ ఫెయిల్యూర్‌కి దారితీస్తుంది, డయాలిసిస్ అవసరం అవుతుంది. నిజానికి, కిడ్నీని నేరుగా రక్షించే అనుమతిపొందిన మందులు ఇప్పటివరకు లేవు. ఈ పరిస్థితుల్లో జపాన్ పరిశోధకుల ఆవిష్కరణ వైద్య శాస్త్రంలో గొప్ప ముందడుగా పేర్కోవాలి. లుబిప్రోస్టోన్ మలబద్ధకం తగ్గించి, ఆంత్రము (గట్) ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీని వలన స్పెర్మిడిన్ అనే సమ్మేళనం ఉత్పత్తి పెరుగుతుంది. ఈ సమ్మేళనం (శక్తి ఉత్పత్తి చేసే కణ భాగాలైన మైటోకాండ్రియాలను బలోపేతం చేస్తుంది. శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తుంది. ఈ ప్రభావాలు కిడ్నీ దెబ్బతినకుండా అడ్డుకుంటాయి. ముఖ్యంగా ఎక్కువ డోస్ తీసుకున్నవారికి, కిడ్నీ రక్షణ ప్రభావం మరింతగా కనిపించింది, మొత్తం మీద మలబద్ధకానికి వాడే ఒక ఔషధం, మనిషిలో కిడ్నీలకు రక్షణ కలిగించగలదని మొట్టమొదటి సారి గుర్తించగలిగారు. ఫేజ్ II క్లినియల్ ట్రయల్స్ సత్ఫలితాలను ఇవ్వడంతో, పరిశోధకులు ఇప్పుడు ఫేజ్ III క్లినియల్ ట్రయల్స్‌కు రంగం సిద్ధం చేస్తున్నారు. వారి ప్రయోగాలు విజయవంతమైతే, కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వారికి ఎంతో ఊరట లభిస్తుంది.

## ఇంజక్షన్ రూపంలో జెల్!

నొప్పి ఉన్న ప్రాంతంలో పైపూతగా వాడే పెయిన్ బామ్ లేదా జెల్ త్వరలోనే ఇంజక్షన్ రూపంలో అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. జర్మనీ వైద్య శాస్త్రవేత్తలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలను అనుసరించి ఇంజక్షన్ రూపంలోని జెల్ నొప్పిని సమర్థవంతంగా నియంత్రిస్తుంది. ప్రత్యేకించి కీళ్ల నొప్పుల నుంచి త్వరగా ఉపశమనమిస్తుంది. ఈ జెల్‌ను జాయింట్‌లోకి ఇంజెక్ట్ చేసినప్పుడు, ఇది 'స్కాఫోల్డ్'గా పిలిచే ఒక సపోర్టివ్ స్ట్రక్చర్‌గా పనిచేస్తుంది. ఇందులో ప్రధానంగా హైయాలురోనిక్ యాసిడ్ కొలాజెన్ లేదా ఆధునిక హైడ్రోజెల్స్ వంటి పదార్థాలు ఉంటాయి. ఈ పదార్థాలు సహజ కార్టిలేజ్ నిర్మాణాన్ని పోలి ఉంటాయి, అందువల్ల శరీరం లోపల కణాలు కొత్త కార్టిలేజ్ ఏర్పరచుకునే విధంగా ప్రోత్సహిస్తాయి. ఇది కీళ్లలో క్యెల్స్ స్థిరపడడానికి, పెరగడానికి సహాయపడుతుంది. అప్పటికే ఉన్న ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే పదార్థాల ద్వారా సహజమైన ప్రాణశక్తిని పెంపొందింపచేస్తుంది. జర్మనీలో ఇప్పటికే క్లినికల్ ట్రయల్స్ మొదటిదశను పూర్తి చేసుకున్న ఈ ఇంజెక్షనబుల్ బయో యాక్టివ్ జెల్ నేరుగా లోనికి చొచ్చుకెళ్లి, కార్టిలేజ్ కణాలను ఉత్తేజపరుస్తాయి. ఫలితంగా మోకాళ్ల కదలికల్లో నొప్పి తగ్గుతుంది. కొందరు శాస్త్రవేత్తలు ఈ జెల్‌ను కుందేళ్ల మోకాళ్లలో ప్రయోగించగా, రెండు వారాల్లోనే మెరుగైన ఫలితాన్ని కనుగొన్నారు. ఈ ప్రయోగాల ద్వారా, జెల్‌ను సరిగ్గా ఇంజెక్ట్ చేసిన తర్వాత ఆ ప్రాంతంలో కొత్త కార్టిలేజ్ ఏర్పడుతుంది. వివిధ రకాల నొప్పులతో బాధపడేవారు, ప్రత్యేకించి వృద్ధులకు ఎంతో ఉపయోగపడే ఈ జెల్‌కు ఐరోపా వ్యాప్తంగా, 2026లో అనుమతి లభించనుందని సమాచారం. అదే జరిగితే, శస్త్రచికిత్స అవసరం లేకుండా, ఒకే ఇంజక్షన్‌తో సహజ కార్టిలేజ్ తిరిగి వస్తున్న ఫలితాలు పొందవచ్చు.

# ఎర్రజెండా నీడలోనే సాయుధ పోరాటం

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు

**ప్రజాపక్షం/నర్సంపేట :** ఎర్రజెండా నీడలోనే తెలంగాణ సాయుధ పోరాటం జరిగిందని, సాయుధ పోరాట హక్కులు కమ్యూనిస్టులకే దక్కుతాయని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. ఆదివారం నర్సంపేటలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఐ నర్సంపేట మండల కార్యదర్శి అయిత యాకయ్య అధ్యక్షత వహించగా తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చినా తెలంగాణకు స్వాతంత్ర్యం రాలేదని, తెలంగాణతో పాటు కర్ణాటకలోని మూడు, మహారాష్ట్రలోని ఐదు జిల్లాలతో కలిసి తెలంగాణ హైదరాబాద్ సంస్థానం ఉండేదన్నారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, సోయాబుల్లాఖాన్ వంటి అనేక మంది పోరాటం ఫలితంగా హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం హిందువులకు వ్యతిరేకంగా జరిగిందని బిజెపి దొంగ మాటలు మాట్లాడుతుందన్నారు. హైదరాబాద్‌లో స్మృతి వనం ఏర్పాటు చేసి పోరాట యోధుల విగ్రహాలు ట్యాంక్ బండ్‌పై ప్రతిష్టించాలని, పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర లిఖించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.బాష్‌మియా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పంజాల రమేష్, నాయకులు మియాపురం గోవర్ధన్, పాలక కవిత, పిట్టల సతీష్ గడ్డం, నాగరాజు, ఇల్లందుల సాంబయ్య, అక్కపెల్లి రమేష్, గుంపెల్లి మునీశ్వరుడు, గడ్డం యాకయ్య, దండుగుల అశోక్, వడ్లకొండ యశోద, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట...

### సామాన్యులను సాయుధులను చేసిన పోరాటం

**కొణిజర్ల :** సామాన్యులను సాయుధులను చేసిన మహోత్తర పోరాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. భూమి, భుక్తి, విముక్తితో పాటు వెట్టి చాకిరికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో నాలుగున్నర వేల మంది యోధులు అమరులయ్యారని ఆయన తెలిపారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో సాయుధ తెలంగాణ పోరాట యోధుడు గడల సీతారామయ్య స్మారక స్తూపం వద్ద అరుణ పతాకాన్ని హేమంతరావు ఆవిష్కరించారు. ఈసందర్భంగా గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వర రావు అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ అమరుల ఆశయాలకు అనుగుణంగా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు నిరంతర ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కొణిజర్లలో సాయుధ పోరాటయోధుడు దొండపాటి వెంకయ్య స్మారక స్తూపం వద్ద అరుణ పతాకాన్ని జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి ఆవిష్కరించి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు దొండపాటి రమేష్, పోటు కళావతి, మండల కార్యదర్శి గడల భాస్కర్ రావు, మండల నాయకులు స్వర్ణ రమేష్, మునిగ కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు గడల సీతారామయ్య, యాసా శాంతకుమారి, సోమయ్య, తోటపల్లి సీతారాములు, ఎల్. గోపాలరావు, విష్ణుమూర్తి, సీతారాములు, బానోత్ రామయ్య, రాంబాబు, వెంకయ్య, అడపా బాబు, చింతల ఆదినారాయణ, యాసా కళావతి పాల్గొన్నారు.


కొణిజర్ల..

### పోరాట యోధులను అందించిన పోరాటాల పురిటి గడ్డ పలివెల

**మునుగోడు :** దొరలు, భూస్వాములు, నైజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడడానికి యోధులను అందించిన పోరాటాల పురిటి గడ్డ పలివెల చరిత్ర మరువలేనిదని.. ఆ యోధుల చరిత్రను భావితరాలకు అందించే బాధ్యత అందరిపైన ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పలివెల గ్రామంలో సాయుధ పోరాట యోధులు కొండవీటి గురునాథరెడ్డి, కొండవీటి బచ్చిరెడ్డి, కొండవీటి జగన్మోహన్‌రెడ్డి విగ్రహాలకు, అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించి సిపిఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో పలివెల గ్రామం నుండి బచ్చిరెడ్డి, గురునాథరెడి, గోస్కొండ పెద్దులు మరో 30 మంది పోరాట యోధులు నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం, బొల్గూరి నరసింహ, తీర్పారి వెంకటేశ్వర్లు, జిల్లా సమితి సభ్యులు సురిగి చలపతి, మండల కార్యదర్శి చాపల శ్రీను, అమరవీరుల కుటుంబసభ్యులు కొండవీటి సునీల్‌రెడ్డి, కొండవీటి రవీందర్‌రెడ్డి, కొండవీటి సురేందర్‌రెడ్డి, కొండవీటి శేఖర్‌రెడ్డి, సిపిఐ నాయకులు ఉప్పునుతుల రమేష్,మాజీ జెడ్పిటిసి గోస్కొండ లింగయ్య, మాజీ ఎంపీపీ మాధగోని సాయిలు, ఈదులకంటి కైలాష్, గుబ్బ వెంకన్న, ఎండి జానీ, వరికుప్పల వెంకన్న, నాతి సత్తమ్మ, గోసుకొండ మల్లేష్, మాధగోని లింగయ్య, కట్కూరి లింగస్వామి, చాపల విప్లవ్, బొలుగురి వంశీకృష్ణ పాల్గొన్నారు.


మునుగోడు...

### తెలంగాణ సాయధ పోరాటం ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి

**భద్రాద్రి కొత్తగూడెం :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని 17వ వార్డు న్యూ గొల్లగూడెంలో జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. జమీదారీ వ్యవస్థ, దోపిడి, అన్యాయాలపై పేదరైతులు, కూలీలు ఏకమై పోరాడిన ఉద్యమమే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమన్నారు. సాయుధ పోరాట నాయకుల పేర్లు చిరస్థాయిలో నిలిచిపోయే విధంగా ప్రభుత్వ పథకాలకు నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. సదస్సులో సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, జిల్లా సమితి సభ్యులు నేరెళ్ల రమేష్, మాజీ కౌన్సిలర్ కళ్యాణి, పట్టణ నాయకులు మాచర్ల శ్రీనివాస్, పురుషోత్తం, దుర్గ, అమన్, పుష్పలత, అస్మిత్, ముక్త్యార్, మల్లయ్య, పి రమేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



భద్రాద్రి...

### సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలి

**హనుమకొండ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండలోని అశోక జంక్షన్ వద్ద సిపిఐ సీనియర్ నాయకులు, అమరులు, బిఆర్ భగవాన్ దాస్ విగ్రహం వద్ద సిపిఐ మండల కార్యదర్శి యేషబోయిన శ్రీనివాస్ అధ్యక్షతన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై కర్రె భిక్షపతి మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సిరబోయిన కరుణాకర్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, ప్రజానాట్యమండలి కార్యదర్శి కొట్టేపాక రవి, నాయకులు యాళ్ల సంజయ్, కండె నరసయ్య, పిలకల రాజు, ప్రభాకర్, చంద్రమౌళి, వినయ్ తదితరులు పాల్గొన్నారు

### పోరాట వారోత్సవాలు ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

**భూపాలపల్లి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లాకేంద్రంలో ఆదివారం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఎఐటియుసి కొమురయ్య భవన్ నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న అమరవీరుల స్తూపం వద్ద అరుణ పతాకాన్ని ఎగురవేసి నివాళులర్పించి వారోత్సవాల సభ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు మోటాపలుకుల రమేష్, పైస్ల శాంతికుమార్, అన్నారపు రాజేందర్, జి.శ్రీనివాస్, నూకల చంద్రమౌళి, నబి, నేరెళ్ల జోసఫ్, వేముల శ్రీకాంత్, తాళ్ల పోషం, పొన్నగంటి లావణ్య, గోలి లావణ్య, ఎండియాకూబ్, బౌతు కమలాకర్, గోనల తిరుపతి, పల్లెర్ల రజిత, మట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### అమరవీరుల ఆశయాలు కొనసాగిద్దాం

**మోటకొండూరు :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాలలో అశువులు బాసిన అమరవీరుల ఆశయాలను కొనసాగించాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. ఆదివారం మోటకొండూర్ మండలంలోని మోటకొండూర్, కాటేపల్లి, ముత్తిరెడ్డిగూడెం, మాటూర్ గ్రామాలలో ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కొరియర్లుగా పని చేసి నేలకొరిగిన రెడ్డిగట్టు శేషయ్య, శనిగరం సత్తయ్య, పేరెబోయిన రాజయ్య, కొమ్మగాని స్వామి, బండి జగన్నాథం, మచ్చ శ్రీహరి, ఎలగందుల శ్రీరాములు స్థూపాలకు పూలమాల లు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేగు సిద్దయ్య, బండి అనసూయ, కొమ్మగాని లక్ష్మి లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, మండల కార్యదర్శి గాదేగాని మాణిక్యం, సహాయకార్యదర్శిలు ఆలేటి బాలరాజు, ముసుకు పెంటారెడ్డి, కార్యవర్గ సభ్యులు బోల్ల శ్రీనివాస్, బీరకాయల మల్లేష్, పల్లె వెంకన్న, మంచాల రాధమ్మ, పసుపుల నర్సింహా, రేగు సిద్దయ్య, జివిలికలపల్లి పాండు, బీరకాయల మధు, సూదగాని వెంకన్న, చొప్పరి సోములు, రేపాక నరసింహా, మచ్చ సూర్యనారాయణ, లక్ష్మీ నారాయణ, నల్ల రామ్‌లు, జివిలకలపల్లి గణేష్, రేపాక ఉమా, ఎండి యూసూబ్, బి.మంచాల పద్మ, దూశెట్టి అండాలు, ఆడపు లక్ష్మి , మంచాల సుగుణ, బండి అనసూయ, గొట్టిపాముల సునీల్ కుమార్, సిద్దుల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.


భూపాలపల్లి...


మోటకొండూరు...



హనుమకొండ...



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## భువనగిరి పట్టణంలో చాలా సమస్యలు పరిష్కరించాం



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : భువనగిరి పట్టణంలో చాలా సమస్యలు పరిష్కరించడం జరిగిందని గ్రంథాలయం సంస్థ చైర్మన్ ఆవేస్ చిస్తీ, పొత్నాక్ ప్రమోద్ కుమార్, మున్సిపల్ మాజీ చెర్మన్లు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్ అన్నారు. భువనగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఇప్పటివరకు సుమారు పలు అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ చేయలేని పనులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి చేసి చూపిస్తున్నట్లు వారు చెప్పారు. జగదేవ్పూర్ చౌరస్తా రోడ్డు సమస్యను త్వరలోనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, వెంకటేష్, బెండ శ్రీకాంత్, గుర్రాల శ్రీను, పిట్టల బాలరాజు, ప్రకాష్ సాయి పాల్గొన్నారు.



## సంస్మరణ సభ జయప్రదం చేయండి

### సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : కోదాడ పట్టణంలోని కాశీనాథం ఫంక్షన్ హాల్‌లో ఈనెల 16న నిర్వహించనున్న సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శి మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంతాపసభకు పార్టీశ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సిపిఐ పార్టీ కార్యాలయం ధర్మబిక్షం భవన్‌లో నిర్వహించిన కార్యకర్త సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి, యువజన రైతు కార్మిక పౌర హక్కుల నాయకుడిగా ఎన్నో బాధ్యతలు జాతీయ స్థాయిలో నిర్వహించిన సురవరం సుధాకర్ రెడ్డి సంతాప సభకు అధిక సంఖ్యలో పాల్గొనలని కోరారు. ఈ సంతాప సభకు భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, కోదాడ శాసనసభ్యులు ఉత్తమ్ పద్మావతి, సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్న చంద్రశేఖర్ పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, పట్టణ కార్యవర్గ సభ్యులు పెంద్ర కృష్ణ, నాయకులు వాడపల్లి వెంకన్న, గురుస్వామి పాల్గొన్నారు.

## డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ బుద్ధవనం సందర్శన



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ లోని బుద్ధ వనాన్ని ఆదివారము తెలంగాణ రాష్ట్ర సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ సంజయ్ కామినేని సందర్శించారు. ముందుగా ఆయన నాగార్జునసాగర్ ప్రధాన డ్యామును, ఎత్తిపోతల జలపాతాన్ని సందర్శించారు. బుద్ధవనం సందర్శనలో భాగంగా బుద్ధ చరితవనం, ధ్యానవనం, స్తూపవనాలను సందర్శించి మహాస్థూపం అంతర్భాగంలోని సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలు తెలిపే వీడియోని వీక్షించారు. అనంతరం మహాస్తూపం లోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతిని వెలిగించారు. బుద్ధవనం ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర వీరిని బుద్ధ వనం కండువాలతో సత్కరించారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ బుద్ధవనం విశేషాలను, చారిత్రక వివరాలను తెలియజేశారు. వీరితోపాటు సీనియర్ ఆడిట్ ఆఫీసర్ బ్రీజేష్ కుమార్, నాగార్జునసాగర్ డ్యాం డివిజన్ కార్యాలయ సూపర్డెంట్ దుర్గాప్రసాద్, ఎస్‌పిఎఫ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఉన్నత స్థానాలకు ఎదగాలి




**ప్రజాపక్షం/ నలగొండ టౌన్:** విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత ఉద్యోగ అవకాశాలు పొందాలని నల్లగొండ డిఎస్‌పి కొలను శివరాంరెడ్డి సూచించారు. పట్టణంలోని ఎన్ఆర్ఎస్ గార్డెన్స్ లో ఆదివారం నిర్వహించిన ఫ్రషర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువుతో పోరాటం చేస్తేనే భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఇంటర్మీడియట్ దశ జీవితాలను మార్చివేస్తుందని ఆలోచనను గమనించి విద్యార్థులు కష్టపడాలని అన్నారు. ఈ దశలో వేసే అడిగు రేపు భవిష్యత్తుకు పునాది అవుతుందని సమాజానికి మార్గదర్శకంగా నిలిచే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం వివిధ విభాగాలలో ఉత్తమంగా రాణించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ వేడుకలో ఎస్ఆర్ జూనియర్ కళాశాల,పాఠశాల జోనల్ ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ జోనల్ సతీష్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ మనోజ్ రెడ్డి, ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ ప్రిన్సిపల్ రూప, డీన్ కిషోర్ పాల్గొన్నారు.

## సనాతన ధర్మం ప్రపంచ దేశాలకు ఆదర్శం

### మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : సనాతన ధర్మం ప్రపంచ దేశాలకు ఆదర్శమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలాజీ కన్వన్షన్ హాల్లో సనాతన ధర్మ పరిరక్షణ అలయన్స్ కమిటి ఆధ్వర్యంలో దేవాదాయ ధర్మాదాయ అధ్యాత్మిక సంఘాల ఐక్యత, స్వామీజీలు, పీఠాధిపతులు, గురూజీలతో సనాతన ధర్మంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఎన్నో ఏండ్లుగా సనాతన ధర్మం విరాజిల్లుతుందని కొనియాడారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన వివిధ స్వామిజీలు మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాషాయానికి విలువ పెరుగుతుందన్నారు. మహాకుంభమేళాలో 15 కోట్ల మంది హిందువులు పాల్గొన్నారని గుర్తు చేశారు. హిందువులలో ఉన్న అనైక్యత కారణంగా సనాతన ధర్మం సన్నగిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ చైర్మన్ బీరెల్లి చంద్రారెడ్డి, మాజీ శాసనసభ్యులు సంకినేని వెంకటేశ్వరరావు, సుధాకర్ పివిసి మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్, మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికడదాం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బాల్య వివాహాలను అరికట్టడం మనందరి బాధ్యత అని అశ్రీత సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ఎం. శోభారాణి అన్నారు.జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వారి సౌజన్యంతో అశ్రీత సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహల నిర్మూలన కొరకు ప్రపంచ సమాఖ్య చేపటిన కార్యక్రమంలో భాగంగా నల్లగొండ పట్టణంలోని గొల్లగూడ హనుమాన్ టెంపుల్, హైదరాబాద్ రోడ్ లోని మసీద్,ఆర్‌టిసి కాలనిలోని చర్చిలలో,మత పెద్దలతో సంతకాల సేకరణ,ప్రతిజ్ఞ చేయించారు.బాల్య వివాహాలు వల్ల వచ్చే నస్టాల గురించి వారి సందేశాలు తీసుకోవడం వారి సమావేశాలలో దీనిపై అవగాహన కల్పించాలని అక్కడ వచ్చిన భక్తులకు సూచించారు. సంస్థ కార్యకర్తలు బండారు రమేష్, ధనమ్మ, ఝాన్సీ, కవిత, చిన్నరాయుడు, జెరిపోతుల యాదయ్య, వివిధ ఆలయాల అర్చకులు, చర్చి ఫాదర్స్ పాల్గొన్నారు.

## సాయుధ పోరాటం గురించి మాట్లాడే హక్కు బిజెపికి, ఆర్‌ఎస్‌ఎస్‌కు లేదు

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నరసింహారెడ్డి



**ప్రజాపక్షం/చింతపల్లి** : నైజాంను తరిమికొట్టి, ప్రజలకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను అందించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులే వారసులని, సాయుధ పోరాటం గురించి మాట్లాడే నైతిక హక్కు బిజెపికి, ఆర్ఎస్‌స్‌కు లేదని సిపిఐ రాష్ట్ర కార్యవర్గవర్గ సభ్యుడు పల్లా నరసింహారెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 77వ వారోత్సవాల సందర్భంగా మండల పరిధిలోని ఘుడియగౌరారం గ్రామంలో సాయుధ పోరాట యోధులు, దేవరకొండ తాలుక కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాతలలో ఒకరయిన మాజీ ఎంఎల్‌ఎ ఉజ్జిని నారాయణరావు స్మారక స్థూపానికి ఆ పార్టీ శ్రేణులు ఆదివారం పూల మాలలు వేసి, నివాళులు అర్పించి, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా నరసింహారెడ్డి, మునుగోడు మాజీ ఎంఎల్‌ఎ ఉజ్జిని యాదగిరిరావు మాట్లాడుతూ సాయుధ పోరాటాన్ని హిందు, ముస్లింల మధ్య జరిగిన సంఘర్షణగా చిత్రీకరించి, వక్రీకరించి సాయుధ పోరాటాన్ని హైజాక్ చేయడానికి బిజెపి కుట్ర పన్నుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భూస్వాములు అరచకాలు, ఆగడాలు సహించలేని సాధారణ ప్రజలు ఆయుధాలు చేతబట్టి భూస్వాముల మెడలువంచి వేల ఎకరాల భూమిని పేదలకు పంచారన్నారు. ఈ పోరాటంలో నాలుగు వేల మంది కమ్యూనిస్టులు నేలకొరిగారన్నారు. ఇంతటిసాహసం, అమరత్వంతో కూడిన సాయుధ పోరాట చరిత్రను బిజెపి హిందూ, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించి భవిష్యత్తు తరాలకు తప్పుడు చరిత్రను అందిస్తే తెలంగాణ ప్రజలు సహించరని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజాం నిరంకుశ అంతం కోసం సాగిన సాయుధ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎవడి మైనొద్దిన్, పలు మండలాల కార్యదర్శులు బొడ్డుపల్లి వెంకటరమణ, పోలె వెంకటయ్య, దేప సుదర్శన్‌రెడ్డి, శ్రీరామదాసు కనకాచారి, ఉప్పునుంతల వెంకటయ్య, బొల్లె శైలేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు, పల్లా రంగారెడ్డి, బిఆర్ఎస్‌నాయకుడు, ఉజ్జిని విద్యాసాగర్‌రావు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావ్, శ్రీరాములు, శ్రీశైలం, లక్ష్మ య్య, శంషొద్దిన్, బుచ్చయ్య, నర్సింహ్మా, వెంకటయ్య పాల్గొన్నారు.

## పేదల పక్షాన పోరాడితేనే రాజకీయ నాయకుడిగా గుర్తింపు

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/మునుగోడు:** కమ్యూనిస్టులు నిరంతరం పేద ప్రజల పక్షాన ఉంటు పోరాడితేనే నాయకుడిగా గుర్తింపు లభిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం కార్యకర్తలకు సూచించారు. 77వ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కొరటికల్ గ్రామంలో అమరులైన మునుగోటి అంజయ్య,మిర్యాల లింగయ్య స్థూపాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆ గ్రామ సిపిఐ నాయకులు ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనంలోఎంఎల్‌సి నెల్లికంటి సత్యంకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయుధ పోరాటంలో కొరటికల్ గ్రామం నుండి కమ్యూనిస్టు నాయకులు పాల్గొనడం గొప్ప విషయమని కొనియాడారు. గ్రామ అభివృద్ధి కోసం, పార్టీ కార్యకర్తల కోసం నిరంతరం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. అనంతరం ఎఎంఎల్‌సి నెల్లికంటి సత్యంను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురుజ రామచంద్రం,బొల్గూరి నరసింహ, తీర్పారి వెంకటేశ్వర్లు,జిల్లా సమితి సభ్యులు సిరిగి చలపతి,మండల సహాయ కార్యదర్శి మందుల పాండు, ఈదులకంటి కైలాస్,వనం వెంకన్న,ఉప్పునూతల రమేష్, మునుగోటి దయాకర్, తిరుమల యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

**బిఆర్ఎస్ నుంచి సిపిఐలో చేరిక** : మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు దండు యాదయ్యతోపాటు మరి కొంత మంది నాయకులు సిపిఐ కి ఆకర్షితులై సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం సమక్షంలో ఆదివారం పార్టీలోచేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎంఎల్‌సి సత్యం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కొరటికల్ గ్రామ సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టే పోరాటాంలో భాగస్వాములు కావాలని సందర్భంగా కోరారు.

## రైతుల యూరియాను పక్కదారి పట్టించిన ఎమ్మెల్యే గన్‌మెన్

### రాజకీయ పలుకుబడితో యూరియా లారీ దారి మళ్లింపు : రైతుల ఆగ్రహం

### గన్‌మెన్‌పై విచారణకు ఎస్‌పి ఆదేశాలు

**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** యూరియ మార్కెట్లో అందుబాటులో లేదని, రెండు బస్తాల కోసం రోజుల తరబడి రోజులు వేచి చూ డాల్సిన పరిస్థితులతో నానా అవస్థలు పడుతుంటే అధికార పార్టీ అండదండలతో కొందరు లారీ లారీలకే మళ్లించుకుంటున్నారని రైతుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గన్ మెన్ అయిన వారి కో సం ఆదమరిచి రైతుల కోసం వచ్చిన యూరియా లారీని దారి మళ్లించి నెత్తి నొప్పి తెచ్చి పెట్టుకున్నాడు. రైతుల కోసం కేటాయించిన లారీ లోడ్ యూరియాను దారి మళ్లించి న వ్యవహారం ఆలస్యంగా వెలుగు లోకి రావడంతో పోలీసు ఉన్నతాధి కారులు చర్యలకు ఉపక్రమించారు.విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాల గూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి వ్యక్తిగత సహాయకుని అవతారమె త్తిన గన్‌మెన్ నాగు నాయక్ వ్య వసాయ అధికారులకు అప్పటికప్పుడు ఫోన్ చేసి యూరియా లా రీని మూడో కంటికి తెలవకుండా దారి మళ్ళించాడు.ప్రస్తుతం మార్కెట్లో యూరియా డి మాండ్ మేరకు నెలకొంటున్న ఆం దోళన సమస్యల మధ్య కొద్ది రోజు ల తర్వాత ఎమ్మెల్యే బత్తుల లక్ష్మా రెడ్డి యూరియాపై ఆరా కోసం అధి కారులకు ఫోన్ చేయడంతో అసలు విషయంతో పాటు గన్‌మెన్ నాగు నాయక్ తతంగం మొత్తం బహిర్గతమైంది.

**గన్‌మెన్‌పై విచారణకు ఎస్‌పి ఆదేశాలు** : మిర్యాలగూడ ఎమ్మెల్యే బస్సుల ల క్ష్మారెడ్డి గన్ మెన్ నాగు నాయక్ వ్యవహారంపై నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ సీరియస్ గా తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోం ది. ఈ మేరకు ఇప్పటికే విచారణకు ఆదేశాలు జారీ చేశారు కూడా తెలి సింది. విచారణ నివేదిక వచ్చిన వెంటనే కఠిన చర్యలు తప్పకుండా సంకేతాలు ఇప్పటికే పోలీసు అధి కారుల నుంచి వెలువడినట్టు సమా చారం. యూరియా కోసం ముప్పు తిప్పలు పడుతున్న మాకు రావాల్సిన యూరియాను అధికార అజమాయిషి తో దారి అందించడం పట్ల రైతులు తీవ్ర ఆగ్రహం వేలి బుచ్చుతున్నారు.

## సిఎం రిలీఫ్ పండ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/కోదాడ:** రాష్ట్రంలోని పేదలకు పార్టీలకు అతీతంగా సిఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తుందని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా మంజూరైన 267 చెక్కులు రూ.87.78 లక్షల రూపాయలను లబ్ధిదారులకు అందజేశారు. దీంతో పాటు కాంగ్రెస్ పార్టీలో క్రీయశీలకంగా సభ్యత్వం తీసుకుని మృతి చెందిన కార్యకర్తలకు ఒకొక్కరికి రెండు లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు.

# ఘనంగా దామోదర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

### సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా...

### కేక్ కట్టింగ్‌లు.. అల్పాహారం... అన్నదానాలు..

### రోగులకు పండ్ల పంపిణీ... రక్తదాన శిబిరాలు...

**ప్రజాపక్షం/సూర్యాపేట** : రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, సూర్యాపేట నియోజకవర్గ ఇంచార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం సూర్యాపేట జిల్లావ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి రాత్రి వరకు వరుస కార్యక్రమాలు నిర్వహించారు. కేక్ కట్టింగ్‌లు, అల్పాహారం, అన్నదాన కార్యక్రమాలతోపాటు రోగులకు బ్రెడ్లు, పండ్ల పంపిణీ, రక్తదాన శిభిరాలు, దేవాలయాలలో పూజలు, చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి తమ ప్రియతమ నేతపై ఉన్న అభిమానాన్ని ఆ పార్టీ శ్రేణులు చాటుకున్నారు.

**జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో(రెడ్‌హౌస్)...** కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం రెడ్‌హౌస్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా ఆర్‌డిఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. దీనికి ముఖ్య అతిధిగా సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి హాజరయ్యారు. భారీ కేక్‌ను కట్ చేసి, మిఠాయిలను పంపిణీ చేశారు. దీనికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు. బాణాసంచాలు పేల్చి సందడి చేశారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. సూర్యాపేట జిల్లా అభివృద్ధి ప్రధాత ఆర్‌డిఆర్ అంటూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర రైతు సమన్వయ కమిటి సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, నాయకులు చకిలం రాజేశ్వర్‌రావు, శ్రీలింగమంతుల స్వామి (పెద్దగట్టు) దేవస్థాన చైర్మన్ పోలెబోయిన నర్సయ్య యాదవ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ పాల్గొన్నారు.

**ఖమ్మం ఎక్స్‌రోడ్డులో...** పట్టణంలోని ఖమ్మం ఎక్స్‌రోడ్డులో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ మాద్గుల నవీన్ ఆధ్వర్యంలో అల్పాహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిధిగా వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి హాజరయ్యారు. కేక్‌ను కట్ చేసి, మిఠాయిలను కూడా పంపిణీ చేశారు. బాణాసంచాలు పేల్చారు. తమ అభిమాన నాయకుడు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి నిండు నూరేండ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతున్ని వేడుకున్నారు.

**కుడకుడలో...** మున్సిపాలిటి పరిధిలోని కుడకుడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదిన వేడుకలు యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, నాయకులు తన్వీర్, పంతంగి దశరధ, మాజీ కౌన్సిలర్ పద్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం చేశారు. దీనికి ముఖ్య అతిధిగా వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి హాజరయ్యారు.

**దురాజ్‌పల్లిలో...** మున్సిపాలిటి పరిధిలోని దురాజ్‌పల్లిలో నాయకులు చిలుముల శ్రీనివాస్‌రెడ్డి, మద్దెనబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిధిగా వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి హాజరయ్యారు. ఆయన చేతులు మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**పండ్ల పంపిణీ, రక్తదాన శిబిరం...** మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదినం సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి చేతుల మీదుగా రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అలాగే రక్తదాన శిభిరాన్ని కూడా నిర్వహించారు.

**రేబల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో...** మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదిన వేడుకలను సూర్యాపేట డివిజన్ తాపీ పనివారుల సంఘం (ఐఎన్‌టియుసి) అధ్యక్షులు రేబల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి చేతుల మీదుగా కేక్‌ను కట్ చేసి, మిఠాయిలను పంపిణీ చేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**ఖాసీంపేటలో...** సూర్యాపేట మున్సిపాలిటి పరిధిలోని ఖాసీంపేటలో మాజీ మంత్రి, సూర్యాపేట నియోజక వర్గ ఇంచార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. 4వ వార్డు మాజీ కౌన్సిలర్ లక్ష్మి మకట్‌లాల్ ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ వేడుకలకు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి హాజరయ్యారు.

**ఆత్మకూర్(ఎస్)లో...** ఆత్మకూర్(ఎస్) మండలంలోని శ్రీ దండు మైసమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ తంగెళ్ళ కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నెమ్మికల్‌లోని ఆలయం సమీపంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.

**శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో...** పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయనకు ఆయురారోగ్యాలు ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరుతూ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీదండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ళ కరుణాకర్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ, చింతమళ్ళ రమేష్, నాగుల వాసు పాల్గొన్నారు.

**బాప్టిస్ట్ చర్చిలో...** పట్టణంలోని బాప్టిస్ట్ చర్చిలో మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదిన వేడుకలను యువజన నాయకులు బొజ్జ సంజయ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ప్రభుదాస్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ప్రారంభించారు.






















# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ప్రజాపక్షం/వంగూర్ : మండలకేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాల 2006–2007 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులు ఆదివారం రాయల్ ఫంక్షన్ హాలులో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. 19 సంవత్సరాల తర్వాత బాల్యమిత్రులు ఒకరినొకరు కలుసుకోవడం వాళ్ల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ సమ్మేళనంలో అప్పటి ప్రధానోపాధ్యాయులు రాంరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీరాములు, వెంకటరెడ్డి, శ్రీనివాసులు, హిమముద్దిన్, పరమేశ్వర్, కాటమయ్య, అటెండర్లు బలరాం, రాంబాబులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## తాగిన మైకంలో తల్లిపై అత్యాచారయత్నం

### కర్రతో దాడి చేసిన తండ్రి... మృతి చెందిన కొడుకు



ప్రజాపక్షం/జడ్చర్ల: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణం డిడిసి కేంద్రం దగ్గర మధ్య రాత్రి తాగిన మైకంలో తన తల్లిపై అత్యాచార యత్నానికి పాల్పడుతుండగా గమనించిన తండ్రి కర్రతో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన జడ్చర్ల పట్టణంలో చోటుచేసుకుంది. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు జడ్చ ర్ల సిఐ తెలిపారు. ప్రతినిత్యం తాగుడుకు బానిసై తల్లిదండ్రులను వేధిస్తూ తాగి వచ్చి తన తల్లిని కోరిక తీర్చమంటూ వేధిస్తున్నటువంటి కొడుకును అంతమొందించాలని అనుకున్న తండ్రి పథకం ప్రకారం నిద్రపోతున్న సమయంలో కర్రతో దాడి చేయడంతో ఈ సంఘటన జరిగినట్టు తెలిసింది.

## గురువులు సమాజానికి మార్గదర్శకులు

### మక్తల్‌లో టీచర్స్ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి



ప్రజాపక్షం/మక్తల్: మక్తల్ నియోజకవర్గ కేంద్రంలోని మినీ గ్రౌండ్‌లో కంట్రీ క్లబ్ వ్యవస్థాపకులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ టీచర్స్ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంటును క్రీడలు యువజన శాఖ మంత్రి డా.వాకిటి శ్రీహరి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గురువులు కేవలం విద్యనే కాకుండా సమాజానికి మార్గదర్శకులు క్రీడలు ఆరోగ్యానికి, ఆనందాన్ని స్నేహభావాన్ని పెంపొంది స్తాయి అని అన్నారు. గురువుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ ఒక మంచి ఆవిష్కరణ అని తెలిపారు. ప్రభుత్వం క్రీడలకు అవసరమైన అన్ని విధాల ప్రోత్సాహం అందిస్తూనే ఉంటుందని అన్నారు. ఈ తరహా కార్యక్రమాలు విద్యావేత్తల మధ్య ఐక్యత, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కలిగిస్తాయని మక్తల్ నుంచి రాష్ట్ర స్థాయిలో ప్రతిభావంతులు మరింత ముందుకు రావాలని ఆకాంక్షించారు.

**హరికథ సినిమా విడుదల తేదీ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి**

ఐరావత సినీ కల్చర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మితమైన హరికథ సినిమా విడుదల తేదీ పోస్టర్‌ను క్రీడలు యువజన శాఖ మంత్రి డాక్టర్.వాకిటి శ్రీహరి ఆవిష్కరించారు. నవంబర్ 7వ తేదీన హరికథ సినిమా విడుదలవుతుందని ప్రకటించారు. మక్తల్ ప్రాంత వాసులతో రూపొందించబడిన హరికథ సినిమా భారీ స్థాయిలో సూపర్ హిట్ అయి, ఈ ప్రాంత వాసులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు. దర్శకుడు అనుదీప్ రెడ్డితో పాటు నిర్మాతలు రంజిత్ గౌడ్, వివేకానంద , రాఘవేందర్, కవిత అందరూ ఈ ప్రాంత వాసు లేనని, చాలా వరకు మక్తల్ నియోజకవర్గం లోని చుట్టుపక్కల ప్రాంతాల్లో అద్భుతమైన లోకేషన్ లలో సినిమా ఆవిష్కరించారని, పూర్తిగా కుటుంబ సభ్యులందరూ కలిసి సినిమాను ఎంజాయ్ చేయవచ్చని, నవంబర్ 7 వ తేదీనర విడుదలవుతున్న హరికథ సినిమాను ఈ ప్రాంత వాసులే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అందరూ వీక్షించాలని కోరారు. చిత్ర దర్శకుడు అనుదీప్ రెడ్డి మాట్లాడుతూ హరికథ సినిమా వినూత్నమైన సినిమా అని, అన్ని వర్గాలకు నచ్చే కుటుంబ ప్రేమ కథా చిత్రం అని, ఎక్కడ రాజీ పడకుండా అందరికీ నచ్చేలా తీశామని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ దర్శకుడు చెప్పిన కథ చాలా బాగుందని సినిమా చాలా బాగా నచ్చిందని, నవంబర్ ఏడో తేదీన రిలీజ్ అవుతున్న సినిమాను ప్రజలందరూ ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హరికథ సినిమా నటులు కిరణ్, రంజిత్, సజ్జన్, అఖిల్ రామ్, లావణ్య, కీర్తి, భాస్కర్, కృష్ణ, ఇతర సాంకేతిక నిపుణులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక దందా



ప్రజాపక్షం/మక్తల్: నారాయణపేట జిల్లా మక్తల్ మండలం చిట్యాల గ్రామం నుండి అనుగొండ వరకు జోరుగా ఇసుక అక్రమ దందా చిట్యాల వాగు నుండి కాకుండా ఇంటి దగ్గర నిలువా చేసుకున్న ఇసుక అక్రమంగా వివిధ గ్రామాలకు తరలిస్తున్నారు. సాయంత్రం 6 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు ట్రాక్టర్‌ల ద్వారా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌తో కేసులు పరిష్కారం

### ఎస్పీ యోగేష్ గౌతమ్



ప్రజాపక్షం/నారాయణపేట్ : 13వ తేదీన జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసుల వివరాలు వెల్లడించారు. జిల్లాలోని 12 పోలీసు స్టేషన్లో మొత్తం 2,258 కేసులు పరిష్కారమయ్యాయని, అందులో ఐపిసి కేసులు 208 పరిష్కరించగా, 1330 ఈ పెట్టీ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 720 ఉండగా వాటికి జరిమానా విధించినట్లు తెలియజేశారు. మొత్తం జరిమానా రూ.5,35,000 చెల్లించడం జరిగిందని తెలిపారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులకు 23 సైబర్ క్రైమ్ కేసులలో రూ.1,71,691 రిఫైన్డ్ ఆర్డర్స్ రావడం జరిగిందని, త్వరలో సైబర్ బాధితులకు బ్యాంకుల ద్వారా తిరిగే అమౌంటు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేర నిరూపణ ఉన్న నిందితులు, కక్షిదారులు స్వయంగా న్యాయస్థానాలకు హాజరై తమ తప్పులను ఒప్పుకోవడంతో ఈ కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. కేసులను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తూ విధులను నిర్వర్తించిన కోర్టు డ్యూటీ అధికారులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా పోలీసు వ్యవస్థతో వివిధ సమావేశాలు ఏర్పాటు చేస్తూ లోక్ అదాలత్‌ను విజయవంతం కావడానికి కృషి చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులుని, జిల్లా న్యాయ సేవాధికార అధికారులను శాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## చంద్రఘడ్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు




ప్రజాపక్షం/అమరచింత : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం అమరచింత మండల పరిధిలోని చంద్రఘడ్‌లో ఘనంగా నిర్వహించారు. సిపిఐ మండల కార్యదర్శి అబ్రహం తెలంగాణ పోరాట అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీహరి, అబ్రహంలు మాట్లాడుతూ ఆనాడు తెలంగాణలో భూస్వాములకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు రైతాంగ సాయుధ పోరాటాలు నిర్వహించి భూమిలేని నిరుపేదలకు భూములను పంచారని తెలిపారు. ఆనాటి తెలంగాణ సాయుధ పోరాటాల ఫలితంగా భారతదేశంలో తెలంగాణను సెప్టెంబర్ 17న విలీనం చేశారని వారు తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిగా తీసుకొని నేటి వరకు ప్రజల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సిపిఐ పార్టీ పోరాటాలను కొనసాగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ ఆత్మకూర్ మండల కార్యదర్శి లక్ష్మీ నారాయణశెట్టి, నాయకులు ఎర్రన్న, రాములు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



ప్రజాపక్షం/మక్తల్ : మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని టౌన్ ప్రెసిడెంట్ ఏ.రవికుమార్ నాయకులు కట్ట సురేష్ కుమార్ గుప్తా తెలిపారు. మంత్రి డాక్టర్.వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ఇప్పటికే చాలా చోట్ల ప్రారంభం అయ్యాయని, చాలా మంది లబ్ధిదారులకు తొలి విడతలో లక్ష రూపాయలు సైతం అకౌంట్లలో జమ అయ్యాయని తెలిపారు. వారందరూ త్వరితగతిన మిగిలిన పనులు పూర్తిచేసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. కొన్ని కోట్ల ప్రారంభం కాకపోతే, వెంటనే ప్రారంభించి పూర్తి చేసేలా కమిటీ సభ్యులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి అయితేనే. మిగతా లబ్ధిదారులకు రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యే అవకాశం ఉందని, వీలైనంత త్వరగా లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## 22 నుంచి దేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు




ప్రజాపక్షం/నారాయణపేట్ : నారాయణపేట్ జిల్లా ఉట్కూర్ మండలం బిజ్వార్‌లోని శ్రీ అంబాత్రయ క్షేత్రంలో జరిగే దేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు క్షేత్రం వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరా శ్రీ స్వామి సర్వం సిద్ధం చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన గోడ పత్రికను ఆదివారం భక్తులతో కలిసి ఆదిత్య పరశ్రీ స్వామి ఆవిష్కరించారు. ఈనెల 21 తేదీ చాలా మంచి రోజు ఆ రోజు నుండే దీక్షలు వేయాలనుకునే వారు వేసుకోవచ్చునని తెలిపారు. దీక్షలు ధరించే భవానీలకు సంబంధించిన మాలల వస్త్రాలు క్షేత్రంలోనే లభిస్తాయని తెలిపారు. బ్రహ్మోత్సవాలు నిర్వహణ కార్యక్రమాలు వివరిస్తూ దేవి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 22 నుంచి ఆక్టోబర్ 2 వరకు అంగరంగ వైభవంగా జరుగుతాయని తెలిపారు. 22న గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పుర వీధుల్లో ఊరేగిస్తూ అంబాత్రయ క్షేత్రానికి చేరుకుంటుంది. 22న అమ్మవారు శైలపుత్రి అలంకరణలో దర్శనం ఇస్తుందని ఈ సందర్భంగా శత చండి హోమం నిర్వహించి లక్ష కమలార్చన చేస్తారు. 23న బ్రహ్మ చారిని అలంకరణ, బిల్వార్చన, 24న చంద్ర ఘంటా అలంకరణ, తులసి అర్చన, 25న కూష్మాండ అలంకరణ, కుంకుమార్చన, 26న స్కందమాత అలంకరణ, కస్తూరి అర్చన, 27న కాత్యాయని అలంకరణ, గందార్చన, 28 న కాళరాత్రి అలంకరణ, పసుపు అర్చన, 29న మహాకాళి అలంకరణ, పుష్పార్చన, 30 నసిద్ధిదాత్రీ అలంకరణ, సువర్ణార్చన కార్యక్రమాలతో ప్రతి రోజు అమ్మవారి ఊరేగింపు దర్శనం ఉంటుందని వివరించారు. అలాగే 108 అఖండ జ్యోతులు, 1,108 దేవి అష్టోత్తరాలు, 2,108 దివ్య అభిషేకం హారతులు నిర్వహిస్తారు. మాలాదారణ భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా విశేష భజన లు, నాట్య ప్రదర్శనలు, నృత్యాలు ఉంటాయని తెలిపారు. అక్టోబర్ 2న అమ్మవారి చీర, లడ్డు వేలం ఉంటుందని తెలిపారు. దేవి నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## ఆపద్బంధువు సిఎంఆర్‌ఎఫ్ పథకం



ప్రజాపక్షం/వీపనగండ్ల : ప్రజా పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిల్లో మెరుగైన చికిత్స పొందిన వారికి సీఎంఆర్ఎఫ్ పథకం ఆపద్బాంధువు లాంటిదని నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ అన్నారు. మండల పరిధిలోని కల్వరాల గ్రామానికి చెందిన పోచమోని సురేష్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స పొందటంతో సీఎంఆర్ఎఫ్ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా రూ. 18వేలు చెక్కును మంజూరు చేయించగా బాధితుడు పోచమోని సురేష్‌కు గ్రామ మాజీ ఉప సర్పంచ్ మీనిగ రాముడు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్చీ నాయకులు చింత దయాకర్, కొత్తకోట భాస్కర్ , రంగపురం తిరుపతయ్య, స్వాములు తదితరులు ఉన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి




ప్రజాపక్షం/జడ్చర్ల: టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి లక్ష్మారెడ్డి తన మంచి మనసును మరోసారి చాటుకున్నాడు. ఆదివారం నాడు భూత్పూర్ మండలం అమిస్తాపూర్‌కి చెందిన ఇబ్రహీం పదేళ్ల క్రితం మాజీ మంత్రి లక్ష్మారెడ్డి దగ్గర డ్రైవర్‌గా పని చేసే సందర్భంలో హార్ట్ స్ట్రోక్‌తో మరణించాడు. ఆ సమయంలో ఇబ్రహీం కుటుంబానికి మాజీ మంత్రి ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలో డ్రైవర్ ఇబ్రహీం కూతురు వివాహ వేడుకకు మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. దశాబ్దం తరువాత కూడా మరిచిపోకుండా తన దగ్గర పని చేసిన డ్రైవర్ ఇబ్రహీం కుమార్తె వివాహానికి హాజరై మాజీ మంత్రి తన గొప్ప మనసు చాటుకున్నారు. తండ్రిని కోల్పోయిన ఆడబిడ్డ పెళ్లికి వెళ్లడాన్ని బాధ్యతగా, కర్తవ్యంగా భావించారు. పెద్ద దిక్కుగా ఆమె పెళ్లికి వెళ్లడం ఒక ప్రత్యేకమైన అనుభూతిగా భావించారు. ప్రజలతో ఉండే అనుబంధాలు రాజకీయాలకు మించినవని మరోసారి గుర్తు చేశారు.

## ముగిసిన సుంకిరెడ్డి మొబైల్ హెల్త్ క్యాంప్



ప్రజాపక్షం/కల్వకుర్తి : కల్వకుర్తి, వెల్దండ, చారకొండ మండలాల రిపోర్టర్స్‌కి అందుబాటులో కల్వకుర్తి ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించిన సుంకిరెడ్డి ఉచిత మొబైల్ హెల్త్ క్యాంపు సేవలు విజయవంతంగా ముగిశాయి. మూడు మండలాలకు చెందిన దాదాపు 130 మందికిపైగా జర్నలిస్టులు వారి కుటుంబసభ్యులకు విజయవంతంగా ఆరోగ్య పరీక్షలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ పాత్రికేయులు సమాజానికి నిజాన్ని అందించడానికి కష్టపడుతున్నారు అయితే వారి ఆరోగ్యంకూడా అంతే ముఖ్యమని అందులకే ఈ ఉచిత హెల్త్‌క్యాంపు ప్రారంభించామన్నారు. జర్నలిస్టులకు వారి కుటుంబాలకు ఉచితవైద్య పరీక్షలు, నిపుణుల సలహాలు, సూచనలు అందించి వారికి ఆరోగ్యంపై అవగాహన కల్పించడం మాప్రధాన లక్ష్యమన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని, ఆమన్‌గల్, కల్వకుర్తిలో నిర్వహించిన హెల్త్‌క్యాంపులలో మొత్తంగా 240మందికిపైగా జర్నలిస్టు సోదరులకు మాసేవలు అందాయన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల మీడియా మిత్రులతో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు నరేందర్‌గౌడ్, రఘు, యాదయ్య, రమేష్‌నాయక్, కొండల్ యాదవ్, శ్రీపతి, శేఖర్, శ్రీను, నాగిళ్లశివ, మహేష్, కల్యాణ్, భాస్కర్ పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం



ప్రజాపక్షం/కల్వకుర్తి : మండలంలోని ముకురాల గ్రామానికి చెందిన ముద్దమల్ల అంకమ్మ అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, బిఆర్ఎస్‌పార్టీ రాష్ట్ర నాయకులద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రనాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్‌చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతురాలి కుటుంబానికి తక్షణ ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్‌పార్టీజిల్లా నాయకులు దారమోనిగణేష్, కొత్తనరేందర్‌రెడ్డి, యాపర్ల నరేందర్‌రెడ్డి, నారమల్ల శరత్, మాజీవార్డుసభ్యులు మల్లేష్, అరవింద్, శ్రీనుగౌడ్, సైదులు, వెంకటయ్య, తిరుపతి, గోకారి తిరుపతయ్య పాల్గొన్నారు.

## మక్తల్‌లో జిల్లాస్థాయి షూటింగ్ బాల్ పోటీలు



ప్రజాపక్షం/మక్తల్: నారాయణపేట జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మక్తల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి జూనియర్ షూటింగ్ బాల్ బాల బాలికల పోటీలు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం ఆధ్వర్యంలో నిర్వహించగా, స్థానిక ఎస్సై రేవతి ముఖ్య అతిథిగా విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకుని, మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, రాష్ట్ర స్థాయి క్రీడల్లో విజయం సాధించాలని ఆమె తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో క్రీడా ప్రతిభను చాటిన క్రీడాకారులను ఎంపిక చేసి, ఈ నెల 22 నుండి 24 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరుగు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు పంపుతామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై త్రివేణిని, కోళ వెంకటేశ్, జాతీయ స్థాయి క్రీడాకారిణులు దివ్య, కళ్యాణి, హేమలత, కౌసల్య, ప్రవీణ లను బి.గోపాలం, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం, కాంగ్రెస్ నాయకుడు కోళ్ల వెంకటేశ్, జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్, పిడిలు కోశాధికారి బి.రూప, రేణుక, లావణ్య, నవీన్ కుమార్, అన్నదాత రుద్ర సముద్రం రామలింగం, తల్లిదండ్రులు నాగమణి, ఆంజనేయులు, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## తైక్వాండో పోటీలలో బిజినేపల్లి విద్యార్థులు



ప్రజాపక్షం/బిజినేపల్లి : ఇంటర్ డిస్ట్రిక్‌రాష్ట్రస్థాయి బిజినేపల్లి, వట్టెం, మహాదేవునిపేట, మంగనూర్ గ్రామాల నుండి 23మంది విద్యార్థులు పాల్గొని విజయం సాధించారని తైక్వాండో మాస్టర్ శ్రీహరి తెలిపారు. ఇందులో ఆరుమంది విద్యార్థులు గోల్డ్‌మెడల్స్, నలుగురు విద్యార్థులు సిల్వర్‌మెడల్స్, 9మంది విద్యార్థులు బ్రాన్స్‌మెడల్స్ సాధించారన్నారు. గోల్డ్‌మెడల్స్ సాధించిన ఆరుమంది విద్యార్థులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం రాయలురేలి జిల్లాలో నవంబర్ 7నుండి 10వతేదివరకు జరగబోయే జాతీయస్థాయి తైక్వాండోలో పాల్గొంటారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను మాస్టర్‌శ్రీహరి, జిల్లా తైక్వాండో కార్యదర్శిశేఖర్, జిల్లాకార్యదర్శి కోచ్‌మాస్టర్ ధనలక్ష్మి విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

## ఇంటర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాపక్షం/నారాయణపేట్ : నారాయణపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల 1983–85 బ్యాచ్ ఇంటర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నారాయణపేట పట్టణంలోని శిలా గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. నాలుగు దశాబ్దాల అనంతరం కలసిన చిన్ననాటి మిత్రులచే ఆప్యాయంగా పలకరింపులు, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని, యోగక్షేమాలను తెలుసుకొని సంబరపడ్డారు. అప్పుడు చదువు చెప్పిన గురువుల పోలప్ప, విట్టల్ రావు, ఆర్య, విట్టల్ రావు నామాజీ, దౌలత్ తదితరులకు ఘనంగా సన్మానించి ఆశీస్సులను పొందారు. సుమారు 102 మంది పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలిసి ఫోటోలు దిగి ఆనందపడ్డారు. చిన్నారులు నిర్వహించిన సంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో పూర్వ విద్యార్థులు ఉదయ్ కుమార్, మాణిక్ ప్రభు, శ్యాంసుందర్ గౌడ్, సరాఫ్ నాగరాజ్, పగడాకుల శ్రీనివాస్, ఆర్కంచి రవి, నారాయణమ్మ, ఉమాదేవి, లక్ష్మి , పద్మావతి, విఠోటా, మురళి, శివశంకర్, రోసినప్ప తదితరులు పాల్గొన్నారు.

## యోగా ద్వారా ఆరోగ్యం పదిలం

### యోగా గురువు కోల సైదులును సన్మానించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ప్రతి నిత్యం యోగా చేయడం ద్వారా మన ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. జూన్ 20న ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకోని హైద్రాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగిన యోగా దినోత్సవంలో పాల్గొన్న వారికి ఆదివారం ఆయన ఘనంగా సన్మానించారు. తెలంగాణ యోగా టీచర్స్ కోఆర్డినేషన్ కమిటీ తరుపున మిర్యాలగూడకు చెందిన కోల సైదులును ఆయన సన్మానించి ప్రశంసా పత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు యోగాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. యోగ సాధనపై ప్రజలకు తెలియచేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. యోగా ద్వారా సమాజానికి మంచి ఆరోగ్యాన్ని, ఆనందకరమైన జీవితాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సైతం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా సాధకులు, యోగా టీచర్లు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# రీల్

## 1న 'ఇడ్లీ కొట్టు' విడుదల



'కుబేర'తో బ్లాక్ బస్టర్ సక్సెస్ ని అందుకున్న నేషనల్ అవార్డ్ విన్నింగ్ సూపర్ స్టార్ ధనుష్ 'ఇడ్లీ కొట్టు' సినిమాతో అలరించబోతున్నారు. ధనుష్ హీరో, డైరెక్టర్ గా చేస్తున్న ఈ చిత్రాన్ని డాన్ పిక్చర్స్, వండర్‌బార్ ఫిల్మ్స్ బ్యానర్స్ పై ఆకాష్ బాస్కరన్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. డైరెక్టర్ గా ధనుష్ కి ఇది నాలుగో మూవీ. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం తెలుగు, తమిళ్ లో ఒకేసారి అక్టోబర్ 1న రిలీజ్ కానుంది. చాలా మంది ఈ సినిమా తెలుగు రైట్స్ కోసం పోటీ పడ్డారు. ఫైనల్ గా ధనుష్ కెరీర్ లోనే హైయెస్ట్ ప్రైస్ కి శ్రీ వేదక్షర మూవీస్ తెలుగు రైట్స్ ని దక్కించుకుంది. శ్రీ వేదక్షర మూవీస్ బ్యానర్ ద్వారా నిర్మాత రామారావు చింతపల్లి తెలుగులో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్మాత రామారావు చింతపల్లి మాట్లాడుతూ...ఈ సినిమాని అక్టోబర్ 1న ధనుష్ గారి కెరీర్ లోనే హైయెస్ట్ థియేటర్స్ లో గ్రాండ్ రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. తెలుగులో చాలా అగ్రెసివ్ గా ప్రమోట్ చేసి సినిమాని భారీగా రిలీజ్ చేయబోతున్నాం. ఈ సినిమా తెలుగు రైట్స్ మాకు ఇచ్చినందుకు ధనుష్ కి, టీం కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. నిత్యా మీనన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రంలో అరుణ్ విజయ్, షాలిని పాండే, సత్యరాజ్, రాజ్‌కిరణ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ మ్యూజిక్ అందిస్తున్నారు. కిరణ్ కౌశిక్ డీవోపీ గా పని చేస్తుండగా, ప్రసన్న జీకే ఎడిటర్, జాకీ ప్రొడక్షన్ డిజైనర్. పీటర్ హెయిన్ మాస్టర్ యాక్షన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు.'ఇడ్లీ కొట్టు' తెలుగు తమిళ్ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది. ధనుష్, నిత్యా మీనన్, అరుణ్ విజయ్, షాలిని పాండే, సత్యరాజ్, రాజ్‌కిరణ్ నటిస్తున్నారు.

## కవాయ్ ఐల్యాండ్స్‌లో విజయ్ దేవరకొండ

హీరో విజయ్ దేవరకొండ ఇటీవల యూఎస్ లోని కవాయ్ ఐల్యాండ్స్ వెకేషన్ వెళ్లారు. ఈ ఐల్యాండ్స్ లో బ్యూటిఫుల్ నేచర్ ను ఎంజాయ్ చేసిన ఫొటోస్, వీడియోస్ ఇన్ స్టా ద్వారా షేర్ చేశారు విజయ్. హవాయ్ లోని కవాయ్ ఐల్యాండ్స్ వరల్డ్ వైల్డ్ నేచర్ కు ప్రసిద్ధి. హిస్టారికల్ గానూ ఈ ఐల్యాండ్స్ కు ఎంతో ప్రత్యేకత ఉంది. ఫ్యామిలీ లేదా ఫ్రెండ్స్ తో కలిసి ఈ ట్రిప్ కు వెళ్లడం హ్యాపీగా ఉందని విజయ్ దేవరకొండ తన పోస్ట్ లో పేర్కొన్నారు. కవాయ్ ఐల్యాండ్స్ లోని బ్యూటిఫుల్ లొకేషన్స్ ఆకట్టుకున్నాయని ఆయన తెలిపారు. మరో వెకేషన్ వెళ్లేలోగా తన ప్రెజెంట్ మూవీస్ షూటింగ్ కు రెడీ అవుతున్నట్లు విజయ్ దేవరకొండ వెల్లడించారు. ఇటీవల కింగ్డమ్ తో పాన్ ఇండియా సక్సెస్ అందుకున్న విజయ్ దేవరకొండ, ప్రస్తుతం రౌడీ జనార్ధన, వీడీ 14 చిత్రాల్లో నటిస్తున్నారు.







## 'లక్ష్మణరేఖ' గోల్డెన్ జూబ్లీ వేడుక

గోపాలకృష్ణ దర్శకత్వంలో మురళీమోహన్, జయసుధ జంటగా నటించిన 'లక్ష్మణ రేఖ' చిత్రం విడుదలై 50 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుక నిర్వహించారు. చిత్ర దర్శకుడు గోపాలకృష్ణ, మురళీమోహన్, జయసుధతోపాటు ఈ చిత్రానికి కో డైరెక్టర్ గా పని చేసిన రాజేంద్రప్రసాద్ లను ఆత్మీయంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీరంతా 50 ఏళ్ళు వెనక్కి వెళ్ళి, అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. క్రమశిక్షణ, అంకితభావాలను లక్ష్మణరేఖలుగా మలచుకుని ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు రామసత్యనారాయణను అభినందించారు. సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ ప్రభు వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ వేడుకలో సీనియర్ దర్శకులు ధవళ సత్యం, పి.ఎన్. రామచంద్రరావు, తెలుగు నిర్మాతల మండలి ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రసన్న కుమార్, ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీర శంకర్, ఫిలిం నగర్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కాజా సూర్యనారాయణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్టులు సురేష్ కొండేటి, ధీరజ అప్పాజీ పాల్గొన్నారు.

## ఘనంగా 'దక్ష' ప్రీ రిలీజ్




మంచు లక్ష్మీ ప్రసన్న ప్రధాన పాత్రలో శ్రీలక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ అండ్ మంచు ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్లపై రూపొందుతున్న చిత్రం 'దక్ష ది డెడ్లీ కాన్స్పిరసీ'. ఈ సినిమాలో డాక్టర్ మంచు మోహన్ బాబు ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. తండ్రీ కూతుళ్లు కలిసి మొదటి సారిగా ఈ చిత్రంలో నటించడం విశేషం. ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం వంశీ కృష్ణ మల్లా అందించారు. ఈ నెల 19న ఈ సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమా రిలీజ్ ప్రెస్ మీట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాకింగ్ స్టార్ మంచు మనోజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంచు లక్ష్మీ మాట్లాడుతూ 'దక్ష' కథను నా దగ్గరకు నాన్న తీసుకొచ్చారు. ఆయనే ఈ కథను తీసుకొచ్చారా అనేది మొదట్లో నమ్మలేకపోయాను. ప్రతి చిత్రంలో మాకొక సొంత టీమ్ తయారవుతుంది. మహేశ్, జెమినీ సురేశ్ వంటి కో ఆర్టిస్టులతో మాకొక కొత్త టీమ్ ఫార్మ్ అయ్యింది. 'దక్ష' సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరూ ఇది తమ సినిమా అనుకునే నటించారు. మహేశ్ అయితే ప్రమోషన్స్ గురించి ఎలా చేయాలో చెప్పేవాడు. ఈ చిత్రంలో నాన్న ఇమేజ్ కు తగినట్లు పర్ఫెక్ట్ క్యారెక్టర్ ఉంది. అందుకే ఆయనను అడిగాం. సముద్రఖని, సిద్దిక్, విశ్వంత్, చిత్రా శుక్లా..ఇలా పాన్ ఇండియా వైజ్ చూస్తే ప్రతి భాష నుంచి పేరున్న ఆర్టిస్టులు మా చిత్రంలో నటించారు. నాన్న తర్వాత నన్ను అంత బాగా చూసుకునేది మనోజ్. అతను సినిమా చేయనప్పుడు ఇలాంటి మంచి ఆర్టిస్ట్ స్క్రీన్ మీద మళ్లీ ఎప్పుడు కనిపిస్తాడు అని ఒంటరిగా బాధపడ్డాను. మనోజ్ హీరోగానే కాదు విలన్ గానూ మెప్పించగలడు, కామెడీ చేయగలడు. వర్సటైల్ యాక్టర్ గా ప్రూవ్ చేసుకున్నాడు. 'దక్ష' సినిమాకు మనోజ్ ఇచ్చిన సజెషన్స్ ను తీసుకున్నాను. ఎందుకంటే మనోజ్ కు ఫిలిం మేకింగ్ మీద, ప్రతి క్రాఫ్ట్ మీద పట్టుంది. నాన్న గారితో అమితాబ్ పీకూ లాంటి మూవీ చేయాలని ఉంది. నటిగా నా ప్రయాణాన్ని ఆపను. తమిళం, మలయాళంలో కూడా నటించాను అని అన్నారు. రాకింగ్ స్టార్ మంచు మనోజ్ మాట్లాడుతూ నా మిరాయ్ మూవీని సక్సెస్ చేసినందుకు ప్రేక్షకులకు థ్యాంక్స్. నెకట్స్ వీక్ అక్క, నాన్న కలిసి నటించిన 'దక్ష' సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమాను కూడా మీరు పెద్ద సక్సెస్ చేయాలని కోరుకుంటున్నా. ఈ సినిమా కోసం అక్క చాలా కష్టపడింది. 'దక్ష' టీమ్ అందరికీ నా బెస్ట్ విశెస్ చెబుతున్నా. ప్రస్తుతం ప్రేక్షకులతో థియేటర్స్ కళకళలాడుతున్నాయి. లిటిల్ హారట్స్ హిట్ అయ్యింది, బెల్లంకొండ సాయి కిష్కిందపురి మంచి విజయాన్ని అందుకుంది. అలాగే మా మిరాయ్ ని ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. రెండు చిత్రాలు రిలీజై మంచి విజయం సాధించాయి. అందుకు బెల్లంకొండ సాయి బ్రదర్ కు కంగ్రాట్స్ చెబుతున్నా. నెకట్స్ 'దక్ష' రాబోతోంది అన్నారు.



## 'హే భగవాన్' సెట్‌లో శివానీ సంబరం

లిటిల్ హార్ట్స్ సక్సెస్ ఫుల్‌గా నడుస్తున్న నేపథ్యంలో హీరోయిన్ గా నటించిన శివానీ నాగారంకు మంచి పేరు వచ్చిం ది. ఈ తరుణంలో ఆమే హే భగవాన్ సినిమా షూటింగ్ లో పాల్గొంటున్నారు. షూటింగ్ సెట్‌కు వెల్లిన శివానీ నా గారంను సాదరంగా ఆహ్వానించి లిటిల్ హార్ట్స్ సినిమా సక్సెస్ అయినందుకు కేక్ కట్ చేశారు. హే భగవాన్ సినిమా షూటింగ్ సెట్ లో కేక్ కట్ చేసిన నటీ నటులు సంతోశాన్ని పంచుకున్నారు. హే భగవాన్ సినిమాలో సుహాస్ హీరోగా నటిస్తున్నారు. గతంలో శివాని నాగారం అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ లో సుహాస్ సరసన నటించింది. 'హే భగవాన్' షూటింగ్ జరుగుతుంది.

## భద్రకాళి లాంటి పొలిటికల్ థ్రిల్లర్ రామాంజనేయులు జవ్వాజి



హీరో విజయ్ ఆంటోనీ 'మార్గన్' విజయం తర్వాత మరో పవర్ ఫుల్ ప్రాజెక్ట్ 'భద్రకాళి'తో వస్తున్నారు. విజయ్ ఆంటోనీకి ల్యాండ్ మార్క్ మూవీగా నిలిచే ఈ చిత్రానికి అరుణ్ ప్రభు దర్శకత్వం వహించగా, సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌ను విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కనెక్ట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. 'భద్రకాళి' సెప్టెంబర్ 19న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాత రామాంజనేయులు జవ్వాజీ విలేకరుల సమవేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.విజయ్ ఆంటోనీ ఎప్పటినుంచో మంచి మిత్రులం. విజయ్ ఆంటోనీ ఫిలిం ఫ్యాక్టరీ, మా బ్యానర్ సర్వంత్ రామ్ క్రియేషన్స్ కలిపి కొన్ని మూవీస్ చేయాలని ప్రయాణం మొదలుపెట్టాం. మార్గాన్ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు భద్రకాళి సెప్టెంబర్ 19 రిలీజ్ కాబోతుంది. ఇటీవలే బూకి అనే సినిమాని మొదలుపెట్టాం. మలయాళం లో ఒక సినిమా చేస్తున్నాం. అది చివరి దశకు వచ్చింది. మా రెండు బ్యానర్స్ లో ఇంకొన్ని సినిమాలు కూడా చర్చల్లో ఉన్నాయి. త్వరలోనే వాటి గురించి అనౌన్స్ చేస్తాం. బిచ్చగాడు డైరెక్టర్ శశి, విజయ్ ఆంటోని కాంబినేషన్లో ఒక భారీ ప్రాజెక్టు ఉంటుంది. తొందరలో అది అనౌన్స్ చేస్తాం. మేము విజయ్ ఆంటోని గారు కలవడం వల్ల బ్యాక్ టు బ్యాక్ సినిమాలో చేస్తున్నాము. మా నుంచి వరుసగా సినిమాలు రాబోతున్నాయి.డైరెక్టర్ అరుణ్ ప్రభు గారు కథ చెప్పారు. చాలా బాగుంది. డైరెక్టర్ గారు అంతకుముందు తీసిన రెండు సినిమాలు కూడా చాలా అద్భుతంగా ఉంటాయి. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఇది విజయ్ ఆంటోనీకి 25వ సినిమా అవ్వడం కూడా కలిసి వచ్చింది. మార్గాన్ కి ముందు దాదాపు 11 సినిమాలు చేశాను. తమిళ్లో చాలా పెద్ద లెవెల్లో డిస్ట్రిబ్యూషన్ చేశాం. అయితే కోవిడ్ తర్వాత కొంచెం గ్యాప్ వచ్చింది. తర్వాత విజయ్ ఆంటోనీ గారితో రీ కనెక్ట్ అవడంతో మళ్లీ సినిమాల వరుసగా చేయాలని ప్లాన్ చేశాం. తెలుగులో సత్యదేవ్ గారితో ఫుల్ బాటిల్ అనే సినిమా చేస్తున్నాం. అది కంప్లీట్ అయి రెడీగా ఉంది. నవంబర్లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం.

## సుంకం రద్దు కత్తి

(మొదటి పేజీ తరువాయి)

బెదిరింపుల తర్వాత భారత్ దిగుమతి సుంకాన్ని రద్దు చేసింది. ఆగస్టు 15న ఎర్రకోట సాక్షిగా మోడీ భారత వ్యవసాయ రంగాన్ని కూడా చెప్పిన మాటలు మరిచి పోయి ఆగస్టు 19న దిగుమతి సుంకాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇది భారత వ్యవసాయ రంగానికి ప్రత్యేకించి పత్తి రైతాంగానికి ఆశ నిపాతంలా తగిలింది. తెలంగాణలో 66 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేస్తున్నారు.గతేడాది అతివృష్టి కారణంగా దిగుబడి రాక ఒకవిధంగా నష్టపోగా నాణ్యమైన పత్తి రాలేదని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) రైతుల వద్ద సరైన రీతిలో పత్తి కొనుగోలు చేయలేదు. ప్రైవేటు వ్యాపారులకు క్వింటా మూడు వేల నుంచి ఐదువేల నడుమ గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు విక్రయించాల్సి వచ్చింది. ఈ ఏడాది కూడా భారీ వర్షాలు పత్తి దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయి. ఒక పక్క దిగుబడి తగ్గి మరో పక్క గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న పత్తి రైతుపై దిగుమతి సుంకం రద్దు మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా తయారైంది. పత్తి ధర మరింత తగ్గితే పరిస్థితి ఏమిటన్న ఆందోళనలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.దశాబ్ద కాలంగా మోడీ రైతాంగ వ్యతిరేక విధానాలతో వ్యవసాయ రంగం రోజు రోజుకు సంక్షోభంలోకి కూరుకుపోతున్నది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఇప్పటికీ రోజుకు 31 మంది దేశ వ్యాప్తంగా రైతులు వ్యవసాయ రంగ నష్టాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇప్పటికే దేశీయ సంస్థలను, పారిశ్రామిక రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టిన మోడీ వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు యధాశక్తి ప్రయత్నిస్తున్నారు. నూటికి 65 శాతం మంది ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని పరిరక్షించడానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి మోడీ ప్రధాని అయ్యే వరకు వివిధ రూపాలలో ప్రోత్సాహాన్ని అందిస్తూ సబ్సిడీలను ఇచ్చేవారు. దశాబ్ద కాల మోడీ పాలనలో రూ. 87339 కోట్ల సబ్సిడీని తగ్గించారు. కొన్ని సబ్సిడీలను ఎత్తివేశారు. ఒక పక్క వ్యవసాయ రంగ సబ్సిడీలను ఎత్తివేస్తూ మరో పక్క కార్పొరేట్ శక్తులు సంపన్న వర్గాలకు రూ. 26 లక్షల కోట్ల రుణాలను రద్దు చేశారు. వ్యవసాయ రుణాలను రద్దు చేసేందుకు ససేమీరా అంటున్న బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామిక వేత్తలకు రూ. 26 లక్షల కోట్లు ఎలా రద్దు చేశారన్న ప్రశ్నకు సమాధానం చెప్పలేని పరిస్థితి. ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఉపాధి,ఉద్యోగ కల్పన రంగాలు వట్టిపోతున్నాయి. దేశ జనాభాలో సగభాగం ఉన్న యువతలో మూడొంతుల మంది ఉపాధి ఉద్యోగాలు లేక కొట్టుమిట్టాడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్న ఇప్పటికీ అతిపెద్ద ఉపాధి రంగంగా ఉన్న వ్యవసాయ రంగం పట్ల మోడీ సర్కార్ కక్ష పూరిత నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుంది. వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలోకి కూరుకుపోతే భారతదేశ ఆర్థిక రంగం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. నెలకో దేశం తిరిగే మోడీకి ఇతర దేశాల్లో వ్యవసాయ రంగానికి ఇస్తున్న ప్రోత్సాహకాలు కనిపించక పోవడం భారతదేశ రైతుల పాలిట శాపంగా మారింది. ఇప్పటికే వ్యవసాయ రంగం నుంచి యేటా లక్షలాది కుటుంబాలు వైదొలిగి ప్రత్యామ్నాయ రంగాల వైపు పయనిస్తున్నాయి. మోడీ ప్రభుత్వ నిర్ణయాలతో మరిన్ని మరిన్ని ఇబ్బందికర పరిస్థితులు తలెత్తి వ్యవసాయ రంగం ఇబ్బందులను ఎదుర్కొంటే అది జాతీయ విపత్తుగా మారే ప్రమాదం ఉంది. దేశంలో ప్రధానమైన వ్యవసాయ ఉత్పత్తులకు పెట్టుబడి ఆధారంగా మద్దతు ధర నిర్ణయించాలని దశాబ్దాలుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. మూడు సాగు చట్టాలకు సంబంధించి చారిత్రాత్మక పోరాటం నిర్వహించిన కిసాన్ సంయుక్త మోర్చా నేతృత్వంలో దేశ వ్యాప్తంగారైతు సంఘాలు పత్తి దిగుమతి సుంకం రద్దుపై ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. కేంద్రం దిగివచ్చి సుంకం రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడంతో పాటు ప్రధాన పంటలకు పెట్టుబడి ఆధారంగా మద్దతు ధర నిర్ణయించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ ఆందోళన తీవ్ర రూపం దాలిస్తే మోడీ సర్కార్‌కు చిక్కులు తప్పకపోవచ్చు. ఇదే సమయంలో మేధావులు, వామ పక్ష ప్రజాతంత్ర శక్తులకు చెందిన వారు వ్యవసాయ రంగ పరిరక్షణకు సంబంధించి గొంతెత్తడం శుభసూచికం.

## అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం భేష్

### చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధుల ప్రశంస
### సిపిఐ కేరళ కార్యాలయం సందర్శన



**తిరువనంతపురం:** అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం భేష్ అంటూ చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) ప్రతినిధుల ప్రశంసించారు. కేరళ, తిరువనంతపురంలోని సిపిఐ కేంద్ర కార్యాలయం, ఎంఎన్ మెమోరియల్‌ను చైనా ప్రతినిధులు సందర్శించారు. కమ్యూనిస్టు పార్టీలతో స్నేహాన్ని పెంచుకునే ఉద్దేశంతో వారు ఈ పర్యటన చేపట్టారు. ప్రతినిధులు హె మెంగ్, జౌ గ్యుహే, గువా డాంగ్‌డాంగ్‌కు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు కె.ప్రకాశ్ బాబు, మంత్రి జిఆర్ అనిల్ స్వాగతం పలికారు. భూ సంస్కరణలు, అక్షరాస్యత, ప్రజా పంపిణీ వ్యవస్థ, వ్యవసాయంలో పురోగతి, గృహాల నిర్మాణం, ఆరోగ్య సంరక్షణ తదితర రంగాల్లో సాధించిన విజయాలను చైనా ప్రతినిధులకు వివరించారు. కేరళ రాజకీయ చరిత్ర, అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోందని చైనా ప్రతినిధులు చెప్పారు. తమ అధ్యక్షుడు జిన్‌పింగ్ రాసిన పుస్తకాన్ని ప్రకాశ్ బాబుకు అందజేశారు. చైనా ప్రతినిధులను ప్రకాశ్ బాబు, అనిల్ సన్మానించారు.

## పోటాపోటీ ర్యాలీలు

(మొదటి పేజీ తరువాయి)

కేసులు నమోదు చేశారు. అమెరికాలోని ఉతాహ్ యూనివర్సిటీలో ట్రంప్ సన్నిహితుడు, మితవాద నాయకులు ఛార్లీ కిర్క్ హత్య ఘటన తర్వాత బ్రిటన్‌లో ఈ భారీ ర్యాలీ జరిగింది. బ్రిటన్‌లో మతఛాందన వాద నాయకుడు, ఇస్లాం వ్యతిరేక బ్రిటీష్ ప్రచారకుడు టామీ రాబిన్సన్ (స్టీఫెన్ క్రిస్టోఫర్ యాక్సీ లెన్నాన్) నాయకత్వంలో ఈ చరిత్రాత్మక ర్యాలీ జరిగింది. బ్రిటన్‌లోని మితవాద నాయకులలో టామీ రాబిన్సన్ ఎంతో ప్రముఖుడు. బ్రిటన్ ఫాసిస్టు రాజకీయపార్టీ బ్రిటీష్ నేషనల్ పార్టీ (బిఎన్‌పి) నాయకుడుగా 2004లో కెరీర్ ప్రారంభించిన రాబిన్సన్ తనను తాను స్వతంత్ర జర్నలిస్టుగా చెప్పుకుంటాడు. ఛార్లీ కిర్క్ హత్య తర్వాత రాబిన్సన్ ఈ ర్యాలీ నిర్వహించాడు. ఇతడి వలసనిర్మూలన,ఇస్లాం వ్యతిరేక వైఖరిని ప్రతిఘటిస్తూ జాతి వివక్షను వ్యతిరేకిస్తూ, స్టాండ్ అప్ టు రేసిజం (ఎస్‌యుటిఆర్) పేరుతో ఐదువేలమంది ప్రజ దర్శకులు పోటీ ర్యాలీ నిర్వహించారు. యునైటెడ్ కింగ్డన్–స్టాండ్ అప్ టూ రేసిజం ర్యాలీలు రెండూ దాదాపు దగ్గర దగ్గరకు చేరుకునే పరిస్థితుల్లో తీవ్ర ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి.

## యువతరానికి బూర్గుల గొప్ప మార్గదర్శి

### మంత్రి పొన్నం ప్రభాకర్, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ స్టేట్ ముఖ్యమంత్రిగా బూర్గుల రామకృష్ణారావు సేవలు అమోఘమని, యువతరానికి ఆయన గొప్ప మార్గదర్శి అని మంత్రి పొన్నం ప్రభా క ర్, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమా ర్‌గౌడ్ అన్నారు. ఆయన చూపిన మార్గంలోనే కాంగ్రెస్ పార్టీ నడుస్తూ ప్రజాసేవకు కట్టు బడి ఉందన్నారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులతో కలిసి హైదరాబాద్ లిబర్టీ క్రాస్ రోడ్‌లోని బూర్గుల రామకృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బూర్గుల రామకృష్ణారావు సిఎంగా చెరగని ముద్ర వేశారని కొనియడారు. ఆయన గొప్ప సామాజిక సంస్కార్త అన్నారు. వారి దూరదృష్టి ఇప్పటికీ మనందరికీ ఆదర్శమన్నారు. భవిష్యత్ తరాలకు బూర్గుల స్ఫూర్తి దాయక నేతగా నిలిచారన్నారు.

## బెగ్గర్స్ హోమ్స్‌ను సంస్కరించండి

(మొదటి పేజీ తరువాయి)

పెంచి స్వయంసమృద్ధి చేకూర్చాలని, తర్వాత వారి జీవన భరోసాతో బయటకు విడుదల చేయాలని తెలిపింది. స్వచ్ఛంధ సంస్థలకు, ప్రైవేటుసంస్థలకు శిక్షణ విషయంలో భాగస్వామ్యం ఇవ్వాలని తెలిపింది. రాష్ట్ర స్థాయిలో న్యాయవాదులు ఈ హోమ్స్‌లో ప్రతి మూడు నెలలకు ఒకసారి పర్యటనలు జరిపి తనిఖీలు చేయాలని, వారికున్న న్యాయపరమైన హక్కుల గురించి వారికి వివరించాలని తెలిపింది. రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ ఈ హోమ్స్‌లో పర్యటించేందుకు న్యాయవాదుల బృందాలను ఏర్పాటు చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొంది. పిల్లలు ఉండే సంక్షేమ కేంద్రాలలో ప్రత్యేక సదుపాయాలు సమకూర్చాలని తెలిపింది. వారి సంరక్షణ, వారి విద్య,గోప్యతలకు చర్యలు తీసుకోవాలని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే యాచక సంరక్షణ నిలయాలు కేవలం విచక్షణపూర్వకంగా ఏర్పాటు చేసే దాతృత్వ కేంద్రాలుగా ఉండకూడదని, ఈ కేంద్రాలు రాజ్యాంగ నైతిక విలువలను అనివార్యంగా ప్రతిబింబించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. రాష్ట్రాలలో ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు బెగ్గర్స్ హోమ్స్‌లో ఈ మార్గదర్శకాలకు, రాజ్యాంగ నైతిక విలువలకు అనుగుణంగా అవసరమైన వ్యవస్థాగత సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఆదేశించింది. యాచకుల జీవితాలకు భరోసా ఇవ్వాలని, వారి మర్యాద,గౌరవాలకు భంగం కలగకుండా చూడాలని ఆదేశించింది. సమాజంలో అత్యంత సున్నితమైన ఈ వర్గం మర్యాదపూర్వకమైన జీవితం గడిపేందుకు పూర్తి భరోసా ఇవ్వాలని మార్గదర్శకాల్లో తెలియజేసింది. బెగ్గర్స్ హోమ్స్‌లో మానవత్వాన్ని కాపాడేందుకు అనువైన పరిస్థితులు కల్పించడంలో విఫలం కావడం కేవలం దుష్పరిపాలన మాత్రమే కాదని, రాజ్యాంగ ఉల్లంఘన కిందకు వస్తుందని ధర్మాసనం హెచ్చరిక చేసింది.''కూటికి లేకుండా బాధపడే నిరుపేదలకు భరోసా ఇవ్వడం రాజ్యాంగంలో నిర్దేశించిన జీవించే మౌలికహక్కు, ఇది నిశ్చయార్థకమైనది, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలే నిస్సందేహంగా వీటిని నిర్వహించాలి, అందువల్ల ఇది రాజ్యాంగ విశ్వసనీయతను కాపాడటమే తప్ప ఏదో విచక్షణాపూర్వకంగా చేసే దాతృత్వం కాదు, అందువల్ల ప్రభుత్వ యంత్రాంగం ఈ కేంద్రాల నిర్వహణలో రాజ్యాంగ నైతిక విలువలను ప్రతిబింబించాలి, స్వేచ్ఛ, వ్యక్తిగత గోప్యత, శారీరక, భౌతిక స్వయంప్రతిపత్తితోపాటు మర్యాదపూర్వకంగా జీవించే పరిస్థితులు యాచకులకు కల్పించాలి'' అని ధర్మాసనం మార్గదర్శకాలలో వివరించింది. ''ఈ యాచక కేంద్రాలలో నెలవారీ వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయాలి, అర్హులైన వైద్యాధికారుల బృందం ఈ పరీక్షలు నిర్వహించాలి, వ్యాధులు ప్రబలకుండా గస్తీ నిర్వహించాలి, వ్యాధులు ప్రబలడానికి ముందుగానే జాగ్రత్తలు తీసుకుని వారికి సమాచారం తెలియజేయాలి, అందుకు తగిన వ్యవస్థ ఉండాలి, నీటిద్వారా వ్యాపించే వ్యాధులు, గాలి ద్వారా వ్యాపించే వ్యాధులు రాకుండా నివారణ చర్యలు తీసుకోవడం, వారికి తగిన సమాచారం చెప్పడంతోపాటు వాని నివారణకు ప్రత్యేకమైన చర్యలు అమలు చేయాలి, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వాలు కనీస పరిశుభ్రతా పరిస్థితులు, పరిశు భ్రతా ప్రమాణాలను కేంద్రాలలో పాటించాలి, ఇందుకు తగిన ప్రామాణికతలను నిర్దేశించాలి, మరుగుదొడ్ల పరిశుభ్రత ఎంతో ముఖ్యం, వాటిని ఎంతో జాగ్రత్తగా నిర్వహించాలి, డ్రైనేజీ పైప్‌లైన్ల వ్యవస్థ సక్రమంగా పనిచేస్తోందోలేదో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి, నిత్యం కీటకసంహార నియంత్రణ చర్యలను బెగ్గర్స్‌హోమ్స్‌లో తీసుకోవాలి, ప్రతి బెగ్గర్స్ హోమ్‌కు ఒక ఆసుపత్రిని అనుసంధానంగా ఉంచాలి'' అని సుప్రీం ధర్మాసనం మార్గదర్శకాల్లో వివరించింది. మూడోపక్షం ద్వారా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి బెగ్గర్స్ హోమ్స్‌లో స్వతంత్ర తనిఖీలు జరిపించి నివేదికలు తీసుకోవాని ప్రభుత్వాలకు ఆదేశించింది. ఈ కేంద్రాలనుండి విడుదల చేసిన యాచకులకు పునరావాసాన్ని కూడా పర్యవేక్షించాలని తెలిపింది.

## దారుణం...

(మొదటి పేజీ తరువాయి)

చోటుచేసుకుంది.. ఈ ఘటన హైదరాబాద్ నగరంలోని బండ్లగూడ పరిధిలో శనివారం జరిగింది. బాలుడి మృతదేహం కోసం పోలీసులు మూసీలో గాలిస్తున్నారు. ఏసీపీ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం, బండ్లగూడ నూరినగర్కు చెందిన మహ్మద్ అక్బర్(35), సనాబేగం దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. తండ్రి అక్బర్ కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. సనాబేగం నిలోఫర్ ఆసుపత్రిలో కేర్ చేస్తోంది. చిన్న కుమారుడు మహ్మద్ అనాస్(3) తరచూ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనిపై భార్యభర్తల మధ్య ఎక్కువగా గొడవలు జరుగుతూ ఉండేవి. దీంతో తండ్రి కన్నబిడ్డను చంపాలని నిర్ణయించుకొని పథకం రచించాడు.శుక్రవారం రాత్రి భార్య విధులకు వెళ్లాక తెల్లవారుజామున అనాస్ తలపై దిండు పెట్టి ఊపిరాడకుండా చేశాడు. ఆ తర్వాత సంచిలో మృతదేహాన్ని కుక్కి బ్రై తీసుకెళ్లాడు. అలా నయాపుల్ బ్రిడ్జి మీద నుంచి మూసీలోకి మృతదేహాన్ని విసిరాడు. అక్కడి నుంచి ఇంటికి వచ్చేసి, ఉదయం కాగానే పోలీస్ స్టేషన్కు వెళ్లి తన బిడ్డ కనిపించడం లేదని ఫిర్యాదు చేశాడు. బంధువులు తీసుకెళ్లి మళ్లీ తన ఇంటి దగ్గర దింపినట్లు ఫోన్ చేసి చెప్పారని, అప్పటి నుంచి తన కుమారుడు కనిపించడం లేదని పోలీసులకు చెప్పాడు.

**సిసిటివి కెమెరాలో చిక్కిన అక్బర్..**

పోలీసులకు అక్బర్‌పై అనుమానం కలిగింది. దీంతో అతని సెల్‌ఫోన్‌ను పరిశీలించారు. తన ఫోన్లో ఆ సమయానికి ఎలాంటి కాల్స్ రాలేదు. ఇంటి సమీపంలోని సిసిటివి కెమెరాలను పరిశీలించారు. తెల్లవారుజామున అక్బర్ సంచితో వెళ్తున్నట్లు కనిపించింది. దీంతో అతడిపై అనుమానం ఇంకా పెరిగింది. పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో నేరం అంగీకరించాడు. మూసీ నదిలో ఎక్కడ మృతదేహాన్ని విసిరేశాడో తెలిపాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ముమ్మర దర్యాప్తులో భాగంగా శనివారం రాత్రి పోలీసులు మూసీలో గాలించినా బాలుడి మృతదేహం మాత్రం లభించలేదు. సమయం మించిపోవడంతో చీకట్లో వెతకడాన్ని పోలీసులు నిలిపివేశారు. మళ్లీ ఆదివారం ఉదయం నుంచి నయాపుల్ వద్ద మూసీలో డీఆర్‌ఎఫ్ సిబ్బంది సహాయంతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

**కుటుంబ కలహాలతో భార్య గొంతుకోసిన భర్త**

నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి తన భార్య గొంతు కోశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలుకు చెందిన మహాలక్ష్మి (19), వేణుగోపాల్‌కు పెద్దల సమక్షంలో గతేడాది ఆగస్టులో వివాహం జరిగింది. తాగుడుకు బానిసగా మారి భార్య బంగారు నగలను అమ్ముకున్నాడు. కొంత బంగారాన్ని ఆమె పుట్టింట్లో దాచగా.. వాటిని తెమ్మని భార్యను వేధిస్తున్నాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు వేణుగోపాల్ కు కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు. అయినా అతడి తీరు మారలేదు. ఆదివారం బంధువుల ఇంట్లో గృహ ప్రవేశానికి వెళదామని భార్య కోరగా ఆమెతో గొడవపడ్డాడు. కోపంతో బ్లేడు తీసుకొని ఆమె గొంతు కోశాడు. గమనించిన స్థానికులు ఆమెను ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతోంది. నిందితుడు వేణుగోపాల్‌ను నాగోల్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com